



నిజాలు నిర్భయంగా చెప్పే

# చర్చ

జాతీయ తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 07 బుధవారం, జనవరి 07, 2026 , పేజీలు - 12 వెల : 2/-



## ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

**శ్వాసకోస సంబంధ సమస్యలతో చేరిక**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 6 :**కాంగ్రెస్ పార్లమెం టరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. సోనియాగాంధీ తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్న నేపథ్యంలో ఆమెను వైద్యులు పర్యవేక్షణలో ఉంచారు. ఆస్పత్రి వర్గాల సమాచారం ప్రకారం.. సోనియా గాంధీకి సీనియర్ పల్మనాలజిస్ట్ పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య మిగతా2లో...

## 10 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు

**- తెలంగాణ ప్రభుత్వం ప్రకటన**




**హైదరాబాద్,అక్టోబర్ 6:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ప్రకటించింది. జనవరి 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అన్ని పాఠశాలలకు సంక్రాంతి సెలవు లు ఇస్తున్నట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ సెలవులు ప్రభుత్వ, ప్రైవేటు, వాణిజ్య పాఠశాలలకు వర్తిస్తాయని పేర్కొంది. జనవరి 16వ తేదీన కనుమ రోజును పురస్కరించుకుని ఐచ్ఛిక సెలవు కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కనుమ రోజున రైతులు తమ పండుగను ప్రత్యేకంగా చేసుకుంటారు. కనుమ రోజున ఉత్సవాలు, పండుగ సంబరాలు జరుపుకోవడం మిగతా2లో...

# ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

**ఈవి వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల పెంపునకు చర్యలు**

**అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**



**హైదరాబాద్,అక్టోబర్ 6 :** ఈవి వాహనాల బ్యాటరీల సామర్థ్యం పెంపునకు కంపెనీలు చర్యలు చేపట్టాయని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈవి పాలసీ కింద తయారీదారులు, డీలర్లతో భేటీ ఏర్పాటు చేశామని అన్నారు. ఈవి వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెంపునకు చర్యలు ఉంటాయన్నారు. మంగళవారం శాసనసభలో పొన్నం మాట్లాడుతూ.. ఈవీ వాహనాల రాయితీ అమలుతో రూ.900 కోట్ల పన్ను నష్టం అని.. ఉద్యోగులు ఈవి వాహనాలు కొనుగోలు చేస్తే 20 శాతం తగ్గింపు ఉంటుందని పొన్నం తెలియజేశారు. ఉద్యోగులకు 20 శాతం వరకు తగ్గించాలని కంపెనీలను కోరామని అన్నారు. ఎంఎన్ సి కంపెనీలు ఈవి వాహనాలు కొనుగోలు చేసేలా విధానం ఉంటుందని, పిఎం ఈ డ్రైవ్ కింద 575 ఆర్టిసి బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. కొత్తగా 200కు పైగా ఈవి బస్సులు వస్తున్నాయని, వరంగల్ లో 100, నిజామాబాద్ లో 50 బస్సులు వస్తున్నాయని పేర్కొన్నారు. 15 ఏళ్లు దాటిన వాహనాలను స్క్రాప్ చేయాలని, స్క్రాప్ పాలసీ కింద ప్రోత్సాహం ఇచ్చేలా జివో మిగతా2లో...

## కేసీఆర్ చెప్పు ధూళికి కూడా సరితూగని రేవంత్

**● తెలంగాణ తెచ్చిన మొనగాడు కెసిఆర్ ● రేవంత్ మాత్రం రియల్ బ్రోకర్**

**● సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్**



**జనగామ,అక్టోబర్ 6 :** సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చెప్పు ధూళికి కూడా సరితూగడని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం జనగామలో బీఆర్ఎస్ తరఫున గెలిచిన సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన .. సీఎం రేవంత్‌రెడ్డిపైన, కాంగ్రెస్ ప్రభుత్వంపైన విమర్శల వర్షం గుప్పించారు. తెలంగాణ తెచ్చిన మొనగాడు కేసీఆర్ అని, అందుకే ఆయన తన తండ్రి అని గర్వంగా చెప్పుకుంటానని కేటీఆర్ అన్నారు. అలాంటి మొనగాడిని సవాలు చేస్తున్న రేవంత్ రెడ్డి అనేటోడు ఆయన చెప్పు ధూళికి కూడా సరిపోడని వ్యాఖ్యానించారు.

మిగతా2లో...



## అశాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటు

**- అసెంబ్లీలో చర్చించి సరిచేస్తామన్న పొంగులేటి**

**హైదరాబాద్,6 :** తెలంగాణలో గత ప్రభుత్వం జిల్లాలు, మండలాలను అశాస్త్రీయంగా, అసంబద్ధంగా రూపొందించిందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దీనిని సవరించాల్సి ఉందన్నారు. అసెంబ్లీ లో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి మాట్లాడుతూ..మ్యాజిక్ ఫిగర్ కోసమే రాష్ట్రంలో మండలాలు మిగతా2లో...

# 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

**● అందుకు అనుగుణంగా పెట్టుబడులకు ప్రోత్సాహం**

**● మండలిలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**



**హైదరాబాద్,అక్టోబర్ 6 :** తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలనే దృఢమైన సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. శాసనమండలిలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారులకు సులువుగా ఉండే విధంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ రైజింగ్ సదస్సులో రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఈనెల 19న మరోసారి వరల్డ్ ఎకనమిక్ సమిట్‌కు వెళుతున్నామని, భారీగా పెట్టుబడులు తీసుకొస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. హ్యూసెంట్రియో, సిస్టా ఐటీ సంస్థల ద్వారా వెయ్యి చొప్పున ఉద్యోగాలు వస్తాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. జాబ్ క్యాలెండర్ విషయంలో మిగతా2లో...



## సింగరేణిలో త్వరలో క్యాథ్ ల్యాబ్: భట్టి

**హైదరాబాద్,అక్టోబర్ 6 :** సింగరేణి కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్ ప్రారంభిస్తామని చెప్పారు. సింగరేణిపై శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 32మంది వైద్యుల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం. త్వరలో భర్తీ చేస్తాం. 176 మంది పారామెడికల్ సిబ్బంది నియామక పక్రియ జరుగుతోంది. సింగరేణి ఆస్పత్రుల్లో మార్చి నాటికి వైద్యులు,

మిగతా2లో...

## బ్లో ఔట్ వద్ద అదుపులో మంటలు

**95శాతం అదుపులో ఉన్నట్లు వెల్లడి**

**నిరంతరం నీటిని చిమ్మే ప్రయత్నం**

**అదుపులోకి రావడానికి మరో ఐదురోజులు**

**ఓఎన్‌జిసి అధికారుల వెల్లడి**



**అంబేద్కర్ కోనసీమ,అక్టోబర్ 6 :** ఇరుసు మండ బ్లోఔట్‌లో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకు వచ్చేందుకు ఓఎన్‌జీసీ సిబ్బంది శాయశక్తుల కృషి చేస్తున్నారు. దీనిపై డీప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నిర్వహిస్తున్న మోరి - 5 వెల్ ఫీల్డ్‌పై ఓఎన్‌జీసీ తాజాగా ప్రకటన విడుదల మిగతా2లో...



## తీవ్రం అవుతున్న పిచ్చికుక్కల బెడద

**- భైంసాలో ఒక్కరోజే 50 మందిపై దాడి**

**నిర్మల్, 6 :** కుక్కల స్వైర విహారంతో జనం బెంబేలెత్తి పోతున్నారు. అవి దాడి చేసినప్పుడు హడావిడి చేస్తున్న అధికారులు తరవాత మరిచి పోతు న్నారు. గ్రామం నుంచి పట్టణం వరకు కుక్కల బెడద తీవ్రం అవుతు న్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తాజా నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఓ పిచ్చి కుక్క బీభత్సం

మిగతా2లో...

## వరంగల్ కోట భూ ఆక్రమణలు తొలగించండి

**కోట తెలంగాణ వారసత్వ సంపద**

**సిఎం రేవంత్‌రెడ్డికు కిషన్ రెడ్డి లేఖ**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 6 :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ప్రధానంగా వరంగల్ కోట భూములను భారత పురావస్తుశాఖకు చెందినవిగా గుర్తించాలని సూచించారు. కోట భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కోట భూముల్లోని ఆక్రమణదారులను తొలగించ డం గురించి ఈ లేఖలో ప్రస్తావించారు. దాదాపు 250 సంవత్సరాలపాటు కాకతీ యుల రాజధానిగా కీర్తిగడించి ఘనమైన చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక వైభవంతో అలరారిన ఓరుగల్లు పట్టణం.. తెలంగాణ వారసత్వ సంపదకు మిగతా2లో...



# బ్లో ఔట్ వద్ద అదుపులో మంటలు

(మొదటి పేజీ తరువాయి)
చేసింది. న్యూఢిల్లీకి చెందిన డైరెక్టర్ విక్రమ్ సక్సెనాతో సహా ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ సీనియర్ మేనేజ్‌మెంట్, క్రైసిస్ మేనేజ్‌మెంట్ టీమ్ నిపుణులతో కలిసి ఈ మంటలను నియంత్రించేందుకు కార్యాచరణ చేపట్టినట్లు వివరించింది. అధిక సామర్థ్యం ఉన్న వాటర్ పంపులను వినియోగించి.. సమీపంలోని నీటిపారుదల వనరుల నుండి తాత్కాలిక కాలువను రూపొందించడానికి పనులు చేపట్టినట్లు తెలిపింది. అందుకోసం సమగ్ర బ్లో అవుట్ నియంత్రణ ప్రణాళికను ఖరారు చేసినట్లు పేర్కొంది. అగ్నికీలల తీవ్రతను తగ్గించేందుకు నిపుణుల బృందం పని చేస్తోందని తెలిపింది. 600 మీటర్ల వ్యాసార్ధంలో పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి గాలి నాణ్యత, శబ్ద స్థాయిలను బృందం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని ఓఎన్‌జీసీ వెల్లడించింది. ఇంకోవైపు ఈ మంటలను గూడవల్లి పంట కాల్వ నుంచి పైపుల ద్వారా నీటిని మళ్లించి మంటలను అదుపుచేస్తున్నారు. రాజమండ్రి, నర్సాపురంలోని ఓఎన్‌జీసీ బృందాలు రంగంలోకి దిగాయి. బావిలో నుంచి ఒత్తిడి తగ్గించేందుకు తమ వంతు ప్రయత్నాలను ఓఎన్‌జీసీ బృందం ముమ్మరం చేసింది. ఎగసిపడుతున్న అగ్నికీలలు కొంత మేర తగ్గాయని అధికారులు వివరిస్తున్నారు. మరోవైపు న్యూఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం.. బ్లోఔట్ ప్రదేశానికి చేరుకుని మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నిస్తోంది. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాతే.. ఈ ఘటన ఎలా జరిగింది? ఎవరు బాధ్యులనే అంశంపై చర్యలు చేపట్టనున్నారు. బ్లోఅవుట్ ప్రమాదంపై జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఓఎన్జీసీ టెక్నికల్ డైరెక్టర్ విక్రమ్ సక్సేనా సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో బ్లోఅవుట్ కట్టడి చర్యలు, భద్రతా పరిస్థితులపై స్పష్టత ఇచ్చారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమలోని గ్యాస్ బ్లోఅవుట్ మరో ఐదు రోజులు పాటు కొనసాగే అవకాశం ఉందన్నారు. అయితే ఇప్పటికే 95 శాతం బ్లోఅవుట్‌ను విజయవంతంగా కట్టడి చేశామని, మిగిలిన గ్యాస్‌ను క్యాపింగ్ చేసేందుకు మరికొంత సమయం పడుతుందన్నారు..అయితే, బ్లోఅవుట్ కొనసాగినా ఎలాంటి ప్రాణహాని, ప్రమాదం ఉండదని, పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని విక్రమ్ సక్సేనా తెలిపారు. గ్యాస్ లీక్ ప్రాంతంలో ప్రస్తుతం వాటర్ అంబ్రెల్లా భద్రతా విధానం అమలు చేస్తున్నామని, ఐదు వైపులా నిరంతరం నీరు చిమ్ముతూ మంటలు చెలరేగకుండా నియంత్రణ చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. భూభాగంలో మిగిలిన గ్యాస్‌ను పూర్తిగా నియంత్రించేందుకు రోజుకు అనేక టెక్నికల్ పరిశీలనలు, నిపుణుల సూచనలతో క్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇక, ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, ఒక్క ప్రాణి కూడా ప్రమాదానికి గురికాలేదని అధికారులు ధృవీకరించారు. బ్లోఅవుట్ కారణంగా కాలిపోయిన కొబ్బరి చెట్లు, దెబ్బతిన్న పంట భూములకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, మరో ఏడు రోజులు పాటు ఐదు వైపులా నీటిని చిమ్మే రక్షణ చర్యలు కొనసాగుతాయని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. బ్లోఅవుట్ పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు జిల్లా యంత్రాంగం, ఓఎన్జీసీ నిపుణులు, కేంద్ర,రాష్ట్ర విభాగాలు నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తాయని వెల్లడించారు. ప్రస్తుతం 95శాతం కట్టడి కావడంతో ప్రమాద తీవ్రత గణనీయంగా తగ్గిందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు అధికారులు.

# ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

(మొదటి పేజీ తరువాయి)
తీసుకువచ్చామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఈవీ పాలసీని తీసుకువచ్చామని, ఈ ఏడాది కాలంలో లక్ష ఈవీ వాహనాలు అమ్ముడయ్యాయని వెల్లడించారు. కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలని భాజపా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలపై కేంద్రం సబ్సిడీ ఇస్తోందని.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అలా ఇస్తోందా? అని ప్రశ్నించారు. ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఈవీలను తక్కువగా వినియోగిస్తున్నారు. రాష్ట్రం మొత్తంపై ఆ తరహా వాహనాలు 70 వేలే నడుస్తున్నాయి. కాలుష్యం తగ్గాలంటే ఈ సంఖ్య పెరగాలి. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ ప్రభుత్వం ప్రోత్సహించాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలి. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని వెంకట రమణారెడ్డి అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల మీద కేంద్రం సబ్సిడీ ఇస్తుంది.. తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల మీద సబ్సిడీ ఇస్తుందా? కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో 40శాతం మాత్రమే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఉందని తెలిపారు. ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహనాలను వాడటం లేదని.. తెలంగాణలో 70 వేల ఎలక్ట్రిక్ వాహనాలే నడుస్తున్నాయని వెల్లడించారు. పొల్యూషన్ తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలి.. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ.. ప్రోత్సహించాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలని తెలిపారు. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని చెప్పారు. త్రీ వీలర్, ఫోర్ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రమోట్ చేయాలని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. 'హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ చేయాలంటే.. ఎలక్ట్రిక్ వాహనాలను వాడాలి.. ఎలక్ట్రిక్, సోలార్ ప్యానెల్ తో నడిచే వాహనాలను ప్రోత్సహించాలి.. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలంటే పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలి.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి.. ఇవీ పాలసీని తీసుకుని వస్తున్నందుకు ధన్యవాదాలు' అని ఎమ్మెల్యే వెల్లడించారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలంటే ఈవీలను వాడాలని చెప్పారు. వినియోగం పెరిగేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలని.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీ పాలసీ తీసుకొస్తున్నందుకు ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# కేసీఆర్ చెప్పు ధూళికి కూడా సరితూగని రేవంత్

(మొదటి పేజీ తరువాయి)
కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్ పెడితేనే రేవంత్ రెడ్డి ఆగమాగం అయితున్నడని, ఆయన అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే అక్కడే గుండె ఆగి సస్తడని అన్నారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధిద్దామని ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ సూచించారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలన్న ఆలోచనతోనే ఓటు వేసి ఆయనను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన ప్రతి ఒక్క సర్పంచి మున్సిపల్ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని కోరారు. వరంగల్ జిల్లాలో సర్పంచులు పెద్ద సంఖ్యలో గెలిచారని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడ్డా, ఒత్తిళ్లకు గురిచేసినా పార్టీ కోసం నిలబడ్డారని ప్రశంసించారు. బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి ధన్యవాదాలు చెప్పారు. జనగామ ర్యాలీ చూస్తే 'కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు' అనిపించిందని అన్నారు. ప్రజలు గులాబీ జెండాను చూడగానే చప్పట్లు కొడుతుంటే సంతోషం అనిపించిందని, కాళోజీ మాటలు గుర్తొచ్చాయని అన్నారు. కేసీఆర్ ఎప్పుడు ముఖ్యమంత్రి అయితారా అని ప్రజలు కసితో ఎదురుచూస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ఏ పాత్ర లేకున్నా అన్ని పదవులు ఇచ్చిన పార్టీని వదిలి కడియం శ్రీహరి సీఎం రేవంత్ రెడ్డితో కలిశాడని విమర్శించారు. ఇక్కడి నిబద్ధత కలిగిన కార్యకర్తలు బీఆర్ఎస్ బలపర్చిన 150 మంది సర్పంచులను గెలిపించారని మెచ్చుకున్నారు. చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, రాణి రుద్రమదేవి పుట్టిన గడ్డ ఇదని కేటీఆర్ కీర్తించారు. సీఎం రేవంత్‌రెడ్డిపైన, రాష్ట్ర ప్రభుత్వంపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డి పాలన చేతగాక బీఆర్ఎస్ మీద నిందలు వేస్తున్నాడని ఆరోపించారు. ఏదో అడ్డిమారి గుడ్డిసూటిల సీఎం అయిన రేవంత్‌రెడ్డి.. మూడేళ్లు టైమ్‌పాస్ చేసిపోక అవాకులు, చెవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి రైతులకు యూరియా ఇయ్య చేతగాదుగానీ.. అబద్ధాలు అనర్గళంగా వస్తయని ఎద్దేవా చేశారు.'కేసీఆర్‌ను మల్ల మొలకెత్తనియ్యను' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి శపథం చేయడంపైనా కేటీఆర్ ÷రైయ్యారు. 'నువ్వేంది కేసీఆర్‌ను మొలకెత్తనియ్యకపోయేది' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. మీ కాంగ్రెస్ పార్టీ 60 ఏండ్లు తెలంగాణను తొక్కిపట్టిందని, తెలంగాణను మొలకెత్తనివ్వమని విర్రవీగిందని, అసుంటి కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణను మొలిపించిన మొగోడు, మొనగాడు కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. రైతులకు యూరియా ఇవ్వడంలో రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. సరిపడా యూరియా అందక రైతులు గోస పడుతున్నరని ఆవేదన వెలిబుచ్చారు. 'రేవంత్ పాలనలో యూరియా షాప్‌ల లేదు, యాప్‌ల లేదు' అని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కొత్తగా కార్డు అంటూ కొత్త పాట అందుకున్నరని అన్నారు. 'రైతులకు యూరియా తెలివిలేక నాటకాలాడుతున్న దద్దమ్మలు ఈ కాంగ్రెసోళ్లు' అని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రైతులకు సరిపడా ఎరువులు అందాయని, ఎరువుల దుకాణాల ముందు రైతులు లైన్‌లలో నిలబడాల్సిన అసవరం రాలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కేసీఆర్ స్వయంగా రైతు కాబట్టి రైతుల సమస్యలు తెలుసని, ఆయన రేవంత్‌రెడ్డిలా రియల్ ఎస్టేట్ బ్రోకర్ కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# ఎసిబికి చిక్కిన మరో లంచావతారం

## 50 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తాసిల్దార్



**కామారెడ్డి,అక్టోబర్ 6 :** కామారెడ్డి జిల్లాలో తహసీల్దార్ ఏసీబీ వలలో చిక్కాడు. రూ. 50 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నాగిరెడ్డిపేట మండల తహసీల్దార్గా పనిచేస్తున్న యార్లగడ్డ శ్రీనివాస్ రావుతో పాటు లంచం తీసుకోవడంతో మధ్యవర్తిగా వహించిన ప్రైవేట్ వ్యక్తి చినూరు అజయ్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. మండలానికి చెందిన ఓ వ్యక్తి తన తండ్రి పేరుపై ఉన్న వ్యవసాయ భూమిని తన పేరు మీద బదిలీ చేయాలని కోరగా అందుకు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ నేతృత్వంలో సిబ్బంది కార్యాలయంపై మాటు వేసి తహసీల్దార్ లంచం తీసుకుంటుండగా దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిని నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# హైకోర్టును ఆశ్రయించిన రకుల్ సోదరుడు

**హైదరాబాద్,అక్టోబర్ 6 :** ప్రముఖ నటి సోదరుడు అమన్ ప్రీత్‌సింగ్ హైకోర్టును ఆశ్రయించాడు. మాసబ్ ట్యాంక్ పోలీసు స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని పిటిషన్ వేశాడు. డ్రగ్స్ కేసులో అమన్‌ప్రీత్‌పై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మాదకద్రవ్యాల విక్రేతల నుంచి డ్రగ్స్‌ను కొనుగోలు చేసినట్లు కేసు నమోదైంది. అప్పటి నుంచి అమన్ పరారీలో ఉన్నాడు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశాడు. దీనిపై తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది.



# ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

(మొదటి పేజీ తరువాయి)
పరిస్థితి స్థిరంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో నెలకొన్న తీవ్ర వాయు కాలుష్యం కారణంగానే సోనియా గాంధీకి ఈ అనారోగ్యం ఏర్పడినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కాలుష్య స్థాయిలు పెరగడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వైద్యులు సూచించారు. వైద్యుల సూచనల మేరకు సోనియాగాంధీకి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా వైద్యులు గమనిస్తున్నట్లు సమాచారం. కాగా గతంలోనూ సోనియాగాంధీ పలు ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే.

# తీవ్రం అవుతున్న పిచ్చికుక్కల బెడద

(మొదటి పేజీ తరువాయి)
సృష్టించింది. సోమవారం ఒక్కరోజే 50మందిపై దాడిచేసి గాయపరిచింది. ఈ పిచ్చికుక్క దాడిలో నలుగురు చిన్నారులు, 20 మంది మహిళలు, 26 మంది పురుషులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భైంసా ప్రభుత్వ ఆస్పత్రిలో కుక్క కాటు బాధితులు భారీగా చేరారు. ఆస్పత్రి వైద్యులు తక్షణం మెడికల్ సహాయం అందిస్తున్నారు. పిచ్చి కుక్కలను పట్టుకోవడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి సరైన పరిష్కారం రాలేదని ఆవేదన చెందుతున్నారు. శునకాల దాడులతో తీవ్ర భయాందోళన చెందుతున్నామని వాపోయారు. తమ ప్రాణాలను కాపాడటానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. పిచ్చి కుక్కల దాడులపై ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. శునకాల దాడులు ప్రతిరోజూ పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. అధికారులు సకాలంలో స్పందించకపోతే తీవ్ర ఆందోళనలు చేపడతామని ప్రజలు హెచ్చరించారు. అధికారులు త్వరగా పిచ్చి కుక్కలను పట్టుకోవాలని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# వరంగల్ కోట భూ ఆక్రమణలు తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)
నిలయంగా విరాజిల్లుతోందని వ్యాఖ్యానించారు కిషన్‌రెడ్డి. కాకతీయుల కాలంలో ఇతర రాజ్యాల నుంచి ఎదురయ్యే దండయాత్రల నుంచి రాజధానికి రక్షణ కల్పించటం కోసం ఒక ప్రణాళిక ప్రకారం 7 ప్రాకారాలతో వరంగల్ కోటను ఎంతో పకడ్బందీగా నిర్మించారని పేర్కొన్నారు. ఢిల్లీ సుల్తానులు, హైదరాబాద్ నవాబుల దాడులను ఎదుర్కొన్న కోటని అభివర్ణించారు. నేటికీ కాకతీయుల శౌర్య పరాక్రమాలకు ప్రతీకగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రతిరోజూ వేలాదిమంది పర్యాటకులు ఈ కోటను సందర్శించి కోటలో దాగి ఉన్న శిల్ప సంపద, నిర్మాణ నైపుణ్యం, వందలాది ఆలయాలు, వాటి నేపథ్యం, కోట ప్రాధాన్యం గురించి తెలుసుకుంటున్నారని వెల్లడించారు కిషన్‌రెడ్డి. పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవలే సౌండ్, ఇల్యూమినేషన్ లైటింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసిందని వివరించారు. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో ఉన్న వరంగల్ కోట పరిరక్షణకు, నిర్మాణాల పునరుద్ధరణకు కేంద్రం నిరంతరం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన ఈ వరంగల్ కోటకు చుట్టూ ఉన్న 7 ప్రాకారాల్లో ప్రస్తుతం 3 ప్రాకారాలు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు కిషన్‌రెడ్డి. 3 ప్రాకారాలతో పాటు ఇతర ప్రాకారాలను కొంతమంది స్థానికులు ఆక్రమించి కోట భూముల్లో అనేక అక్రమ కట్టడాలు నిర్మించారని వెల్లడించారు. వరంగల్ కోట అధీనంలో ఉన్న ఒక స్మారక ప్రదేశమని, దీనికి సంబంధించిన భూములను ఆక్రమించడం, అందులో అక్రమంగా నిర్మాణాలను నిర్మించడం చట్టరీత్యానేరమని చెప్పుకొచ్చారు. వెంటనే ఆక్రమించిన భూములను ఖాళీ చేయాలని కోరుతూ అధికారులు ఆక్రమణదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చారని ప్రస్తావించారు కిషన్‌రెడ్డి. దే విషయాన్ని తెలియజేస్తూ తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో అధికారులు 04.11.2022న అలాగే, ఇటీవల 01.12.2025న వరంగల్ కలెక్టర్‌కి పలుమార్లు లేఖలు రాశానని గుర్తుచేశారు. తాను లేఖ రాసిన కోట భూములను పరిరక్షించటానికి వరంగల్ జిల్లా కలెక్టర్ ఎటువంటి చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# 10 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు

(మొదటి పేజీ తరువాయి)
ఆనవాయితీగా వస్తోంది. జనవరి 17వ తేదీ నుంచి అన్ని పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులను తమ ఇళ్లకు తీసుకురావడానికి తల్లిదండ్రులు ప్లాన్ చేసుకుంటున్నారు.

# అశాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)
రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టిందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్వ్యవస్థీకరణను సరిచేస్తామని పొంగులేటి పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ తప్పదాలతో ఒకే నియోజకవర్గంలోని నాలుగు మండలాలు.. నాలుగు జిల్లాల్లో ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చించి అందరి ఆమోదంతో పునర్వ్యవస్థీకరణ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

# సింగరేణిలో త్వరలో క్యాథ్ ల్యాబ్: భట్టి

(మొదటి పేజీ తరువాయి)
సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తాం. విశ్రాంత ఉద్యోగులు అక్కడ మందులు అందించేలా చర్యలు చేపడతాం అని భట్టి విక్రమార్క తెలిపారు.

# 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)
సామాజిక అంశం పరిశీలిస్తూన్నామని అన్నారు. ఉబెర్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని.. త్వరలో ఏర్పాటు చేస్తుందని, కాగ్నిజెంట్ సంస్థ ద్వారా 5 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని తెలియజేశారు. పోచారం ఇన్ఫోసిస్ సంస్థ విస్తరణ ద్వారా 17 వేల మంది ఉపాధి, విప్రో సంస్థ విస్తరణ ద్వారా మరో 5 వేల మందికి ఉపాధి ఉంటుందని అన్నారు. 70 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని కొనియాడారు. ఇప్పటికే 70 జిసిసిలు రాష్ట్రానికి వచ్చాయని.. సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లో ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే జినోమ్ వ్యాలీ నాలుగో దశ కూడా పూర్తయిందని, ఐటీ కంటే ఎక్కువగా ఫార్మా ఎగుమతులు జరుగుతున్నాయని అన్నారు. ఏరోస్పేస్, రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక

బుధవారం,
జనవరి 07, 2026



# దేశ భవిష్యత్తును నిర్మించే మౌన కర్మాగారం సరస్వతి శిశు మందిర్

- నవ భారతాన్ని నిర్మించే శిల్పులు శిశుమందిర్ గురువులు
- నేను ఇదే స్కూల్లో రేకుల షెడ్డు కింద చదువుకున్నా..
- సంస్కారం సైన్స్‌ంస్పోర్ట్స్ శిశు మందిర్
- సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి శిశు మందిర్ లోనే నేర్చుకున్నా
- నా పార్లమెంట్ పరిధిలోని శిశు మందిర్ లకు పక్కా భవనాలు నిర్మిస్తా
- నా పార్లమెంట్ పరిధిలోని శిశు మందిర్ లకు పక్కా భవనాలు నిర్మిస్తా
- శిశు మందిర్ లోని 9, 10వ తరగతి విద్యార్థులందరికీ సైకిళ్లు ఇస్తున్నా
- ల్యాప్ టాప్ లు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు క్రుషి చేస్తా
- శిశు మందిర్ లో చదువుకోవడం నా అద్రుష్టం... చదువుకోలేకపోవడం నా పిల్లల దురద్రుష్టం
- పాలకుల నిర్లక్ష్యంవల్ల పాఠశాలల్లో విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతోంది
- కనీస సౌకర్యాల్లేక అల్లాడుతున్నాయి
- విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఊసే లేదు
- యువతకు స్కూటీ హామీ జాడే లేదు
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ వారీగా డబ్బులిస్తామని ఆశ చూపారు
- సర్కార్ హామీలు, నిధులపై ఆధారపడకుండా పిల్లల భవిష్యత్తుకు పాటుపడుతున్న సంస్థ శిశు మందిర్
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- కరీంనగర్ సరస్వతి శిశు మందిర్ లో క్రీడా జ్యోతిని వెలిగించి 'ఖేల్ ఖుద్ద కార్యక్రమాన్ని ప్రారంభించిన బండి సంజయ్
- పిల్లలతో కలిసి వాలీబాల్ ఆడిన కేంద్ర మంత్రి




చర్చ:-కరీంనగర్ బ్యూరో :దేశ భవిష్యత్తును నిర్మించే మౌన కర్మాగారం సరస్వతి శిశు మందిర్ అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నవ భారతాన్ని నిర్మాణానికి క్రుషి చేసే శిల్పులు శిశు మందిర్ గురువులని కొనియాడారు. ఇంత గొప్ప స్కూల్ లో చదువుకోవడం గర్వంగా ఉందన్నారు. సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి, ధర్మం వంటి అంశాలు శిశు మందిర్ లోనే నేర్చుకున్నానని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలన్నింటికీ పక్కా భవనాలు నిర్మించడంతోపాటు ల్యాప్ టాప్ సహా ఇతర సౌకర్యాలన్నీ కల్పించేందుకు క్రుషి చేస్తానని హామీ ఇచ్చారు.కరీంనగర్ లోని హౌజింగ్ బోర్డు కాలనీలోని సరస్వతి శిశు మందిర్ లో రెండు రోజుల పాటు నిర్వహించే ఆటల పోటీల (ఖేల్ ఖుద్) ప్రారంభ కార్యక్రమానికి బండి సంజయ్ విచ్చేశారు. అఖండ జ్యోతి వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. పిల్లలతో కలిసి వాలీ బాల్ ఆడారు. టీచర్లతో కలిసి ఫోటోలు దిగారు. అంతకుముందు పిల్లలను ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడారు. ఏమన్నారంటే... సరస్వతి శిశు మందిర్ మీ స్కూలా? నా స్కూలా?... ఇది మన స్కూల్. ఈ శిశు మందిర్ లో చదువుతోపాటు సంస్కారం కూడా



నేర్పుతారు. శిశు మందిర్ అంటే ఒక బిల్డింగ్ గురించి కాదౌ హంగు అర్భాటం కాదు...దేశ భవిష్యత్తును మౌనంగా నిర్మిస్తున్న కర్మాగారం. మానవీయ విలువలను పెంపొదిస్తూ దేశ భవిష్యత్ కోసం నవ తరాన్ని తయారు చేయడంలో సరస్వతి శిశు మందిర్ విద్యాలయాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇందులో చదువుకోవడం మన అద్రుష్టం.

శిశుమందిర్ లో చదువుకున్న ఎంతో మంది అధికారులు అయ్యారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగులు అయ్యారు. రాజకీయ నేతలయ్యారు. శిశు మందిర్ లో చదువుకోవడంవల్లే నేను ఈ స్థాయికి చేరుకుని ప్రజలకు సేవ చేయగ లుగుతున్నా. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఆర్మీలో చేరి దేశానికి సేవ చేసేలా క్రుషి చేయాలని కోరుతున్నా.కార్పొరేట్ విద్యా సంస్థలు వచ్చాక డబ్బు సంపాదనలో పడి విద్య అనే పదాన్ని పూర్తిగా మార్చేశాయి. చదువు అంటే ర్యాంకులు, మార్కులు, ప్యాకేజీలు, ఫారి న్ కోసమే అన్నట్లుగా తయారైంది. శిశు మ దిర్ వ్యాపారం చేయదు. సరస్వతి శిశుమందిర్ అంటే ప్రభుత్వ పాఠశాల కాదు. ప్రైవేట్ పాఠశాల అసలే కాదు. ప్రజల మనసుల్లో నడిచే విద్యా ఉద్యమం. ఇది లాభం కోసమో, ఫలితాల కోసం నడిపే సంస్థ కాదౌ ఒక లక్ష్యం కోసం



నడిచే సంస్థ. భవిష్యత్తు కోసం పని చేసే సంస్థ. అణువణువూ దేశభక్తిని బోధించే సంస్థ.

మార్కులు మనిషిని తయారు చేస్తాయా? ర్యాంకులు విలువలను నేర్పుతాయా? ప్యాకేజీలు దేశభక్తిని పెంచుతాయా? అసలు మన భారతదేశానికి ఎట్లాంటి విద్య కావాలి? మార్కులు, ర్యాంకులే కాదు దేశభక్తిని, సంపూర్ణ మనిషిని నిర్మించే విద్య కావాలి. అది సరస్వతి శిశుమందిర్ లోనే దొరుకుతుంది.ఉదయం ప్రార్థన, వందే మాతరం, భారత మాత చిత్రానికి నమస్కారం వంటి కార్యక్రమాలతో పిల్లల రక్తంలో విలువలను నేర్పుతారు. పిల్లలకు రామాయణం, మహా భారతం గొప్పతనాన్ని, అందులోని విలువలను నేర్పుతారు. గీతా సారాన్ని అర్థమయ్యేలా చెబుతారు. అదే సమయంలో మ్యాథ్స్, సైన్స్, టెక్నాలజీ విద్యను బోధిస్తారు. అందుకే సంస్కారం సైన్సం స్పోర్ట్స్ శిశుమందిర్ విద్య అవుతుంది.సరస్వతి శిశు మందిర్ లో గురువు అంటే జీతం చూసే ఉద్యోగి కాదు, టైమ్ చూసే క్లర్క్ కాదు ఒక సాధకుడు. వీళ్లకు పెద్ద జీతాలు లేవు. పెద్ద పెద్ద వ్యాపార ప్రకటనలు ఉండవు. కానీ పెద్ద బాధ్యత ఉంది. దేశ భవిష్యత్తు భుజాల మీద వేసుకుంటారు. "దేశాన్ని నిర్మించే అసలైన శిల్పులు శిశుమందిర్ గురువులు.

"విద్యతో సంపాదన రావచ్చు. కానీ విద్యతో సంస్కారం రాకపోతే ఆ సంపాదన కుటుంబానికి, సమాజానికి భారమే. ఇది గమనించే సరస్వతి శిశుమందిర్ పిల్లలను ఉద్యోగార్థులుగా కాదు, దేశ సేవకులుగా తయారు చేస్తుంది. ఇక్కడి విద్యార్థి తన గురించి మాత్రమే కాదు, సమాజం గురించి ఆలోచిస్తాడు. ఇదే నిజమైన విద్య.

సరస్వతి శిశుమందిర్ అంటే ఒక భవనం కాదు, ఒక బ్లాక్ బోర్డు కాదు... ఒక సంకల్పం, ఒక సంస్కార దీపం. భారత మాత సేవ. "సరస్వతి శిశుమందిర్ పిల్లలకు విద్య ఇస్తుంది కాదు. దేశానికి దిశ చూపిస్తుంది.

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యా వ్యవస్థను కాంగ్రెస్ పాలకులు నిర్వీర్యం చేస్తున్నారు. ప్రతి విద్యార్థికి 5 లక్షల భరోసా కార్డు ఇస్తామని మోసం చేశారు. గత నాలుగేళ్లుగా దాదాపు రూ.10 వేల కోట్ల ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులను, యాజమాన్యాలను ఇబ్బంది పెడుతున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్ ఇస్తామన్నారు. ఆ ఊసే లేదు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు టెన్త్ పాసైతే రూ.10 వేలు, ఇంటర్ పాసైతే 15 వేలు, డిగ్రీ చేస్తే 25 వేలు, పీజీ చేస్తే లక్ష రూపాయలు ఇస్తామన్నారు. నయాపైసా ఇయ్యలేదు. ఆఖరికి తమ జీవితం మొత్తాన్ని స్కూల్ కు, ప్రభుత్వానికి అంకితం చేసిన రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగులు దాచుకున్న సొమ్మును ఇవ్వాలని అడిగిన పాపానికి కాంగ్రెస్ ప్రభుత్వం వారిని అరెస్ట్ చేసి ఇబ్బంది పెడుతుంది.ప్రభుత్వం మీద ఆధారపడకుండా విద్యను బోధిస్తున్న సంస్థ శిశు మందిర్. నేను ఈ స్కూల్ లోనే చదువుకుని ఇంత వాడి నయ్యానని కాలర్ ఎగరేసి చెప్పగలను. విద్య, సభ్యత, సంస్కారం, దేశభక్తి కూడా ఇక్కడే

నేర్చుకున్నా. ధర్మ రక్షణ కోసం ఒక లక్ష్యన్ని ఏర్పరచుకుని ముందుకు వెళుతున్న. శిశు మందిర్ విద్యార్థులంతా ఒక లక్ష్యన్ని నిర్దేశించుకుని కష్టపడి భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరుతున్నా. శిశు మందిర్ లను ఆదరించండి. ప్రోత్సహించండి.దేశ భవిష్యత్తును నిర్మించే మౌన కర్మాగారం సరస్వతి శిశు మందిర్

- నవ భారతాన్ని నిర్మించే శిల్పులు శిశు మందిర్ గురువులు
- నేను ఇదే స్కూల్లో రేకుల షెడ్డు కింద చదువుకున్నా..
- సంస్కారం సైన్స్‌ంస్పోర్ట్స్ శిశుమందిర్
- సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి శిశు మందిర్ లోనే నేర్చుకున్నా
- నా పార్లమెంట్ పరిధిలోని శిశు మందిర్ లకు పక్కా భవనాలు నిర్మిస్తా
- నా పార్లమెంట్ పరిధిలోని శిశు మందిర్ లకు పక్కా భవనాలు నిర్మిస్తా
- శిశు మందిర్ లోని 9, 10వ తరగతి విద్యార్థులందరికీ సైకిళ్లు ఇస్తున్నా
- ల్యాప్ టాప్ లు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు క్రుషి చేస్తా
- శిశు మందిర్ లో చదువుకోవడం నా అద్రుష్టం... చదువుకోలేకపోవడం నా పిల్లల దురద్రుష్టం
- పాలకుల నిర్లక్ష్యంవల్ల పాఠశాలల్లో విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతోంది
- కనీస సౌకర్యాల్లేక అల్లాడుతున్నాయి
- విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఊసే లేదు
- యువతకు స్కూటీ హామీ జాడే లేదు
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ వారీగా డబ్బులిస్తామని ఆశ చూపారు
- సర్కార్ హామీలు, నిధులపై ఆధారపడకుండా పిల్లల భవిష్యత్తుకు పాటుపడుతున్న సంస్థ శిశు మందిర్
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- కరీంనగర్ సరస్వతి శిశు మందిర్ లో క్రీడా జ్యోతిని వెలిగించి 'ఖేల్ ఖుద్ద కార్యక్రమాన్ని ప్రారంభించిన బండి సంజయ్
- పిల్లలతో కలిసి వాలీబాల్ ఆడిన కేంద్ర మంత్రి

దేశ భవిష్యత్తును నిర్మించే మౌన కర్మాగారం సరస్వతి శిశు మందిర్ అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నవ భారతాన్ని నిర్మాణానికి క్రుషి చేసే శిల్పులు శిశుమందిర్ గురువులని కొనియాడారు. ఇంత గొప్ప స్కూల్ లో చదువుకోవడం గర్వంగా ఉందన్నారు.



సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి, ధర్మం వంటి అంశాలు శిశు మందిర్ లోనే నేర్చుకున్నానని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల లన్నింటికీ పక్కా భవనాలు నిర్మించడంతోపాటు ల్యాప్ టాప్ సహా ఇతర సౌకర్యాలన్నీ కల్పించేందుకు క్రుషి చేస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్ లోని హౌజింగ్ బోర్డు కాలనీలోని సరస్వతి శిశు మందిర్ లో రెండు రోజుల పాటు నిర్వహించే ఆటల పోటీల (ఖేల్ ఖుద్) ప్రారంభ కార్యక్రమానికి బండి సంజయ్ విచ్చేశారు. అఖండ జ్యోతి వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. పిల్లలతో కలిసి వాలీబాల్ ఆడారు. టీచర్లతో కలిసి ఫోటోలు దిగారు. అంతకుముందు పిల్లలను ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడారు. ఏమన్నారంటే... సరస్వతి శిశు మందిర్ మీ స్కూలా? నా స్కూలా?... ఇది మన స్కూల్. ఈ శిశు మందిర్

లో చదువుతోపాటు సంస్కారం కూడా నేర్పుతారు. శిశు మందిర్ అంటే ఒక బిల్డింగ్ గురించి కాదౌ హంగు అర్భాటం కాదు...దేశ భవిష్యత్తును మౌనంగా నిర్మిస్తున్న కర్మాగారం. మానవీయ విలువలను పెంపొదిస్తూ దేశ భవిష్యత్ కోసం నవ తరాన్ని తయారు చేయడంలో సరస్వతి శిశు మందిర్ విద్యాలయాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇందులో చదువుకోవడం మన అద్రుష్టం.శిశు మందిర్ లో చదువుకున్న ఎంతో మంది అధికారులు అయ్యారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగులు అయ్యారు. రాజకీయ నేతలయ్యారు. శిశు మందిర్ లో చదువుకోవడంవల్లే నేను ఈ స్థాయికి చేరుకుని ప్రజలకు సేవ చేయగలుగుతున్నా. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఆర్మీలో చేరి దేశానికి సేవ చేసేలా క్రుషి చేయాలని కోరుతున్నా.కార్పొరేట్ విద్యా సంస్థలు వచ్చాక డబ్బు సంపాదనలో పడి విద్య అనే పదాన్ని పూర్తిగా మార్చేశాయి. చదువు అంటే ర్యాంకులు, మార్కులు, ప్యాకేజీలు, ఫారిన్ కోసమే అన్నట్లుగా తయారైంది. శిశు మందిర్ వ్యాపారం చేయదు. సరస్వతి శిశు మందిర్ అంటే ప్రభుత్వ పాఠశాల కాదు. ప్రైవేట్ పాఠశాల అసలే కాదు. ప్రజల మనసుల్లో నడిచే విద్యా ఉద్యమం. ఇది లాభం కోసమో, ఫలితాల కోసం నడిపే సంస్థ కాదౌ ఒక లక్ష్యం కోసం నడిచే సంస్థ. భవిష్యత్తు కోసం పని చేసే సంస్థ. అణువణువూ దేశభక్తిని బోధించే సంస్థ. మార్కులు మనిషిని తయారు చేస్తాయా? ర్యాంకులు విలువలను నేర్పుతాయా? ప్యాకేజీలు దేశభక్తిని పెంచుతాయా? అసలు మన భారతదేశానికి ఎట్లాంటి విద్య కావాలి? మార్కులు, ర్యాంకులే కాదు దేశభక్తిని, సంపూర్ణ మనిషిని నిర్మించే విద్య కావాలి. అది సరస్వతి శిశుమందిర్ లోనే దొరుకుతుంది.

ఉదయం ప్రార్థన, వందే మాతరం, భారత మాత చిత్రానికి నమస్కారం వంటి కార్యక్రమాలతో పిల్లల రక్తంలో విలువలను నేర్పుతారు. పిల్లలకు రామాయణం, మహా భారతం గొప్పతనాన్ని, అందులోని విలువలను నేర్పుతారు. గీతా సారాన్ని అర్థమయ్యేలా చెబుతారు. అదే సమయంలో మ్యాథ్స్, సైన్స్, టెక్నాలజీ విద్యను బోధిస్తారు. అందుకే సంస్కారం సైన్సం స్పోర్ట్స్ శిశుమందిర్ విద్య అవుతుంది.సరస్వతి శిశుమందిర్ లో గురువు అంటే జీతం చూసే ఉద్యోగి కాదు, టైమ్ చూసే క్లర్క్ కాదు ఒక సాధకుడు. వీళ్లకు పెద్ద జీతాలు లేవు. పెద్ద పెద్ద వ్యాపార ప్రకటనలు ఉండవు. కానీ పెద్ద బాధ్యత ఉంది. దేశ భవిష్యత్తు భుజాల మీద వేసుకుంటారు. "దేశాన్ని నిర్మించే అసలైన శిల్పులు శిశుమందిర్ గురువులు.

"విద్యతో సంపాదన రావచ్చు. కానీ విద్యతో సంస్కారం రాకపోతే ఆ సంపాదన కుటుంబానికి, సమాజానికి భారమే. ఇది గమనించే సరస్వతి శిశుమందిర్ పిల్లలను ఉద్యోగార్థులుగా కాదు, దేశ సేవకులుగా తయారు చేస్తుంది. ఇక్కడి విద్యార్థి తన గురించి మాత్రమే కాదు, సమాజం గురించి ఆలోచిస్తాడు. ఇదే నిజమైన విద్య.సరస్వతి శిశు మందిర్ అంటే ఒక భవనం కాదు, ఒక బ్లాక్ బోర్డు కాదు... ఒక సంకల్పం, ఒక సంస్కార దీపం. భారత మాత సేవ. "సరస్వతి శిశు మందిర్ పిల్లలకు విద్య ఇస్తుంది కాదు. దేశానికి దిశ చూపిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యా వ్యవస్థను కాంగ్రెస్ పాలకులు నిర్వీర్యం చేస్తున్నారు. ప్రతి విద్యార్థికి 5 లక్షల భరోసా కార్డు ఇస్తామని మోసం చేశారు. గత నాలుగేళ్లుగా దాదాపు రూ.10 వేల కోట్ల ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులను, యాజమాన్యాలను ఇబ్బంది పెడుతున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్ ఇస్తామన్నారు. ఆ ఊసే లేదు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు టెన్త్ పాసైతే

రూ.10 వేలు, ఇంటర్ పాసైతే 15 వేలు, డిగ్రీ చేస్తే 25 వేలు, పీజీ చేస్తే లక్ష రూపాయలు ఇస్తామన్నారు. నయాపైసా ఇయ్యలేదు. ఆఖరికి తమ జీవితం మొత్తాన్ని స్కూల్ కు, ప్రభుత్వానికి అంకితం చేసిన రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగులు దాచుకున్న సొమ్మును ఇవ్వాలని అడిగిన పాపానికి కాంగ్రెస్ ప్రభుత్వం వారిని అరెస్ట్ చేసి ఇబ్బంది పెడుతుంది.ప్రభుత్వం మీద ఆధారపడకుండా విద్యను బోధిస్తున్న సంస్థ శిశు మందిర్. నేను ఈ స్కూల్ లోనే చదువుకుని ఇంత వాడినయ్యానని కాలర్ ఎగరేసి చెప్పగలను. విద్య, సభ్యత, సంస్కారం, దేశభక్తి కూడా ఇక్కడే నేర్చుకున్నా. ధర్మ రక్షణ కోసం ఒక లక్ష్యన్ని ఏర్పరచుకుని ముందుకు వెళుతున్న. శిశు మందిర్ విద్యార్థులంతా ఒక లక్ష్యన్ని నిర్దేశించుకుని కష్టపడి భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరుతున్నా. శిశు మందిర్ లను ఆదరించండి. ప్రోత్సహించండి.

## కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయండి

**– బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు**



చర్చ, జూలూరుపాడు:భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు జనవరి 7వ తేది బుధవారం ఉదయం 10:00 గం:లకు ఖమ్మం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు మంగళవారం జూలూరుపాడు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ పర్యటనలో భాగంగా ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులకు (సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు) ఆత్మీయ అభినందనసభ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈసభలో ముఖ్యఅతిథిగా కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పాల్గొని గ్రామ ప్రజాప్రతినిధులను శాలువాతో సత్కరించి, అభినందిస్తారన్నారు.ఈ సభకు వైరా నియోజకవర్గ పరిధిలోని. మండల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు ఎంపీటీసీలు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయవలసిందిగా గిరిబాబు కోరారు.

## అంబులెన్స్ డ్రైవర్ల రెస్ట్ రూమ్ ను ప్రారంభించిన చీఫ్ మెడికల్ ఆఫీసర్





చర్చ, సింగరేణి:సింగరేణి కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ నందు రెనోవేషన్ చేసిన అంబులెన్స్ డ్రైవర్స్ రూమును ప్రారంభించిన చీఫ్ మెడికల్ ఆఫీసర్ మరియు ఏఐటీయూసీ నాయకులు. మంగళవారం నాడు కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలో గల సింగరేణి మెయిన్ హాస్పిటల్ నందు అంబులెన్స్ డ్రైవర్స్ రెస్ట్ తీసుకోవడం కోసం ఏర్పాటుచేసిన రూము పూర్తిగా దెబ్బ తినడంతో ఏఐటియుసి అనుబంధ ప్రైవేట్ డ్రైవర్స్ యూనియన్ విజ్ఞప్తి మేరకు సింగరేణి సివిల్ అధికారులు కాంట్రాక్టర్ ద్వారా అంబులెన్స్ డ్రైవర్ల రూమును ఇటీవల రెనోవేషన్ గావించినారు. అట్టి రూమును చీఫ్ మెడికల్ ఆఫీసర్ శ్రీ కిరణ్ రాజ్ కుమార్ చేతుల మీదగా మరియు ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే డబ్ల్యూ కృష్ణ ఫర్ ల చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ఓ మరియు యూనియన్ నాయకులు మాట్లాడుతూ అంబులెన్స్ డ్రైవర్ల రూముకు సకాలంలో మరమత్తులు చేయించిన సివిల్ అధికారులకు మరియు అందుకు సహకరించి పని చేయించిన కాంట్రాక్టర్కు కృతజ్ఞతలు తెలియజేశారు. విధి నిర్వహణలో అసౌకర్యానికి గురికాకుండా ఉండం కోసం వెయిటింగ్ సమయంలో పూర్తిస్థాయిలో రెస్ట్ తీసుకోవడం కోసం ఏర్పాటుచేసిన రెస్టు రూమును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీమతి సునీల , వెల్ఫేర్ ఆఫీసర్ అవినాష్ హాస్పటల్ సిబ్బందితోపాటు డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు జె మధు కుమార్ నాయకులు రాకేష్, చందర్ , రవి, సురేష్, సద్దాం, ధన భద్రం తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షల హాల్ టైట్ డౌన్‌లోడ్ చేసుకోవాలి



చర్చ,పెద్దపల్లి:టెక్నికల్ సర్టిఫిట్ కోర్సు పరీక్షల హాల్ టిట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ నెల 10 నుండి 13 తేది వరకు నిర్వహించనున్న టెక్నికల్ సర్టిఫైట్ కోర్సు పరీక్షల హాల్ ట్రిక్టలను అధికారిక వెబ్ సైట్ ఞఞఞ.ఎంప్.వశ్రీఖఅస్త్రుఋ.స్త్రశీజ.అఅ లో నుంచి అభ్యర్థులు జనవరి 3 నుండి వారి జిల్లా పేరు, ట్రేడ్ కోడతో ట్రేడ్ పేరు, అభ్యర్థి పేరును ఎంచుకోవడం ద్వారా ,అభ్యర్థి పుట్టిన తేదీ (ణణ/వీహ్/) నమోదు చేయడం ద్వారా హాల్ ట్రిక్టలను డౌన్లోడ్ చేసుకోవడానికి వీలు కల్పించమనీ, ఏదైనా స్పష్టత కోసం అభ్యర్థులు పెద్దపల్లి జిల్లా విద్యా అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చు అని విద్యాశాఖాధికారి జి. శారద ప్రకటనలో పేర్కొన్నారు.

## గిరిజన సంఘాల జేఏసీ




చర్చ :-కరీంనగర్ బ్యూరో :కూటమి ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ రాష్ట్రంలో పాలన సాగిస్తుందని గిరిజన ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షులు మానుపాటి నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు మేయర్ పదవిని వెంటనే ఎస్టీ అభ్యర్థితో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే అన్ని గిరిజన సంఘాలతో కలసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్ ప్రెస్క్లబ్లో మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గిరిజన సంఘాల జేఏసీ అధ్యక్షులు మానుపాటి నవీన్, ఏ వై హెచ్ పి ఎస్ జాతీయ అధ్యక్షులు ఎన్ ధర్మ, జేఏసీ నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశాంలొ వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన గిరిజనుల తలరాతలు మారడం లేదన్నారు. రాజ్యాంగంలో ఎస్టీలకు ఇచ్చిన హక్కులకు ప్రభుత్వాలు గండి కొడుతున్నాయన్నారు. నెల్లూరులో మేయర్ పదవి ఎస్టీకి రాజ్యాంగబద్ధంగా కేటాయించబడిందని, గత ప్రభుత్వంలో గిరిజన మహిళ మేయర్ పదవిలో కొనసాగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో గిరిజన మహిళపై దాడుల్లో నేపథ్యంలో రాజీనామా చేస్తే ఇంతవరకు మేయర్ పదవిని కుట్రపూరితంగా భర్తీ చేయలేదన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం ఎస్టీ అభ్యర్థితో మేయర్ పదవిని భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న గిరిజనుల పై దాడులు ఆపాలన్నారు. లేకుంటే గిరిజన సంఘాలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు.

# న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైనది

– రాష్ట్ర ఆవోప అడ్వైజర్ స్వరాజ్ బాబు



చర్చ :- కరీంనగర్ : న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైనది, సమాజం లో మంచి గుర్తింపు కలిగినది వృత్తి అని తెలంగాణ రాష్ట్ర ఆవోప అడ్వైజర్ గంజి స్వరాజ్ బాబు అన్నారు. స్థానిక కృష్ణ నగర్ ఆవోప భవనం లో కరీంనగర్ టౌన్ ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవొపా) అధ్యక్షులు నలుమచు సుదర్శనం ఆధ్వర్యంలో సోమవారం సాయంకాలం న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గంజి స్వరాజ్ బాబు హాజరైనారు. ఈ సంద ర్భంగా అధ్యక్షులు నలుమచు సుదర్శనం మాట్లాడుతూ విశిష్ట సేవలు అందిస్తున్న న్యాయవాదులను సన్మానించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు గంజి స్వరాజ్ బాబు,మాదురీ శ్రీనివాస్ ,కొత్త ప్రకాష్, కొండూరి అజయ్ చక్రవర్తి, కాచం రమేశ్, కట్కం శ్రవణ్, జూలూరి శ్రీరాములు, నీరుమల్ల శంకర్,బండ శివ కుమార్, సిఎచ్ సమత, జి మమత , యన్ సంధ్య లను శాలువా, మేమంటో లతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అవొపా రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐత ఈశ్వర్ ప్రసాద్, టౌన్ కార్యదర్శి వి సత్యనారాయణ, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# రూ. 1.07 కోట్ల వ్యయంతో ఎదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి శ్రీకారం- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



చర్చ, ఖమ్మం: ఖమ్మం పర్యటనలో భాగంగా మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీలో రూ.1.07 కోట్ల వ్యయంతో పలు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ , పోలీస్ కమీషనర్, మున్సిపల్ కమిషనర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలతో కలిసి శంకుస్థాపనలు చేయడం జరిగింది.రూ. 35 లక్షలతో టెంపుల్ సిటీ, రూ. 22 లక్షలతో చిన్నతండా,రూ. 25 లక్షలతో సూర్యనగర్, రూ. 25 లక్షలతో క్లాస్ 4 ఉద్యోగుల కాలనీలో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది.ఏదులాపురం అభివృద్ధికి గడిచిన రెండేళ్లలో సుమారు రూ. 70 కోట్లు ఖర్చు చేశాం. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో 560 మందికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. ఇంకా మూడు విడతలుగా మంజూరు చేస్తాం. ఏప్రిల్‌లో రెండో విడత కార్యక్రమం ఉంటుంది. అర్హులైన ప్రతి పేదవారికీ పక్కాఇల్లు కట్టించి తీరుతాం. ఇంకా మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించిన జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్





చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:ఆశ డే సందర్భంగా మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పెనగడప, చంద్రుగొండ మరియు జూలూరుపాడు లను సందర్శించి ఆశలకు మరియు ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ, అన్ని ఆరోగ్య కార్యక్రమం నందు నిర్దేశించిన టార్గెట్స్ ను అందుకోవడానికి కృషి చెయ్యాలి, అన్ని ఉప ఆరోగ్య కేంద్రాలను ప్రతి 2వ గురువారం పరిసరాలను పరిశుభ్రం చెయ్యాలి, మరియు అన్ని రికార్డులు అప్డేట్ చేసుకోవాలని, సమతుల్య ఆహారం మరియు ఆరోగ్య సూచనలు గురించి స్కూల్స్ మరియు కళాశాలలందు అవగాహన సదస్సులు నిర్వహించాలని ,అలాగే ఆరోగ్య కేంద్రాలందు అవగాహనా కార్నర్ ఏర్పాటు చెయ్యాలి, వైద్యాధికారులు అందరు తమ సిబ్బందికి ఇచ్చిన సర్కులర్ పైన అవగాహన కల్పించాలని ఆదేశాలు ఇచ్చారు. జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఐరన్ సూకరోజ్ గర్భిణీ స్త్రీలకు అందించే విధనాన్ని పరిశీలించినారు. ఈ కార్యక్రమం నందు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ , డాక్టర్ నేహా ఆమరిన్, డాక్టర్ వెంకటప్రకాష్, డాక్టర్ తనూజా, డాక్టర్ వెంకటేశ్వర్లు, మెహన్ డి పి ఎం ఓ మరియు వైద్య సిబ్బంది ఆశలు పాల్గొన్నారు.

# గిరిజన మహిళ ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

– అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలేవి

– జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్



చర్చ,కొత్తగూడెం:లక్ష్మదేవిపల్లి మండలంలోని చాతకొండ బిసి కాలనీలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టడమే కాకుండా గిరిజన మహిళ ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కి ంగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు.ఇసుక లోడ్ చేస్తుండగా ప్రమాదానికి గురై జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చుంచుపల్లి తండాకు చెందిన అజ్మీరా పద్మను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అను మతులు లేకుండా విచ్చల విడిగా అక్రమ ఇసుక రవాణా చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేదని విమర్శించారు.గిరిజన మహిళకు ప్రమాదం జరిగి,కాలు ఎముక రెండు చోట్ల విరిగి వారం రోజులు కావస్తున్నా మహిళకు మెరుగైన వైద్యం అందించకుండా అధికార పార్టీ అండదం డలతో మహిళను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చేతులు దులుపుకున్నారని ఇది సరైంది కాద న్నారు.జిల్లా కేంద్రంలో యదేచ్చగా ఇసుక అక్రమ రవాణా,ఎక్కడ పడితే అక్కడ ఇసుక నిల్వలు ఏర్పాటు చేసుకుంటున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పలు అనుమా నాలకు తావిస్తుందన్నారు.అధికారులు వెంటనే స్పందించి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడటమే కాకుండా గిరిజన మహిళ ప్రమాదానికి కారణమైన సదరు వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని,అదేవిధంగా గిరిజన మహిళకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని, అంతేకాకుండా ఆ కుటుంబానికి ఆర్థిక చేయూత ఇవ్వాల్సిన బాధ్యత వారిపై ఉందని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అజ్మీరా రాములు,శివ,ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్టు దందా కుకునూరులో బెల్ట్ జోరు

- ఊరూరా వెలసిన షాపులు
- విచ్చలవిడిగా బెల్టు దందా
- పట్టించుకోని అధికారులు




చర్చ: ప్రతినిధి ఏలూరు జిల్లా/కుక్కునూరు 06-01-2026 : మావ్యాపారం,మా ఇష్టం... అడిగేవారు లేకుంటే అంతా మాఇష్టం అన్నట్టు వ్యవహరిస్తున్నారు.జనావాసాల మధ్య వైన్స్ షాప్ కుక్కునూరు మండలంలోని మద్యం దుకాణాల వ్యాపారులు. మండల వ్యాప్తంగా బెల్టు జోరు యథేచ్ఛగా సాగుతుంది. ప్రతి గ్రామంలో వీధికొక బెల్టు దుకాణం పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చాయి. బెల్టు దందా అరికట్టాల్సిన సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారుల కనుసన్నల్లోనే ఈ వ్యవహారం జరుగుతుందనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. లైసెన్సు ఉన్న కుక్కునూరు, ఉప్పేరు మద్యం దుకాణాల మద్యం మండలంలో ఏరులై పారుతుంది. అనధికారికంగా నిబంధనలకు విరుద్ధంగా బెల్టు దుకాణాలను వ్యాపారులు నడుపుతున్నారు. చిన్న చిన్న బడ్డీలు కిరాణా షాపులు, హెరీటళు పాన్ దుకాణాల మాటున ఆయా వ్యాపారులు బెల్టు దుకాణాన్ని కూడా విచ్చలవిడిగా సాగిస్తున్నారు.వాడవాడలా బెల్టు మాఫియా షాపులు మంచి లాభసాటిగా వర్ధిల్లుతుంది. వ్యాపా రులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా బెల్టు వ్యాపారాన్ని నడుపుతున్నారు. బెల్టును నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు కిమ్మనక పోవడంపై ఘాటుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మందు బాబులు వ్యస నాన్ని ఆసరగా చేసుకొని వ్యాపారులు బెల్టు దుకా ణాలను తెలిసి జోరుగా విక్రయి స్తున్నట్టు తెలుస్తోంది. కాగా బెల్టు దుకాణాల్లో కూడా స్వల్ప గొడవలు చోటుచేస్తున్నట్లు సమాచారం. బెల్టు దుకాణాల్లో ఎల్లవేళలా మద్యం అందుబాటులో ఉండటంతో పేద, సామాన్య వర్గాలకు చెందిన మందు బాబులు ఆయా దుకాణాల వద్ద తెల్లవారు జామునే మందు కోసం ప్రత్యక్ష మవుతున్నారు. దీంతో అనారోగ్యంతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నారు. కాగా గ్రామాల్లో బెల్టు దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేయడంతో ఇబ్బంది కలుగుతుందని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి అనధికారికంగా సాగిస్తున్న బెల్టు దందాకు చెక్ పెట్టి వ్యాపారులపై కఠిన చర్యల తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రానున్న ఎంపిటిసి జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బిఎస్పీ సిద్ధం

– ఎస్సీ ఎస్టీ బీసీ మత మైనారిటీలైన బహుజనులకు రాజ్యాధికారం రావాలని పనిచేస్తున్న ఏకైక పార్టీ బిఎస్పి...

– సర్వ సమానత్వం కోసం పాటుపడుతున్న బిఎస్పీ నీ మరియు బిఎస్పీ పార్టీ నుండి పోటీ చేసే అభ్యర్థులను ప్రజలు గెలిపించాలి

– బీఎస్పీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షులు పడిగల వెంకట్




చర్చ, చర్ల:చర్ల మండలంలో బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం పార్టీ మండల అధ్యక్షులు కొండా చరణ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి పార్టీ భద్రాచలం నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షులు పడిగల వెంకట్ ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా పడగల వెంకట్ మాట్లాడుతూ మహ నీయులను స్మరించుకుంటూ ఈరోజు చర్ల మండలంలో మండల కమిటీ సమావేశం నిర్వహించుకోవడం జరిగిందని అన్నారు. గౌరవనీయులు బెహన్ కుమారి మాయావతి ఆదేశాల మేరకు గౌరవ నీయులు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం శేఖర్ ఆదేశాల మేరకు భవిష్యత్తు కార్య చరణకు సంబంధించిన విషయాలను ఈ సమావేశంలో చర్చించుకోవడం జరిగిందని అన్నారు. అందులో భాగంగానే రానున్న ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ చర్ల మండలంలోని అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని తెలియజేశారు కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి పార్టీలు అగ్రవర్ణ ఆధిపత్య కుల భావాజాలం కలిగిన జాతులను రాజ్యాధికారంలోకి తీసుకురావడం కోసం సంపదను కట్టబెట్టడం కోసం ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. బహుజన్ సమాజ్ పార్టీ మాత్రమే ఎస్సీ, ఎస్టీ బీసీ మత మైనారిటీ ప్రజలైన బహుజనలకు రాజ్యాధికారం రావాలని నిరంతరం కృషి చేస్తుందని అన్నారు సమాజంలో ఎవరు ఎంత జనాభా కలిగి ఉన్నారో అంత వాటా సమానంగా పంచాలని సర్వ సమానత్వం కోసం పాటుపడుతున్నటువంటి బిఎస్పీకి అధికారం ఇవ్వడం ద్వారా సమాజంలో శాంతి నెలకొల్పబడుతుందని సంపద సమానంగా పంచబడుతుందని తెలిపారు భారత రాజ్యాంగం రక్షణ కోసం అమలు కోసం నిరంతరం పాటుపడే పార్టీ బిఎస్పి అని అన్నారు. ఈ ప్రాంతంలో బిఎస్పి గెలవడం ద్వారానే అభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు ఈ విషయాన్ని ప్రజలు మేధావులు విద్యావంతులు యువకులు, విద్యార్థులు అందరూ గమనిం చాలని కోరారు బహుజనులు ఐక్యంగా బీఎస్పీ నుంచి పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకోవాలని రానున్న ఎన్నికల్లో బహుజనుల సత్తా చూపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ మాజీ ఇన్చార్జి పార్టీ సీనియర్ నాయకులు సామల ప్రవీణ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సోయం శ్రీమూర్తులు, పార్టీ మండల కార్యదర్శి గుర్రాల విజయ్ కుమార్, పార్టీ మండల ఉపాధ్యక్షులు ఎస్ కే జహీరుద్దీన్ భాష, పార్టీ మండల ఈసీ మెంబర్ మల్లం జోగయ్య పార్టీ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# పీపుల్స్ వార్ మాజీ దళ సభ్యురాలు సారక్క మృతి

- పోరాట జీవితం, జైలు ప్రసవం, చివరకు మౌన వీడ్కోలు



చర్చ: రామగిరి: పెద్దపల్లి జిల్లా :పీపుల్స్ వార్ ఉద్యమ కాలంలో సాయుధ పోరాటానికి సాక్ష్యంగా నిలిచిన మరో జీవితం ముగిసింది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన బందారపు సారక్క అలియాస్ శారద (నిలక్క) సోమవారం తెల్లవారు జామున మైదంబండ తల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.సారక్క జీవితం ఒక సాధారణ గ్రామీణ మహిళ నుంచి ఉద్యమంలోకి అడుగుపెట్టిన మహిళా దళ సభ్యురాలిగా, ఆపై తీవ్రమైన గాయాలు, జైలు జీవితం, జైల్లోనే మాతృత్వం, చివరకు ఒంటరి జీవితం వరకు సాగింది. ఆమె కథ నేటి తరానికి ఒక మానవీయ దృశ్యంగా మిగిలిపోయింది. సారక్క అప్పటి పీపుల్స్ వార్ గ్రూప్‌లో ప్లాటూన్ కమాండర్‌గా పనిచేసిన బందారపు మల్లయ్య అలియాస్ చంద్రన్నకు మొదటి భార్య. భర్త అడుగుజాడల్లోనే 1989లో ఆమె కూడా పీపుల్స్ వార్‌లో చేరింది. మదేవపూర్, ఏటూరు నాగారం, మంథని ప్రాంతాల్లోని దళాల్లో సభ్యురాలిగా కొనసాగుతూ ఉద్యమ జీవితం గడిపింది.మంథని ఏరియా దళంలో పనిచేస్తున్న సమయంలో, మలహర్ మండలం కొయ్యూరు అటవీ ప్రాంతంలో రోడ్డు దాటుతున్న క్రమంలో జరిగిన పోలీస్ కాల్పుల్లో సారక్కకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణాపాయ స్థితిలోనూ తప్పించుకున్న ఆమె అటవీ ప్రాంతంలోని ఓ గ్రామంలో కొంతకాలం తలదాచుకుంది. ఈ కాల్పుల్లో ఆమె తల భాగంలో, ముఖ్యంగా కంటి ప్రాంతంలో తీవ్ర గాయం ఏర్పడింది.పార్టీ ఆదేశాల మేరకు అత్యవసర చికిత్స కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. అప్పటి ఎస్పీ ఆమె పరిస్థితి విషమంగా ఉందని గుర్తించి మానవతా దృక్పథంతో ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించారు. చికిత్స అనంతరం కోలుకున్న సారక్కను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించి కరీంనగర్ జైలుకు తరలించారు.జైలు జీవితం ఆమెకు మరో మలుపు తీసుకొచ్చింది. అప్పటికే గర్భవతిగా ఉన్న సారక్క జైలులోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత బెయిల్‌పై విడుదలై స్వగ్రామం మచ్చుపేట చేరుకుని కుటుంబ సభ్యులతో జీవనం కొనసాగించింది. ఈ సమయంలో భర్త చంద్రన్న మాత్రం దళంలోనే కొనసాగగా, అనంతరం మరో దళ సభ్యురాలిని వివాహం చేసుకుని ప్రస్తుతం ఇద్దరూ లొంగిపోయినట్లు తెలిసింది.సారక్క కుమారుడు ప్రస్తుతం భారత ఆర్మీలో జవాన్‌గా సేవలందిస్తున్నాడు. తల్లి మరణ వార్త అందగానే తన పని చేస్తున్న ప్రాంతం నుంచి సోమవారం రాత్రి స్వగ్రామానికి చేరుకున్నాడు. అనంతరం గ్రామస్థుల సమక్షంలో సారక్క అంత్యక్రియలు నిర్వహించారు.అయితే సారక్క జీవిత భాగస్వామిగా ఉన్న చంద్రన్న ఆమె అంత్యక్రియలకు హాజరు కాలేదు. ఇది గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఉద్యమం, కుటుంబం, త్యాగం ఇలా అన్నింటి మధ్య నలిగిపోయిన ఒక మహిళా జీవితం నిశ్శబ్దంగా ముగిసిందని పలువురు గ్రామస్థులు వాపోయారు.సాయుధ పోరాట కాలంలో ఎన్నో కలలు, ఎన్నో ఆశలు మోస్తుల్లిన సారక్క జీవితం చివరకు అనారోగ్యంతో ముగియడం, ఆమె కథను మరింత హృదయ విదారకంగా మార్చింది. ఆమె జీవితం ఒక వ్యక్తిగత కథగా కాక, ఒక కాలానికి చెందిన మానవీయ సాక్ష్యంగా మిగిలిపోయింది.

# జాప్యం లేకుండా సిఎంపిఎఫ్ సేవలు...




చర్చ,రామగిరి:జాప్యం లేకుండా కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సేవలను ఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ డ్రా:.గోవర్ధన్ అన్నారు. మంగళవారం జి.ఎం కార్యాలయం నందు సంబంధిత అధికారులు, ఉద్యోగులతో ప్రయాస్ ఐదవ షెడ్యూల్ లో భాగం గా సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ముందుగా కమిషనర్ ఎన్ సి డబ్యు ఎ ఉద్యోగుల రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ 241 పిపిఓ ఆర్డర్స్ ను రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు కు అందజేశారు.ఈ సందర్భంగా సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ డా: గోవర్ధన్ మాట్లాడుతూ సిఎంపిఎఫ్ లావా దేవీలు అన్ని సి-కేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుత న్నాయన్నారు. ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సిఎంపిఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. పెండింగ్ లోఉన్న సిఎంపిఎఫ్ క్లెయిమ్స్, రివైజ్డ్ పెన్షన్ తదితర అంశాలపై చర్చించారు, ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. పెన్షన్ సీఎంపిఎఫ్ దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చర్యలు చేపట్టామన్నారు. జీరో పెండింగ్ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలనీ చెప్పారు.

రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సీఎంపిఎఫ్ వివరాలను చూసే సిబ్బంది సీఎంపిఎఫ్ అధికారులతో సమన్వయం తో పనిచేయాలని, ఉద్యోగుల ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా చూడాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు.కార్యక్రమంలో పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివై పియం వి.సునీల్ ప్రసాద్, సీనియర్ పిఓ పి.రాజేశం, ఫైనాన్స్ అధికారి భరత్, సిఎంపిఎఫ్ సిబ్బంది కామేశ్వర రావు, లలిత, అనిత, మనోహర్, ప్రదీప్ రెడ్డి తో పాటు వివిధ గనుల సంక్షమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

**– స్టేషన్ హౌస్ ఆఫీసర్స్, కోర్టు డ్యూటీ ఆఫీసర్స్, స్టేషన్ రైటర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ తో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**






చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న రాూలు,కోర్టు డ్యూటీ ఆఫీసర్లు,రైటర్లు,టెక్ టీం ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ పాత కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు తమ అధికారులకు తెలియజేస్తూ ఉండాలని సూచించారు.ఏవైనా సందేహాలు తలెత్తితే డీసిఆర్బీ అధికారులకు తెలియజేసి వాటిని నివృత్తి చేసుకోవాలని తెలిపారు.కేసు నమోదయినప్పటి నుండి పరిష్కారం అయ్యే వరకు ప్రతీ విషయాన్ని ఆన్లైన్లో పొందుపరిచాలని టెక్ టీం ఆపరేటర్లకు సూచించారు.ఆన్లైన్లో పొందుపరిచే క్రమంలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఐటీ సెల్ సహకారం తీసుకోవాలని అన్నారు.5ూ అమలులో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవా లని,కేసులకు సంభందించిన ఫైళ్ళను క్రమపద్ధతిలో అమర్చుకోవాలని సూచించారు.నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేసి బాధితులకు న్యాయం చేకూర్చడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,ఐటి సెల్ ఇన్స్పెక్టర్ రాము, ఇల్లందు ఇన్స్పెక్టర్ సురేష్,3టౌన్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్,సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ జితేందర్,ఫింగర్ ప్రింట్స్ సీఐ అశోక్, ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను లిఖితపూర్వకంగా సమర్పించాలి

**■ ఉ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




చర్చ, భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపాలిటీ ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీలు, లిఖితపూర్వకంగా నిర్ణీత గడువులోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు. మంగళవారం ఐ డి ఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 01-10-2025 నాటికి ఓటరుగా నమోదు అయిన ప్రతి వ్యక్తిని ఎపిక్ కార్డులో పేర్కొన్న చిరునామా ఆధారంగా ఆయా డివిజన్లకు సంబంధించిన ఓటరు జాబితాలో చేర్చడం జరిగిందని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి ఈ నెల 9వ తేదీ వరకు స్వీకరించే అభ్యంతరాలను పూర్తిగా పరిశీలించి, పరిష్కరించిన అనంతరం 10వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు అశ్వరావుపేట, ఇల్లందు మున్సిపాలిటీల పరిధిలోని మొత్తం 106 వార్డులకు గాను 1,85,750 మంది ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటరు జాబితాను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ జాబితాలో పేరు, చిరునామా, వార్డు, ఇతర వివరాల్లో ఏవైనా పొరపాట్లు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులకు వేర్వేరు వార్డుల్లో ఓట్లు నమోదై ఉండటంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు వార్డుల్లో నమోదు అయి ఉంటే, సంబంధిత దరఖాస్తుల ఆధారంగా వాటిని సరిచేసే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, ఇల్లందు మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్, అశ్వరావుపేట మున్సిపల్ కమిషనర్ నాగరాజు, సిపిఎం తులసీరామ్, బిజెపి నోముల రమేష్, సిపిఐ శ్రీనివాస్, జే ఎస్ పి సందీప్, ఐ ఎన్ సి లక్ష్మణ్ అగర్వాల్, టిడిపి కళ్యాణ లక్ష్మపతి, బీఎస్పీ శంకరయ్య, ఏ ఏ పి రమేష్ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు.

# నేలమ్మకు పునరుజ్జీవం పంట వ్యర్థాలతో బయోచార్

**■ భూమి ఆరోగ్య పరిరక్షణకు, పర్యావరణ సంరక్షణకు బయోచార్ వినియోగం కీలకం**
**■ ఉ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :చుంచుపల్లి మండలం గరిమెళ్ళపాడు నర్సరీ ఆవరణలో ఆధునిక, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై, ముఖ్యంగా బయోచార్ వినియోగంపై మంగళవారం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ బయోచార్ నిపుణులు పరశురం కైలాస్ అఖరే ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లాలో విస్తారంగా లభ్యమయ్యే పత్తి కట్టెలు, మొక్కజొన్న చొప్ప వంటి పంట వ్యర్థాలను ఉపయోగించి తక్కువ ఖర్చుతో బయోచార్ తయారు చేసే విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా ఇనుముతో తయారుచేసిన పరికరంలో పంట అవశేషాలను నియంత్రిత ఉష్ణోగ్రత వద్ద కాల్చి నాణ్యమైన బయోచార్ ఉత్పత్తి చేసే విధానాన్ని నిపుణులు వివరించారు.అనంతరం తయారైన బయోచార్‌ను గోమూత్రం, ఆవు పేడ మిశ్రమంలో 15 రోజుల పాటు ఉంచి సక్రియం (యాక్టివేషన్) చేసి ఎరువుగా వినియోగించే విధానాన్ని వివరించారు. ఈ విధానం వల్ల నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, భూమి సారవంతత మెరుగుపడటంతో పాటు తేమ నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల విస్తీర్ణంలో పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలు సాగు అవుతున్నాయని తెలిపారు. పంట కోత అనంతరం రైతులు పత్తి కట్టెలు, మొక్కజొన్న చొప్పను పొలాల్లోనే కాల్చడం వల్ల నేలలోని విలువైన సూక్ష్మజీవులు పూర్తిగా నాశనం అవుతున్నాయని, దీంతో పాటు సేంద్రియ పదార్థం దగ్ధమై భూమి సారవంతత గణనీయంగా తగ్గిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ వాతావరణ కాలుష్యానికి కారణమవుతూ మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్రమైన హానిని కలిగిస్తోందన్నారు. ఇకపై ఏ రైతు పత్తి కట్టెను పొలాల్లో కాల్చకుండా బయోచార్ తయారీకి ఉపయోగించాలన్నారు.బయోచార్‌లో ఉన్న సూక్ష్మ రంధ్రాల కారణంగా పంటలకు నీరు పెట్టిన సమయంలో యూరియా తదితర పోషక ఎరువులు వృథ కాకుండా అందులోనే నిల్వ ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఈ పోషకాలు నెమ్మదిగా పంటలకు అందడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. బయోచార్‌ను నేల తల్లికి అర్పించినట్లయితే, నేల తల్లి మనకు మెరుగైన ఫలితా లను అందిస్తుందని కలెక్టర్ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే ఈ విధానాన్ని రైతులు విస్తృతంగా అమలు చేయాలని సూచించారు.అదేవిధంగా బయోచార్ వినియోగం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా డ్రైనేజీలు, పౌల్ట్రీ షెడ్లు, పశువుల శాలలు, చెత్త నిల్వ ప్రాంతాలు తదితర ప్రాంతాల్లో కూడా విస్తృతంగా ఉపయోగించవచ్చని తెలిపారు. దీని వల్ల దుర్వాసనలు తగ్గి గాలి పరిశుభ్రమవడంతో పాటు జీవన వాతావరణం మెరుగుపడుతుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యానికి కూడా బయోచార్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా బయోచార్‌ను పెద్ద ఎత్తున తయారు చేసి వినియోగించేందుకు రైతులు, స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు, పంచాయతీ సమన్వయంతో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో బయోచార్ యూనిట్లు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహకారం అందించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ విధంగా బయోచార్ వినియోగాన్ని ప్రోత్సహిస్తే రైతుల ఆదాయం పెరగడంతో పాటు జిల్లాలో సుస్థిరమైన, పర్యావరణహిత వ్యవసాయ విధానాలు మరింత బలోపేతం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గ్రామ సర్పంచ్ వాడే రాములు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మ, ఎన్ఎస్ఎస్ అధికారులు వేముల కామేశ్వరరావు, శ్రీదేవి, ఎన్సిసి ఇంచార్జ్ ధర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమేష్,రాంబాబు, బూర్గంపాడు, టేకులపల్లి, చంద్రుగొండ, పాల్వంచ, దుమ్ముగూడెం, జూలూరుపాడు, గుండాల మండలాల ఎంపీడీవోలు అధ్యాపకులు రాజ్ కుమార్ సూపర్డెంట్ విజయ్ ప్రసాద్, వార్డు మెంబర్లు,విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన సదస్సు




చర్చ,గోదావరిఖని: మార్కండేయ కాలనీలో కాకతీయ జూనియర్ కాలేజ్ లో మంగళవారం రామగుండం ట్రాఫిక్ సిఐ బి రాజేశ్వర్ రావు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల పై అహగాన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటి వద్ద వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు చేయాలని పేర్కొన్నారు. టూ వీలర్ నడిపేటప్పుడు హెల్మెట్, వాహనానికి సంబంధించిన సర్టిఫిట్లు ఉండేలా అవగాహన కల్పించాలని తెలియ జేశారు. ఫోర్ వీలర్ అయితే సీట్ బెల్ట్ దరించి డ్రైవింగ్ చేసే విదంగా , ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సురక్షత ప్రయాణం కొనసాగించాలని తెలిపారు. తాగి బండి నడపడం , సెల్ ఫోను మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వలన ప్రమదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలను విద్యార్థులు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇ ఉపేందర్ మరియు ఎస్సై జి హరి శేఖర్ మరియు కళాశాల సిబ్బంది ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.


## హాకి క్రీడా పోటీలు ప్రారంభం



చర్చ,గోదావరిఖని:వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సింగరేణి కంపెనీ స్థాయి హాకి క్రీడా పోటీలను మంగళవారం గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జీ వన్ జియం డి లలిత్ కుమార్ హాజరై పోటీలను ప్రారంబించారు.ఈ సందర్భముగా జి యం మాట్లాడుతూ సింగరేణి స్థాయి హాకి వార్సిక క్రీడా పోటిల్లో ఆర్జీ 1 2 మరియు కొత్తగూడెం కార్పోరేట్ ఏరియాల జట్లు తలపడనున్నాయని తెలిపారు. ఈ పోటీలలో మందమర్రి,బెల్లంపల్లి శ్రీరాం పూర్, ఆర్జీ త్రీ, భూపాలపల్లి, మణుగూరు ఇల్లందు ఏరియాలు జట్లుగా పాల్గోననున్నట్లు తెలిపారు. క్రీడా నైపుణ్యంలో ఎంతో మెలకువలతో ఆడాలని ఈ క్రీడలు జీవితంలో ఎదుగుదలకు ఆత్మ స్థైర్యానికి దోహదపడతాయని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని పొందాలని అన్నారు. ఓడిన వారు గెలిచిన వారిని స్పూర్తిగా తీసుకొని లోటుపాట్లను సవరించుకొని ముందుకు సాగాలని తెలిపారు. పోటీలో గెలుపొందిన వారికి ఆర్జీ వన్ లో ఫైనల్స్ నిర్వహించి కోల్ ఇండియా కు పంపడం జరుగుతుందని తెలిపారు. గతంలో ఆర్జీ వన్ మరియు వివిధ ఏరియాల నుండి హాకి పోటిలలో కోల్ ఇండియా స్థాయిలో రాణించి ఉత్తమ ప్రతిభ కనబరచిన సీనియర్ హాకి క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లాగౌడ్ ,ఎస్ ఓటు జియం .చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ఎం రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధులు పెరుమాళ్ళ శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, హనుమంతరావు, ఎక్స్ ప్లోరేషన్ జియం రమేష్, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరా రెడ్డి మరియు అన్ని ఏరియాలక్రీడా సూపర్ వైజర్స్ జాన్స్ వెస్లీ, సి.హెచ్ అశోక్, పర్స శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, హెచ్ రమేష్, కొ ఆర్డినేటర్ సామల సత్యనారాయణ సింగరేణి స్థాయి అన్ని ఏరియాల హాకి క్రీడా కారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య గ్లోబల్ ఎడ్జ్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

**– ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం**



చర్చ,గోదావరిఖని:అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తోక పేరుతో చలామణి అవుతున్న శ్రీ చైతన్య గ్లోబల్ ఎడ్జ్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని రామగుండం మండల విద్యాధికారి జింక మల్లేష్ కి వినతి పత్రం అందజేయడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని సంజయ్ గాంధీనగర్ లోని శ్రీ చైతన్య గ్లోబల్ ఎడ్జ్ పాఠశాల గ్లోబల్ ఎడ్జ్ అనే తోక పేరుతో చలామణి అవుతు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, పారిశ్రామిక ప్రాంత ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. జీవో.ఎంఎస్. నెంబర్ 91ని పాటించకుండా, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న శ్రీ చైతన్య గ్లోబల్ ఎడ్జ్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన పాఠశాల యాజమాన్యాలే, తప్పుడు ప్రచారాలు చేస్తే విద్యాబుద్ధులు ఎవరు నేర్పుతారని ఆయన సూటిగా ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న శ్రీ చైతన్య గ్లోబల్ ఎడ్జ్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని,తోక పేర్లను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రామగుండం కార్పొరేషన్ కార్యదర్శి మాతంగి సాగర్, గొడిసెల ప్రణీత్, తడిగుప్పుల సాయి అను, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సే వనవాసీ లక్ష్యం

**– ఆదర్శప్రాయ విద్యార్థులుగా తీర్దిదిద్దుతున్నాము**
**– విదేశాలలో ఉన్నా స్వదేశంపై మమకారం అభినందనీయం**
**– ఎన్ ఆర్ ఐ దంపతులు ఆదర్శనీయులు**
**– వనవాసీ గౌరవ సలహాదారులు బివిఎస్ఎల్ఎన్**

చర్చ, చర్ల : సమాజ శ్రేయస్సే వనవాసీ కళ్యాణ పరిషత్ లక్ష్యమని వనవాసీ కొమరం భీం విద్యార్థి నిలయం గౌరవ సలహాదారులు బివిఎస్-ఎల్ నరసింహారావు అన్నారు. చర్ల అటవీ రేంజ్ కార్యాలయంలో సెక్షన్ అదికారిగా విదులు నిర్వహిస్తున్న ఇందుర్తి రాజేష్ సోదరుడు అమెరికాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగులుగా విదులు నిర్వహిస్తున్న ఇందుర్తి రాహుల్ - సుధారాణి దంపతులు వనవాసీ కొమరం భీం విద్యార్థి నిలయంకు రూ. 10 విలువ చేసే గ్రైండర్, గోడ గడియారాలతో పాటు విద్యార్థులకు ఒకపూట బోజనం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అద్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిదిగా హాజరయిన బివిఎస్ఎల్ విద్యార్థులను ఉద్దేసించి మాట్లాడారు. దేశ వ్యాపితంగా విద్యార్థుల కొరకు అనేక పాఠశాలలు, వసతిగృహాలు ఉన్నా వాటికి బిన్నంగా వనవాసీ ఆద్వర్యంలో నిర్వహించే విద్యార్థి నిలయాలు ఉంటాయన్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య అందచేసి వారిని సమాజానికి ఉపయోగపడే యువకులుగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. ఇందుకుగాను దేశ వ్యాపితంగా సంస్థ ఆద్వర్యంలో 254 విద్యార్థి నిలయాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ద్వారా సమాజానికి ఉపయోగపడే ఆదర్శప్రాయ, దేశభక్తి కలిగిన యువకులను తయారు చేసి సమాజసేవకు ఉపయోగపడేలా తయారుచేస్తున్నట్లు పేర్కొన్నారు. దాతల సహకారంతోనే సంస్థ నడుస్తోందని, ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం తీసుకోదని స్పష్టం చేసారు. వసతిగృహ నిర్వహణలో కమిటీ సభ్యుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. వారు తమ శక్తి సామర్థ్యాలను ఉపయోగించి దాతల నుండి విద్యార్థి నిలయంకు ఉపయోగపడే వస్తువులను సేకరించడం ప్రశంసనీయమని అన్నారు.




వృత్తిరీత్యా అమెరికాలో స్థిరపడినా మాతృదేశంపై మమకారంతో పేద విద్యార్థుల చదువులకు సహకరిస్తున్న ఎన్ ఆర్ ఐ దంపతులు రాహుల్ - సుధారాణి లు అభినందనీయులని ప్రశంసించారు. ఇటువంటి సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల చదువులకు, అభ్యున్నతికి సహకరించడం ఆదర్శనీయమని కొనియాడారు. కొమరం భీం విద్యార్థులు చదువులతో పాటు ఆటలు, దేశ భక్తిగీతాలు, భక్తి పాటలలో రాణిస్తూ సంస్థ ఖ్యాతిని మరింత ఇనుమడింప చేస్తున్నారన్నారు. ఇక్కడి విద్యార్థులు విలువిద్యలో జాతీయ స్థాయిలో జరిగిన పోటీలలో పాల్గొన్నారని, ఇటీవల హైదరాబాదులో జరిగిన వివిద క్రీడా పోటీలలో ప్రదమ స్దానంలో నిలిచారని తెలిపారు. ఫారెస్ట్ సెక్షన్ అదికారి రాజేష్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కొరకు పాటుపడుతున్న సంస్ధలోని విద్యార్ధులకు వితరణ అందచేయడం గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగపరుచుకొని ఉన్నత స్దీతికి చేరుకోవడం ద్వారా తిరిగి ఇతర పేద విద్యార్దులకు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు తమకు తృప్తినిస్తాయని పేర్కొన్నారు. ఇక్కడి విద్యార్దుల క్రమశిక్షణ, నడవడిక ఇతర విద్యార్దులకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అదికారి రవికుమార్, బీట్ ఆఫీసర్లు లక్ష్మణప్రసాద్, భూక్యా లాలూ, బేస్ క్యాంప్ ఉద్యోగి కొడిపె సతీష్, వనవాసీ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, నిలయకమిటీ ఉపాద్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ కు ఎంపికైన హర్షవర్ధన్ కు నగదు ప్రోత్సాహం



చర్చ, రామగుండం :రామగుండం పట్టణంలో గత 35 సం వత్సరాలుగా మాస్టర్ సురేష్ కరాటేలో వాం పియన్ గా నిలిచి 1000 మందికి పైగా విద్యార్థులను కరాటే లో శిక్షణను ఇచ్చి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఛాంపియన్స్ గా నిలిపారు. కరాటే శిక్షణ ద్వారా క్రమశిక్షణతో పాటు ఫిట్నెస్, స్వీయ రక్షణతో పాటు వారు జీవితంలో అత్యున్నత స్థాయిలో నిలదుక్కుకునేలా నిర్విరామంగా కృషి చేస్తూ అలుపెరగకుండా తాను నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు కష్టపడుతూ కరాటేలో విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ చాంపియన్లుగా తీర్చిదిద్దుతున్న వైనాన్ని గుర్తేరిగి పల్లికొండ రాజేష్ మాస్టర్ సురేష్ ని సుభోధ్ స్కూల్ యాజమాన్యంతో పాటు పలువురు ప్రముఖుల మధ్య ఘనంగా సన్మానించారు. అనంతరం మాస్టర్ సురేష్ నేతృత్వంలో ఇటీవలే రాష్ట్రస్థాయిలో పథకం సాధించిన హర్షవర్ధన్ త్వరలో పూణేలో జరగ బోయే జాతీయస్థాయి కాంపిటీషన్ లో పాల్గొన దుకు వెళుతున్న సందర్భంలో భరోసా స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఉడతా భక్తిగా నగదు ప్రోత్సాహం అందజేశారు. పల్లికొండ రాజేష్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా నిర్విరామంగా నిబద్ధతతో తాను నేర్చుకున్న విద్యని ఎంతోమంది పంచుతూ కరాటేలో రాష్ట్ర స్థాయితోపాటు జాతీయస్థాయిలో అంతర్జాతీయ స్థాయిలో కూడా విజేతలుగా నిలిపి రామ గుండం పారిశ్రామిక ప్రాంతానికి పేరు ప్రఖ్యా తలు తీసుకు వస్తున్న వడ్డేపల్లి సురేష్ శిక్షణలో మెలుకువలు నేర్చుకొని రక్షా లుగా మారు తున్న విద్యార్థుల భవిష్యత్తు రాబో యే రోజుల్లో అత్యున్నత స్థాయిలో నిలవబో తుం దని, కేవలం కరాటేలో శిక్షణ అనే కాకుం డా విద్యా ర్థులకు క్రమశిక్షణతో పాటు ఫిట్నెస్ సమా జం పట్ల అవగాహన విద్య పట్ల ఏకాగ్రత ఆదర్శ వంతమైన పలు విషయాల పట్ల అవగ -ాహన కల్పిస్తూ ఎనలేని సేవలందిస్తున్న వడ్డేపల్లి సురేష్ గారిని ఈ సందర్భంగా సన్మా నిం చుకోవడం అదృష్టంగా భావిస్తు న్నామని, అలాగే హర్ష వర్ధన్ కు నగదు ప్రోత్సా హం అం దజే యడానికి సహకరించిన భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు సనీష్, దాం సింగ్ ఠాగూర్, బల్వన్ సింగ్ ఠాగూర్, రమేష్ తో పాటు హెల్ప్ టూ నీడీ వారికి హృద పూర్వక కృతజ్ఞతలు తెలుపుకుం టున్నా న్నారు.

## సురక్షిత ప్రయాణం అందరి బాధ్యత




- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్

చర్చ, కొత్తగూడెం లీగల్ సెల్:ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి, రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో మంగళవారం 'రోడ్డు భద్రతా అభియాన్' కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ అవగాహన ర్యాలీని కోర్టు ప్రాంగణం నుండి పోస్ట్ ఆఫీస్ సెంటర్ వరకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించాలని, ఇది కేవలం జరిమానాల కోసం కాదని, ప్రాణ రక్షణ కోసమని స్పష్టం చేశారు. అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ఎంతో మంది యువత ప్రాణాలు కోల్పో తున్నారని, మద్యం సేవించి వాహనాలు నడ పడం నేరమని హెచ్చరించారు. ఈ ప్రచారంలో భాగంగా వారం రోజుల పాటు పాఠశాలలు, కళా శాలలు మరియు ప్రధాన కూడళ్లలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగు తుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను స్వచ్ఛందంగా పాటించి నప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని అన్నారు.మీ గమ్యాన్ని సురక్షితంగా చేరుకోవడమే మీ కుటుంబానికి మీరు ఇచ్చే అతిపెద్ద కానుక అని న్యాయ మూర్తి పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో కొత్తగూడెం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండ రాజమల్లు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తం రావు, నిరంజన్ రావు, పావని, పి.పి రాజారావు, ట్రా ఫిక్ ఎస్.ఐ గడ్డం ప్రవీణ్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, ట్రాఫిక్ కానిస్టేబుల్, పారా లీగల్ వాలంటీర్స్ బిక్షమయ్య జానకిరామ్, రాజమణి, షా హిన్, వీరభద్రం తదితర పారా లీగల్ వాల ంటీర్స్ మరియు కోర్ట్ సిబ్బంది, ట్రాఫిక్ పాల్గొన్నారు.

## శిక్షణలో పాల్గొన్న టీచర్ల కు దామాషా పద్ధతిలో సెలవులివ్వాలి




చర్చ, జగిత్యాల : గత వేసవి సెలవులలో పాసిటీ బిల్డింగ్ శిక్షణ పొందిన టీచర్లకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయినిపెల్లి ఆనందరావు, యాళ్ల అమర్నాథ్ రెడ్డిలు కోరారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి రాము కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వేసవి సెలవులలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విషయాల వారి గా ఐదు రోజుల పాసిటీ బిల్డింగ్ శిక్షణ తరగతులు నిర్వహిం చారన్నారు. ఈ శిక్షణ తరగతులలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్ లకు ధమాషా పద్ధతిలో సంపాదిత సెలవులు మంజూరు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము ను కోరారు. వీరివెంట రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పూజారి మహేశ్ ఉన్నారు.

## రేపు అశ్వరావుపేటలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు బయోచార్ పై ఉచిత శిక్షణ : జిల్లా కలెక్టర్

- రైతులకు సువర్ణ అవకాశం




చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లాలోని రైతులకు ఆధునిక, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు మహారాష్ట్రకు చెందిన ప్రముఖ బయోచార్ నిపుణులు పరశురాం క్లైన్ అఖరే గారి ఆధ్వర్యంలో బయోచార్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ ఉచిత శిక్షణ కార్యక్రమం రెండు రోజుల పాటు నిర్వహించబడనుండగా, మొదటి రోజు ఎమ్జీ, గరిమెళ్లపాడు లో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.రెండో రోజు శిక్షణ కార్యక్రమం రేపు (07-01-2026) బుధవారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అగ్రికల్చర్ కాలేజ్, అశ్వరావుపేటలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బయోచార్ తయారీ విధానం, దాని ప్రయోజ నాలు, మట్టిసారాన్ని పెంపొందించడంలో బయోచార్ పాత్ర, రసాయన ఎరువుల వినియోగం తగ్గించడం, పంట దిగుబడులు పెంచడం వంటి అంశాలపై రైతులకు ప్రత్యక్షంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.బయోచార్ వినియోగం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు. జిల్లాలోని రైతులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.శిక్షణకు సంబంధించిన వివరాలు మరియు లొకేషన్ సమాచారం కోసం క్రింది వారిని సంప్రదించవచ్చని తెలిపారు.శిక్షణ వివరాలకు సంప్రదించవలసిన వారు :

రాజు ఉ 92814 79565(ఆఇూ కార్యాలయం)

డా. నాగ అంజలి ఉ 94927 31222

అగ్రికల్చర్ కాలేజ్, అశ్వరావుపేట

## సత్తుపల్లి రవాణా శాఖ ఆధ్వర్యంలో

- బడి బస్సు డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు
- 147 మంది డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు
- సత్తుపల్లి ఎంవీఐ శ్రీనివాసరావు








చర్చ, సత్తుపల్లి: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం( జనవరి 1 నుంచి 31) లో భాగంగామంగళవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రైవేట్ విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ప్రాంతీయ రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహి ంచారు. సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూర్ ,కల్లూరు, ఏనుకూరు మండలాలకు చెందిన 147 మంది బస్ డ్రైవర్లు, క్లీనర్లు ఈ కార్యక్రమం సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా కొందరు డ్రైవర్లు తమకు బీపీ ,షుగర్, కంటి సమస్యలు ఉన్నట్లు తొలిసారిగా తెలుసుకోగలిగారు. స్థానిక ఎస్విసి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సిరికొండ హర్షిత్ బీపీ, సాధారణ పరీక్షలు నిర్వహించారు. హిూనా ఐ కేర్ అండ్ ఆప్టికల్స్ నిర్వాహకులు డాక్టర్ హీరాలాల్ కంటి పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశారు. శ్రీ రాఘవేంద్ర రక్త పరీక్ష కేంద్రం నిర్వాహకులు పాషా షుగర్ పరీక్షలు నిర్వహించారు. సత్తుపల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రవికుమార్ ఇందుకు అవసరమైన సహకారం అందజ ేశారు. అతివేగం, అజాగ్రత్త, సెల్ఫోన్ వాడకం మానండి.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు నడుపుతున్న డ్రైవర్లు, క్లీనర్లకు ఎం వీ ఐ శ్రీనివాసరావు, సహాయ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావుతో కలిసి బడి బస్సులు నడిపే విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి డ్రైవర్లకు అవగాహన కల్పించారు. బస్సు నడిపేటప్పుడు సెల్ ఫోన్ వాడ టం, అతివేగం, అజాగ్రత్త తగదని హెచ్చరించారు.

ప్రైవేట్ విద్యా సంస్థల సంఘం జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు పసుపులేటి నాగేశ్వరరావు , లైన్స్ క్లబ్ నిర్వాహకులు మందపాటి ప్రభాకర్ రెడ్డి, దారా కృష్ణారావు, గంధ్ర సోమిరెడ్డి,రమణ తదితరులు ఈ కార్యక్రమంలో సేవలు అందించిన వైద్యులను, రవాణా శాఖ అధికారులను సత్కరించారు.

## జనవరి 23,24,25 తేదీల్లో ఖమ్మంలో జరిగే పిడిఎస్ యూ 23వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- వెనిజులా దేశంపై అమెరికా దురాక్రమణ చర్యను నిరసిస్తూ నిరసన-కాంపాటి పృథ్వీ, పిడిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు



చర్చ, ఇల్లందు:ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్ యూ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సమావేశం ఇల్లందు పట్టణ కేంద్రంలోని చంద్ర కృష్ణమూర్తి భవన్ లో జిల్లా అధ్యక్షులు బుర్ర వీరభద్రం అధ్యక్షతన జరిగింది. అనంతరం జిల్లా కార్యదర్శి మునిగెల శివ ప్రశాంత్ విద్యార్థి అమరులకు సంతాపం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ హాజరై మాట్లాడుతూ 1972లో ఉస్మానియా యూనివర్సిటీ లో జార్జిరెడ్డి నాయకత్వంలో పిడిఎస్ యూ ఆవిర్భావం జరిగిందనీ, నాటి నుండి నేటి వరకు దేశంలోని విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యపై ప్రగతిశీల పోరాటాలు చేస్తుందని, విద్యార్థి హక్కుల పరిరక్షణకూ, దేశంలో సామాజిక,రాజకీయ పరిణామాల పై అలుపెరుగని పోరాటాలు చేస్తుందనీ, ఈ క్రమంలో నిర్బంధాలు, అరెస్టులు,చిత్రహింసలను ఎదుర్కొని మొక్కవోని ధైర్యంతో బలమైన సంఘంగా దేశవ్యాప్తంగా నిర్మాణం చెందిందని అన్నారు. ఈ నిర్మాణంలో జేపీఎస్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, రంగవల్లి, కోలా శంకర్, మారోజు వీరన్న, చాంద్ పాషా, దుస్సా చేరాలు లాంటి అనేక మందిని రాజ్యం, కిరాయి గుండాలచే హత్య చేయించిందనీ ఎన్ని అవరోధాలెదురైనా పిడిఎస్ యూ నిర్మాణం ఆగలేదన్నారు. 53 ఏండ్ల పిడిఎస్ యూ ఉద్యమ ప్రస్థానంలో అనేక విజయాలను సాధించిందనీ, స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ కోసం, సంక్షేమ వసతి గృహాల్లో మెస్ కాస్మోటిక్ చార్జీల పెంపు కోసం, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో, ప్రభుత్వ యూనివర్సిటీలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం, విద్యారంగంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని అనేక సమరశీల పోరాటాలు చేసిందన్నారు. ఖమ్మంలో జరుగనున్న మహాసభలలో మొదటి రోజున వేలాది మందితో ప్రదర్శన బహిరంగ సభ జరగనుందనీ, ఈ మహాసభలో గత ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్ కర్తవ్యాలు రూపొందించుకొనున్నామనీ, పలు అంశాలపై చర్చలు, తీర్మానాలు చేయనున్నారని పేర్కొన్నారు. ఈ మహాసభల జయప్రదానికి విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.చమురు నిక్షేపాల దోపిడీకే అమెరికా వెనిజులా అధ్యక్షుడిని నిర్బంధించింది.

జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వెనిజులా అధ్యక్షుడు మదురో దుపతులు నిర్బంధించడాన్ని నిరసిస్తూ కొత్త బస్టాండ్ అంబేద్కర్ సెంటర్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. దక్షిణ అమెరికాలో సుసంపన్న దేశంగా వెలుగొందిన వెనిజులాలోని చమురు నిక్షేపాలు దోపిడీ చేసేందుకే ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మధురో ను నిర్బంధించారనీ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఈ చర్యను ఖండిస్తుందన్నారు. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించి అర్ధరాత్రి వెనుజులా దేశపు రేడార్ వ్యవస్థను ధ్వంసం చేసి, నైట్ విజన్ మేరాలు, సప్రెస్డ్ గన్స్ తో దేశం నిద్రిస్తున్న వేళ తన ఇంటిని చుట్టు ముట్టారని, వెనిజులా సైనిక స్థావరాలు నిర్వీర్యం చేసారనీ, రాజ ధాని నగరం కారాకాస్ లో మధురో, అతని భార్య సిలియా ఫ్లోర్స్ ను బంధించి తీసుకువెళ్లారన్నారు. అమెరికా దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మతిస్థిమితం లేకుండా మధురో తమ దేశానికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నా రన్నారు. వెనిజులా దేశంలోని చమురు నిల్వల కోసం, అక్కడ ఆయిల్ కంపెనీలపై నియంత్రణ కోసం వెనిజులా అధ్యక్షుడిని బందించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయి, పార్థు, కోశాధికారి సిహెచ్ స్పందన, జిల్లా కమిటీ సభ్యులు శ్రావణి, శ్రావణ్, తరుణ్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

## వివేకవర్ధిని డిగ్రీ పీజి కళాశాల

-జాతీయ సేవా పథకం చీూ శీతాకాల శిబిరం ప్రారంభం

-పాల్వంచ మండలం ఎర్రగుంటలో



చర్చ, పాల్వంచ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : వివేకవర్ధిని డిగ్రీ డ పీజీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పాల్వంచ మండలం ఎర్రగుంటలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మంగళవారం నాడు జాతీయ సేవా పథకం శీతకాల శిబిరం ప్రారంభం అయినది. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్.ఎస్.ఎస్ కన్వినర్ డా? వేమన కామేశ్వర్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే సేవా భావాన్ని అలవరచుకోవాలని, జాతీయ సేవా పథకం వాటి యొక్క విలువలను, విద్యార్థులకు ఉండవలసిన సేవా గుణం గుర్చి వివరించారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన కళాశాల చైర్మన్ యం.వి చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సేవా కార్యక్రమాలతో ఇతరులకు ఆదర్శంగా ఉండాలని ప్రకృతిని చూసి నేర్చుకోవాలని ప్రతి విద్యార్థి ఇంటిలో ఒక మొక్కను నాటాలని, నైతిక విలువలను పాటించాలని సూచించారు. కళాశాల సి.ఇ.వో చైతన్య కృష్ణ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో విద్యార్థులు వెన్నముకలాంటి వారని ఈ శిబిరం ద్వారా గ్రామంలో అనేక మంచి కార్యక్రమాలను చేసి గ్రామ ప్రజల మనస్సు ఎప్పుడు గుర్తించుకునే విధంగా పనులు చేయాలని గ్రామ అభివృద్ధికి మీ సేవా కార్యక్రమాలు ఉండాలని సూచించారు. అనంతరం కళాశాల చైర్మన్ ఎం.వి చౌదరి చేతుల మీదుగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ లు శ్రమధానం చేసి పాఠశాల ఆవరణలో శుభ్ర పరిచారు. ఈ శిబిరంలో కళాశాల సి.ఇ.వో చైతన్య కృష్ణ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు డి. వెంకటేశ్వర రావు, కాళా శాల ప్రిన్సిపల్ సి. హెచ్ సతీష్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎ. మల్లేష్, పాఠశాల అధ్యాపకులు సుధారాణి మరియు అధ్యాపక బృందం, కళాశాల అధ్యాపకులు రజిత, హరీష్, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చైనీస్ మాంజాపై ఉక్కుపాదం

- విక్రయించినా, నిల్వ ఉంచినా క్రిమినల్ కేసులు
- భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్




చర్చ, భద్రాచలం:సంక్రాంతి పండుగ వేళ నిషేధిత చైనీస్ మాంజా విక్రయాలు, వాడకంపై కఠిన చర్యలు తీసుకొనబడుతాయని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. పక్షుల స్వేచ్ఛకు, అమాయక వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తున్న ఈ ప్రమాదకరమైన మాంజాను ఎవరైనా రహస్యంగా విక్రయించినా, నిల్వ ఉంచినా ఉపేక్షించే ప్రసక్తే లేదని అన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పండుగ పూట గాలిపటాలు ఎగురవేయడం సంప్రదాయమే అయినప్పటికీ, అది ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదన్నారు. చైనీస్ మాంజా పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తుందని తెలిపారు. ఇది మట్టిలో కలిసిపోక ఏళ్ల తరబడి అలాగే ఉండిపోతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ చట్టం-1986 ప్రకారం ప్రభుత్వం చైనీస్ మాంజా తయారీ, విక్రయం, నిల్వ, వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించడం జరిగిందని సూచించారు. ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినామని తెలిపారు. భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా అన్ని గాలి పటాల విక్రయ కేంద్రాలు, చిన్న కిరాణా దుకాణాలు, అనుమానిత గోదాములపై సీసీఎస్ మరియు స్థానిక పోలీసులతో సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహిస్తామని అన్నారు. కేవలం విక్రయదారులే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి భద్రాచలానికి అక్రమంగా ఈ నిషేధిత మాంజాను రవాణా చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు, పార్శిల్ సర్వీసులపైనా నిఘా పెంచామని, వారి ప్రమేయం ఉన్నట్లు తేలితే ఏజెన్సీ యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. చైనీస్ మాంజాలో ప్లాస్టిక్, ఇతర సింథటిక్ పదార్థాలతో పాటు గాజు పెంకుల మిశ్రమం పూతగా ఉంటుందని, దీని వల్ల ద్విచక్ర వాహనదారుల మెడలు తెగిపోవడంతో పాటు, పిల్లల వేళ్లు తెగిపోయే ప్రమాదం ఉందని అన్నారు. అంతేకాకుండా, ఇందులో ఉండే మెటాలిక్ పదార్థాల వల్ల విద్యుత్ తీగలకు తగిలినప్పుడు షాక్ కొట్టి పిల్లలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. పట్టణ పౌరులు కూడా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని పోలీస్ శాఖ తరపున విజ్ఞప్తి చేశారు.తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు లేదా నిల్వ చేసినట్లు గమనిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి గానీ,ఏఎస్పీ కార్యాలయ ఫోన్ నంబరు 8712682104 కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, మధురో దంపతులు వెంటనే విడుదల చేయాలి

- వెనిజులా పై అమెరికా దాడిని ఖండించండి
- చలమాల విఠల్ రావు( సిఐటియు ఖమ్మం జిల్లాకోశాధికారి)




చర్చ, సత్తుపల్లి:అమెరికా వెనిజులాపై చేపట్టిన దౌర్జన్య చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని సిఐటియు ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు సిఐటియు పెనుబల్లి మండలం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వి.ఎం.బంజర్ రింగ్ సెంటర్ దగ్గర హమాలీ యూనియన్, భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, రిక్ష కార్మికుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి చలమాల విఠల్ రావు మాట్లాడుతూ,వెనిజులా అధ్యక్షుడు పై తప్పుడు కేసుల పేరుతో వెనిజులా దేశంలోని పౌరులపై క్రూరమైన దాడి జరిపిన అనంతరం, వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురోను ఆయన భార్య సిరియా ఫ్లోరెస్ తో సహా అమెరికా దళాలు భారీ స్థాయిలో దాడి నిర్వహించి అరెస్టు చేసింది. ఇది అంతర్జాతీయ చట్టాలకు స్పష్టమైన ఉల్లంఘన కాగా, అమెరికా సామ్రాజ్యవాదానికి నిదర్శనమైన భయంకరమైన చర్యగా సిఐటియు భావిస్తోంది. ప్రజాస్వామ్యం, సామాజికవాద విలువలను గౌరవించే సంస్థగా, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్న వెనిజులా ప్రజలతో సంఘీభావం ప్రకటించడం సిఐటియు బాధ్యత. మదురోను వెంటనే విడుదల చేయాలని, వెనిజులాపై అమెరికా చేసిన కక్షపూరిత చర్యలకు బాధ్యత వహించి వెంటనే వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మధురో ను ఆయన భార్యను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిఐటియు మిద్దె. స్వామి, నాగయ్య శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గాయం తిరుపతిరావు, తడికమ్మల చిరంజీవి, నాగేశ్వరావు, దుర్గయ్య, వెంకట రామారావు, బుర్రి. సీతారాములు, రాములు, నరసింహారావు,తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమం





చర్చ:- అక్కన్నపేట్ :తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి రైతు వేదికల ద్వారా శాస్త్రవేత్తలచే అవగాహన సదస్సులు ఏర్పాటు చేపడుతున్నవి. ప్రతి మంగళవారం రైతు వేదికలలో పంటల గురించి, చీడపీడల గురించి రైతు చేపట్టవలసిన పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుంది. ఇందులో భాగంగా మంగళవారం వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత ఆధ్వర్యంలో రామవరం రైతు వేదికలో వరి మరియు పత్తి కోత అనంతరం పంట అవశేషాల నిర్వహణ,యూరియా ఎరువు సమర్థవంతమైన వినియోగం, వేసవి పప్పు దినుసులు పంటల సమగ్ర పంటల యాజమాన్యం,నువ్వుల పంట సమగ్ర యాజమాన్యంపై మరియు రైతు రిజిస్ట్రేషన్ గురించి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు రైతు నేస్తం కార్యక్రమం ద్వారా తెలియజేయడం జరిగింది అంతేకాకుండా శాస్త్రవేత్తలచే రైతుల సందేహాలు సలహాలను నివృత్తి చేస్కోవడం జరిగింది ఈ కార్యక్రమంలో రామవరం గండిపల్లి రైతులు పాల్గొనడం జరిగింది.

# రాష్ట్ర మంత్రి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు





చర్చ:- హుస్నాబాద్:రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా మహిళల కొరకు నిర్వహిస్తున్న సంక్రాంతి ముగ్గుల పోటీలు హుస్నాబాద్ మున్సిపల్ పట్టణ , గ్రామీణ ప్రాంత మహిళలకు హుస్నాబాద్ మున్సిపల్ , మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నాడు ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ పోటీలో గెలుపొందిన వారిని నియోజకవర్గస్థాయి ముగ్గుల పోటీలకు అర్హులవుతారని నిర్వాహకులు తెలిపారు ఈ పోటీల్లో వేసిన మహిళల ముగ్గులు వివిధ రకాల ముగ్గులు చూపరులను అలరించాయి.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాయిని రజిత, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి చిత్తారి రవీందర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, మాజీ కౌన్సిలర్లు వల్లపు రాజు, భూక్య సరోజన, పున్న లావణ్య సది, ఎం. శ్రీనివాస్, దండి లక్ష్మ, కోమటి స్వర్ణలత సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిక్యా నాయక్, నాయకులు వి.వి. రమణ, కేశవేణి రమేష్, కృష్ణ స్వామి, పచ్చిమట్ల శ్రీకాంత్ గౌడ్,మైదం శెట్టి వీరన్న, ముప్పిడి రాజిరెడ్డి, గట్టు రాములు, కమలమ్మ, గుర్రాల సంజీవరెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మెప్మా సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## రాముని గుండాల పై సంకష్ట హర చతుర్థి వేడుకలు



చర్చ, రామగుండం:రాముని గుండాల కొండ పై స్వయంభూగా వెలసిన శ్రీ మహా గణపతి బారి రాతి విగ్రహం వద్ద మంగళవారం ఆలయ పూజారి కొండపల్కల నరేష్ ఆచారి అద్వర్యంలో సంకష్ట హర చతుర్థి సందర్భంగా శ్రీ మహా గణపతికి ప్రత్యేక పూజ కార్యక్రమం అభిషేకం అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఆదివారం, బుధవారం, ప్రతి నెల పౌర్ణమి తరువాత 4వ రోజు సంకష్ట హర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమం అభిషేకం, అర్చన నిర్వహించారు. పూజ కార్యక్రమానికి రామగుండం యస్.ఐ సంధ్య, ఆలయ కమిటి సభ్యులు మేడి తిరుపతి, గున్నాల శ్రీనివాస్, గంగాధర్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజ కార్యక్రమం నిర్వహించారు.

## అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, మధురో దంపతులు వెంటనే విడుదల చేయాలి

- వెనిజులా పై అమెరికా దాడిని ఖండించండి
- కోలికపోగు సర్వేశ్వరరావు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు



చర్చ, సత్తుపల్లి:సిఐటియు సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ సర్కిల్లో ప్లే కార్డులతో నిరసన తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమం సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సర్వేశ్వర రావు మాట్లాడుతూ,అమెరికా వెనిజులాపై చేపట్టిన దౌర్జన్య చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని సిఐటియు ఆల్ ఇండియా కమిటీ పిలుపులో వెనిజులా అధ్యక్షుడు పై తప్పుడు కేసుల పేరుతో వెనిజులా దేశంలోని పౌరులపై క్రూరమైన దాడి జరిపిన అనంతరం, వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురోను ఆయన భార్య సిరియా ఫ్లోరెస్ తో సహా అమెరికా దళాలు భారీ స్థాయిలో దాడి నిర్వహించి అరెస్టు చేసింది. ఇది అంతర్జాతీయ చట్టాలకు స్పష్టమైన ఉల్లంఘన కాగా, అమెరికా సామ్రాజ్యవాదానికి నిదర్శనమైన భయంకరమైన చర్యగా సిఐటియు భావిస్తోంది. ప్రజాస్వామ్యం, సామాజికవాద విలువలను గౌరవించే సంస్థగా, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్న వెనిజులా ప్రజలతో సంఘీభావం ప్రకటించడం సిఐటియు బాధ్యత. మదురోను వెంటనే విడుదల చేయాలని, వెనిజులాపై అమెరికా చేసిన కక్షపూరిత చర్యలకు బాధ్యత వహించి వెంటనే వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మధురో ను ఆయన భార్యను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బాబు వెంకట్, రాధాకృష్ణ,నాని, సత్యం, రెడ్డి, మీరాజ్, వెంకటేశ్వరావు, రాము మరియు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి జిల్లాలో దుస్సా జనార్ధన్ ఎన్నికల ప్రచారం






చర్చ,కొత్తగూడెం లీగల్ సెల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, భద్రాచలం బార్ అసోసియేషన్ హాల్లో అధ్య క్షులు లక్కినేని సత్యనారాయణ, దేవదానం ఆధ్వర్యంలో తెలంగాణ బార్ కౌన్సిల్ నెంబర్ గా పోటీ చేస్తున్న దుస్సా జనార్దన్ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ తెలంగాణ బార్ అసోసియేషన్ మెంబర్ గా ఝూతరుపున ప్రస్తుతం పోటీ చేస్తున్న దుస్సా జనార్దన్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై మాట్లాడుతూ న్యాయవాదుల ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని న్యాయవాదులను కోరారు. దుస్సా తో పాటుగా ఐఏ ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యలమోలు ఉదయ భాస్కరరావు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాగా మాధవరావు, ఉపాధ్యక్షులు గోపికృష్ణ, సీనియర్ న్యాయవాదులు పోసాని రాధాకృష్ణమూర్తి, గౌరీ శంకర్ ,కూరపాటి అశోక్, ఏక స్వామి, ఝూ రాష్ట్ర నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు ఉప్పు శెట్టి సునీల్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మాణాలు పూర్తి చేయాలి

- క్యాథ్ ల్యాబ్ ను ప్రారంభించాలి
- ప్రభుత్వాన్ని కోరిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్



చర్చ,గోదావరిఖని:రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పేద ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదని, ఇందుకోసం మరిన్ని నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాలలో ప్రభుత్వాన్ని కోరారు.మూడ లక్షల జనాభా ఉన్న రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రి సరిపోవడం లేదని పేర్కొన్నారు. అయితే నూట నలబై కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మిస్తున్న ఆసుపత్రిని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ఇక్కడున్న ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యం రెండు వేల వరకు ఆవుట్ పేషెంట్లు వస్తూ ఉంటారని వారికి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. 20 కోట్లతో నిర్మించిన క్యాథ్ ల్యాబ్ ను ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులను ఎమ్మెల్యే కోరారు. పారిశ్రామిక ప్రాంతంలో అధికంగా కాలుష్యం వల్ల గుండెపోటు మరణాలు ఎక్కువవుతున్నాయని, వాటిని నివారించేందుకు అధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే సింగరేణి సంస్థ, ఎన్టీపీసీ విద్యుత్ పరిశ్రమ సంబంధించిన సి ఎస్ ఆర్ నిధులతో ఆసుపత్రులను మరింతగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అయితే గతంలో సింగరేణికి సంబంధించిన 500 కోట్ల నిధులతో మెడికల్ కాలేజీని నిర్మించగా ప్రస్తుతం అందులో మరిన్ని సదుపాయాల కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఈ ప్రాంతాన్ని మెడికల్ హబ్ గా తీర్చిదిద్ది, పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు.

## యూకో బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**చర్చ:- హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలోని స్థానిక యూకో బ్యాంక్ భారత ప్రభుత్వ సంస్థ 84వ మహోత్సవం ఘనంగా నిర్వహించారుఅలాగే యూకో బ్యాంక్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ కరీంనగర్ వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు ఈ రక్తదాన శిబిరనికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ఎం ఎల్ ఎన్ రెడ్డి, యూకో బ్యాంక్ మేనేజర్ బొప్పాని రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ దేవయ్య, రామకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్లు ప్రవీణ్ కుమార్, సూరం శ్రీనివాస్, బానోతు రేణుక, అప్రైజర్
కే, శ్రీనివాస్, బ్యాంకు కస్టమర్లు కొత్తపల్లి అశోక్, దుగ్యాల వెంకటేశ్వరరావు, రాజా బ్రహ్మచారి, కోడం రమేష్, సత్యం, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## పద్మశాలి కుల సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ



**చర్చ:- హుస్నాబాద్ :** హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో మండల పద్మశాలి కుల సంఘం అధ్యక్షలు బూర్ల రాజయ్య ఆధ్వర్యంలో జిల్లా పద్మశాలి కుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలి కుల సంఘం అందిస్తున్న సేవలను కొనియాడారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో కుల బాంధవులు కోమటి సత్యనారాయణ, గాజుల భగవాన్ నేత, వడ్డేపల్లి బాలయ్య, గుల్లపల్లి కనకయ్య, బూర్ల సత్యనా రాయణ, వెలిదండి వెంకటేశం, గోలి వెంకట నారాయణ, సాధుల యాదగిరి, కోమటిస −రాయణ, కడవేరుగు యాదగిరి, వడ్డేపల్లి కిషన్, చిదురాల రమేష్,మహిళా ప్రతినిధులు
వడ్డేపల్లి అరుణ, పంతం కన్యాకుమారి, సబ్బని శ్రీదేవి,
పడాల లక్ష్మ ప్రసన్న తదితరులు భాగస్వాములయ్యారు.

## అసెంబ్లీలో ముఖ్యమంత్రిని కలిసిన సీపీఐ నేతలు



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ చైర్మన్, మాజీ శాసనసభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ . శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమరవీరుల స్మరణ కార్యక్రమాలు, ప్రజాసమస్యలు, సామాజిక అం శాలపై ముఖ్యమంత్రితో విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా తెలంగాణ ఉద్య మంలో అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేసే కార్యక్రమాలకు ప్రభుత్వ సహకారం అందించాలని వారు కోరారు.అలాగే మీడియా రంగ అభివృద్ధి,
జర్నలిస్టుల సంక్షమానికి సంబం ధించిన అంశాలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీస్తుళ్లినట్లు తెలిసింది. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం..

## వాస్తు ప్రకారం ఇంట్లో ఈ వస్తువులు అసలు ఉండకూడదు



వాస్తు ప్రకారం కొన్ని వస్తువులు మన ఇంట్లో ఉండకూడదు. అవి ఉంటే ఆర్థికంగా నష్టపోవడంతోపాటు తీవ్ర ఇక్కట్లకు గురికావల్సి వస్తుంది. ఎందుకంటే కొత్త సంవత్సరం ప్రవేశించింది. అందరూ ఇంటిని శభ్రం చేసుకుంటారు. చెత్తా చెదారం మొత్తం బయట పారేస్తారు. అలాగే కొన్నిరకాల వస్తువులను కూడా తీసేస్తే కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయని వాస్తు నిపుణులు తెలియజేస్తున్నారు. కొత్త సంవత్సరంలో వారు సూచించిన పనులు చేసి ప్రతికూల శక్తిని పారద్రోలి అందరూ సంతోషంగా ఉండాలి.
విరిగిపోయిన గడియారాలు, పనిచేయని గడియారాలు ఉండకూడదు వీటివల్ల కుటుంబంలో వాతావరణం ఉద్రిక్తంగా మారుతుంది.గొడవలు జరుగుతాయి. ప్రశాంతతను కోల్పోతారు.పగిలిపోయిన గాజు వస్తువులను తొలగించండి.అద్దాలు పగిలిపోతే వెంటనే బయట పడేయండి.పగిలిన గాజు వస్తువులు కుటుంబంలోకి పేదరికాన్ని తెస్తాయి.
వ్యర్థ పదార్థాలు, విరిగిపోయిన వస్తువులుంటే బయట పారేయండి.వీటివల్ల ఇంట్లోకి ప్రతికూల శక్తి ప్రవేశిస్తుంది.ఇంట్లో ఎండిపోయిన చెట్లు ఉండకూడదు.అలాగే చెడ్డ చెట్లు, కుళ్లిపోయినవి అసలు ఉండకూడదు.పగిలిపోయిన డబ్బాలు, విరిగిపోయిన మొక్కలు, తొలగించాలి.

# సీనియర్ కాంగ్రెస్ నాయకుల ముఖ్య సమావేశం

- నికార్సైన కాంగ్రెస్ నాయకులకు సీట్ల కేటాయింపు పై చర్చ
- కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకి అండగా ఉంటాం
- వర్గ విభేదాలు సృష్టించే వారి నివేదిక పిసిసికి సమర్పిస్తాం



**చర్చ, కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకుల ముఖ్య కార్యకర్తల సమావేశం టిపిసిసి జనరల్ సెక్రటరీ మోతుకూరి ధర్మారావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం రాబోవు స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఎలక్షన్ లో భాగంగా కష్టపడి కాంగ్రెస్ పోటీ చేసే స్థానాల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని అలాంటి వారికే పార్టీ బీఫామ్ కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు తీర్మానించుకోవడం జరిగింది. అందులో భాగంగా టిపిసిసి జనరల్ సెక్రటరీ మోత్కూరి ధర్మారావు మరియు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కి అండగా ఉంటామని కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడు కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకి బీఫామ్ కోసం కృషి చేస్తామని సభాముఖ ంగా తెలియజేయడం జరిగింది. అంతేకాకుండా కొత్తగూడెంలో జరుగుతున్న విషయాలను పిసిసి దృష్టికి తీసుకువెళ్లి కొత్తగూడెంలో పిసిసి అబ్జర్వర్ కమిటీని వేయాలని పిసిసి ని కలిసి కోరుతున్నట్లు నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ దుర్గాప్రసాద్ (చర్ల), జిల్లా గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, కిసాన్ జిల్లా అధ్యక్షుడు ఏలూరు కోటేశ్వరరావు, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు, కొత్తగూడెం మైనారిటీ అధ్యక్షులు మరియు కొత్తగూడెం కన్వీనర్ మహమ్మద్ గౌస్, సీనియర్ నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు,సీనియర్ నాయకులు నిస్సార్, జయప్రకాష్, జిల్లా నాయకులు లాల్ సింగ్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గడ్డం రాజశేఖర్, సేవాలాల్ నియోజకవర్గ అధ్యక్షుడు పూరేటి నరేష్, వీసం చిన్న స్వామి,ఎక్స్ వార్డ్ మెంబర్ తంగేళ్ల లక్ష్మణ్, మాదా శ్రీరాములు, మోరి రమేష్, కొదురుపాక మీనాక్ష,మాజీ ఎంపీటీసీ కసాన బోయిన భద్రం, భూక్య గౌన్సలి, లక్ష్మీదేవిపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జల్లారపు ఈశ్వర్, కొత్తగూడెం టౌన్ యోజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు రుక్మిణి,పాషా, తదితరులు పాల్గొన్నారు.

# సురభి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు



**చర్చ:- హుస్నాబాద్:** హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం కోసం ఈనెల 9న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశానుసారం ఏర్పాటు చేస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మిర్జాపూర్ పిహెచ్ సి అధికారి తెలిపారుఈ ఉచిత వైద్య శిబిరంలో సురభి మెడికల్ ఇన్ స్టిట్యూట్
మెడికల్ సైన్సెస్ సిద్దిపేట వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.హుస్నాబాద్ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణతో పాటు అక్కన్నపేట కోహెడ మండల కేంద్రాల్లో ఈ శిబిరాలు నిర్వహించబడతాయని హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు తెలిపారుఈ శిబిరాలలో వైద్య బృందం సిద్దిపేటలోని సురభి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కాలేజీకి చెందిన 14 రకాల విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్లు, 50 మంది వైద్యులు మరియు 50 మంది పారామెడికల్ సిబ్బంది ఈ క్యాంపులో పాల్గొంటారని తెలిపారు.అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించబడతాయనివారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే, వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సురభి మెడికల్ కళాశాలలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయబడతాయన్నారు. ఈ ఉచిత వైద్య శిబిర ఏర్పాట్ల పరిశీలనలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సిద్దిపేట సురభి మెడికల్ కాలేజీ బృందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతికి భోగి పండ్లు.. మనం తినే రేగు పండ్లు. ఔషధాల గనిగా ఎలా మారాయి



భోగి పండుగ వచ్చిందంటే... భోగి మంటలు, ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు, వాటి మధ్యలో చిన్నారుల నవ్వులు గుర్తుకు వస్తాయి. ఆ చిన్నారులపై భోగి పండ్లు పోయడం వెనక ఉన్న ఆచారం కేవలం సంప్రదాయం మాత్రమే కాదు... ఆరోగ్యంతో ముడిపడ్డ ఒక గొప్ప శాస్త్రమనే చెప్పాలి. రేగుపండ్లు, చెరకు ముక్కలు, పూలు, నాణేలు కలిపి పిల్లలపై పోయడం ద్వారా వారికి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, బలాన్ని కోరుతూ పెద్దలు ఆశీర్వదిస్తారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ ఆచారం వెనక ఉన్న ఔషధ విలువలను ఇప్పుడు వైద్య నిపుణులే అంగీకరిస్తున్నారు.రేగుపండ్లు తీపి, పులుపు, వగరు కలిసిన రుచితో పిల్లలకే కాదు పెద్దలకూ ఇష్టమైన పండు. అయితే ఇవి రుచితోనే కాదు... శరీరానికి అవసరమైన పోషకాలతో ఒక ఔషధాల గనిలా పనిచేస్తాయి. రేగులో సహజంగా ఉండే రోగనిరోధక గుణాలు శరీరంలో వ్యాధులతో పోరాడే శక్తిని పెంచుతాయి. చిన్న పిల్లల్లో తరచూ వచ్చే జలుబు, దగ్గు, జ్వరాల నుంచి రక్షణ కల్పించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే భోగి పండ్లలో రేగుపండ్లకు ముఖ్య స్థానం ఉంటుంది. ఈ పండ్లు మెదడును ప్రశాంతంగా ఉంచడంలోనూ సహాయపడతాయి. నిద్ర సరిగ్గా పట్టని వారు, ఎక్కువగా ఆందోళనకు గురయ్యేవారు రేగుపండ్లు తీసుకుంటే మనస్సుకు హాయిగా ఉంటుందని పెద్దలు చెప్పడం వెనుక కారణం ఇదే. చిన్నారుల్లో చలాకీతనం, ఏకాగ్రత పెరగడానికి కూడా ఇవి దోహదపడతాయి. అందుకే బోగి పండ్లు పిల్లలపై పోసేటప్పుడు cబుద్ధి, బలం పెరగాలిc అని ఆశీర్వదిస్తారు.జీర్ణాశయ ఆరోగ్యానికి రేగుపండ్లు ఎంతో మేలు చేస్తాయి. వీటిలో ఉండే పీచు కడుపు పనితీరును మెరుగుపరచి అజీర్తి, పొట్టమంట, నోటి పుండ్లు వంటి సమస్యలను తగ్గిస్తుంది. పిల్లలైనా, పెద్దలైనా తరచూ ఎదుర్కొనే కడుపు సమస్యలకు ఇది సహజ పరిష్కారం. ఆకలి నియంత్రణలో ఉండడంతో బరువు పెరగకుండా చూసే గుణం కూడా వీటిలో ఉంది.చర్మం, జుట్టు ఆరోగ్యానికి కూడా రేగు పండ్లు ఉపయోగపడతాయి. రక్తాన్ని శుద్ధి చేసే గుణం ఉండటంతో ముఖంపై మచ్చలు తగ్గి చర్మం కాంతివంతంగా మారుతుంది. జుట్టు రాలడం తగ్గి బలం పెరుగుతుంది. పిల్లల్లో చర్మ సమస్యలు రాకుండా, పెద్దల్లో ముందస్తు వృద్ధాప్య లక్షణాలు దరిచేరకుండా చేయడంలో ఇవి సహాయపడతాయి.
ఇక ఎముకల బలం విషయానికి వస్తే... రేగుపండ్లలో ఉండే ఖనిజాలు ఎముకలను దృఢంగా ఉంచుతాయి. పిల్లల ఎదుగుదలకు, పెద్దల్లో కీళ్ల నొప్పులు తగ్గడానికి ఇవి ఉపయోగపడతాయి. మహిళల్లో నెలసరి సమస్యలు, వయస్సు పెరిగే దశలో వచ్చే శారీరక ఇబ్బందులకు కూడా ఇవి ఉపశమనం ఇస్తాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే భోగి పండ్లు కేవలం పండుగ ఆచారం కాదు... చిన్నారుల నుంచి పెద్దల వరకూ ఆరోగ్యాన్ని కాపాడే ఒక సంపూర్ణ ఆరోగ్య

# మత్తు కోసం చెట్లకే వధశిక్షా రుద్రంపూర్ ఎస్ ఆర్ టి లో ఆకతాయిల ఆగడాలు

- కొబ్బరి బొండాల కోసం చెట్లే నరుకుతున్న యువకులూ అధికారులు నిర్లక్ష్యంపై ప్రజల్లో ఆగ్రహం



**చర్చ: చుంచుపల్లి :** మత్తు పదార్థాలు సేవించేందుకు కావలసిన పైసల కోసం చేయరానివి చేయకూడని పనులు చేస్తున్నారు ఆకతాయిలు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ పంచాయతీ పరిధిలోని ఎస్ ఆర్ టి ఏరియాలో మత్తు పదార్థాలకు బానిసైన ఆకతాయిల ఆర్భాటం రోజురోజుకు రౌద్రరూపం దాల్చుతోంది. కొబ్బరి చెట్లకు ఉన్న బొండాలను కోయడం కష్టమవుతుండడంతో చెట్లనే నరికి అమ్మి, ఆ డబ్బుతో మద్యంఉగంజాయి కొనే స్థాయికి తెగబడ్డారు. చెట్లను కోసేసి పారవేస్తున్న దృశ్యాలు స్థానికుల్లో ఆగ్రహం రేపుతున్నాయి .వెంకటేష్ ఖని ఓపెన్ కాస్ట్ విస్తరణలో భాగంగా ఇక్కడి ప్రజలను సింగరేణి ఖాళీ చేయించిన తర్వాత ఈ ప్రాంతం పూర్తిగా నిర్లక్ష్యనికి గురైంది. స్థలం మాత్రం తీసుకున్నారు కానీ భద్రతా చర్యలు తీసుకోవడంలో సింగరేణి అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని ప్రజలు మండిపడుతున్నారు. ఎస్ అండ్ పిసి సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణ నామమాత్రంగా ఉండటంతో ఈ ప్రాంతం మద్యం, గంజాయి, వ్యభిచార కేంద్రంగా మారిపోయిందని విస్మయంతో చెబుతున్నారు.ఒకవైపు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రజలకు నూతన సంవత్సరం శు భాకాంక్షలతోపాటు పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటాలని పిలుపునిస్తూ మరోవైపు ఇక్కడ ఇప్పటికే పెరిగిన చెట్లకే రక్షణ లేకుండా పోవడం తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తోంది.ఇప్పటికైనా పోలీసులు, సింగరేణి అధికారులు కఠినంగా జోక్యం చేసుకుని చెట్లు నరుకుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే కొబ్బరి చెట్లన్నీ నీలమట్టం కావడం కేవలం కాలప్రశ్న మాత్రమేనని స్థానికులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ఈ అకృత్యాలను ఆపాలని ప్రజలు గట్టి డిమాండ్ చేస్తున్నారు.

# రాజకీయ అవినీతికి శిక్ష ఏదీ

రాజకీయ అవినీతికి శిక్షలు లేకుండా పోయాయి. విచారణలు ఏళ్లకు ఏళ్లు సాగుతుంటాయి. ఆధారాలు ఉండవు. ఉన్నా వాటిని మాయం చేస్తారు. భారతదేశంలో రాజకీయ అవినీతి కారణంగా రాజకీయ పార్టీలు ఆడిందే ఆటగా సాగుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే విభజన తరవాత ఉమ్మడి ఎపి నష్టపోయినంతగా గతంలో ఏ రాష్ట్రం కూడా నష్టపోలేదు. ఈ విభజన కేవలం కెసిఆర్ కుటుంబాన్ని, జగన్ కుటుంబాన్ని మాత్రమే కోటీశ్వరులను చేసింది. విభజనతో తెలంగాణ దగాపడ్డదన్నది ముమ్మాటికీ నిజం. ఉద్యమకారుల ముసుగులో నాటి పాలకులు వ్యూహాత్మకంగా ప్రజలను నమ్మించి మోసం చేశారు. ఈ క్రమంలో అప్పులు చేసి రెండు రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టారు. బంగారు తెలంగాణ, ధనిక తెలంగాణ అంటూ కెసిఆర్ తడిబట్టతో గొంతు కోశారు. వీరి నేరాలను రుజువు చేసేదెవరు ఎందుకంటే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో రెండేళ్లయినా కెసిఆర్ అవినీతిపై విచారణ జరగడం లేదు. ఏ కేసులోనూ అవినీతిని రుజువు చేసే చర్యలు చేపట్టలేదు. అలాగే చంద్రబాబు నాయుడు కూడా జగన్ అవినీతి వ్యవహారాలపై మాట్లాడడం లేదు. విచారణలు జరగడం లేదు. జగన్‌ను తిట్టిపోయ డమే తప్ప చేసిదేమీ లేదు. దీనిని బట్టి రాజకీయ పార్టీలు అవగాహనతో ఉంటున్నాయన్న అనుమానం ప్రజల్లో ఉంది. అయితే తాజాగా కవిత తన సొంత కుటుంబం పైనా, బిఆర్ఎస్ వ్యవహారాల పైనా చేసిన ఆరోపణలు పరిశీలిస్తే.. గత పదేళ్లుగా ప్రజలు ఇవే అంశాలపై చర్చించారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత ఎంతగా నష్టపోయామో కుమిలిపోయారు. అందుకే కెసిఆర్‌ను ఓడించి సంబుర పడ్డారు. అయితే ఇప్పుడ చెబుతున్న విషయాలపై ఆనాడు కవిత వేటికీ స్పందించలేదు. లక్షల కోట్లకు కెసిఆర్ కుటుంబం, ఆయన అనుచరులు, ఆనాటి మంత్రులు, ఇలా అంతా పడగలెత్తారు. కానీఒక్కటంటే ఒక్కటి కూడా బయటకు రాలేదు. ఓ ఉద్యోగి వేయి రూపాయలు లంచం తీసుకుంటే పట్టుకుంటున్న పోలీసులు కూడా వారిని పట్టుకునే ప్రయత్నం చేయడం లేదు. దీనిపై కేంద్రం కూడా నాలుగు రాళ్లు వేసి ఊరుకుంటుందే తప్ప పట్టించుకోవడం లేదు. ఇలా ఏళ్లుగా అవినీతి కేసుల నుంచి రాజకీయ పార్టీల నేతలు సమర్థంగా తప్పించు కుంటున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కేసే ఇందుకు పెద్ద ఉదాహరణ. తాజాగా కెసిఆర్ తనయ కవిత ఇప్పుడు సంచలన ఆరోపణలు చేశారు. ఎంతగా అవినీతి జరిగిందో తెలియచేశారు. తండ్రి, బావ అన్నలతో పాటు ఆనాటి మంత్రులు ఎవరెవరు ఎంతగా మేశారో చెప్పారు. వీటి ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీనిపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు కూడా స్పందించి, చర్యలకు డిమాండ్ చేశారు. ఇప్పుడు నిజాయితీ నిరూపించుకోవాల్సిన బాధయత సిఎం రేవంత్‌పై ఉంది. అవినీతి పట్ల ఆచన వైఖరి ఏంటన్నది తెలియాలి. తెలంగాణ వచ్చాక మంచి జరుగుతుందని ప్రజలకు ఆశ ఉండేదని, కానీ, వారి ఆశలన్నింటినీ పదేళ్ల కాలంలో అడియాసలు చేశారని కవిత స్వయంగా ప్రకటించారు. ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వలేదు సరికదా.. తెలంగాణ కోసం పోరాడిన లక్షలాదిమంది ఉద్యమకారులకు గౌరవం కూడా దక్కలేదు. చివరికి, అమర వీరుల స్మారక స్తూపం, అంబేద్కర్ విగ్రహం నిర్మాణంలోనూ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన తరవాత ఆమె తరచూ అవినీతిపై ఆరోపణలు చేస్తూ వచ్చారు. తనది ఆత్మగౌరవ పోరాటమని, ఆస్తుల పంచాయితీ కాదని అంటోంది. అయితే ఆస్తుల పంచాయితీ అని ఇప్పుడు



స్పష్టంగా తేలిపోయింది. ఎందుకంటే లక్షల కోట్ల అవినీతి సొమ్మును దాచుకుని తనకు వాటా ఇవ్వలేన్న బాధతోనే ఆమె బయటకు వచ్చారు. లేదా ఆస్తి అడిగతే గెంటివుంటారు. ఈ రెంటిలో ఏదో ఒకటి అయివుంటుంది. అందుకే ఆమె బాధను మింగలేక తన తండ్రి కేసీఆర్‌పైనా, ఆయన పాలనపైనా తీవ్ర ఆరోపణలు చేశారు. కొద్ది రోజులుగా తనలో దాచుకున్న ఆక్రోశాన్ని వెళ్లగక్కుతూ భావోద్వేగానికి గురయ్యారు. కొత్తగా వచ్చినవాళ్లు, ఉద్యమంతో సంబంధం లేని వాళ్లు సైతం తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర ఏమిటని ప్రశ్నిస్తున్నారని, అందుకే ఈ విషయాలు చెబుతున్నానని కవిత వ్యాఖ్యానించారు. ఇక కాళేశ్వరం కెసిఆర్ ఎటిఎంగా మారిందని స్వయంగా ప్రధాని మోడీ, అమిత్ షాలు పదేపదే ఆరోపించారు పదేళ్లలో రూ.1.89 లక్షల కోట్లు ఖర్చు చేసి 14 లక్షల ఎకరాలకే నీళ్లు ఇచ్చారని, అవే డబ్బులతో 25 లక్షలమంది పేదలకు ఇళ్లు ఇవ్వవచ్చునని తాజాగా కవిత కూడా వ్యాఖ్యానించారు. ఉద్యమకారుల సమస్యలు కేసీఆర్‌కు చేరకుండా అడ్డుగోడ కట్టారని విమర్శించిన కవిత ఆనాడు తానూ ఓ సిఎం కూతురుగా, ఎంపిగా ఉన్నానన్న విషయం మరచి పోయారు. ఈ విషయాలన్నీ ఆనాడే అంతర్గతంగా అయినా లేవనెత్తి ఉంటే వాటికి విలువ ఉండేది. తెలంగాణలో అవినీతి లేని పారదర్శక విధానాన్ని చూడాలనుకున్నామని, కానీ జరగలేదని కవిత వ్యాఖ్యానించారు. అంటే కెసిఆర్ అవినీతి పాలన నిజమే అని కవత చెప్పేశారు. పారదర్శకత అన్నది ముసుగు అన్నది కూడా తేలిపోయింది. పార్టీలో, ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని కవిత వెల్లడించారు. కొంతమంది ప్రజా ప్రతినిధులు చేస్తున్న అవినీతిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు లేవని వివరించారు. అమరజ్యోతి, సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, కలెక్టరేట్ల నిర్మాణంలో అవినీతి జరిగింది. సిద్దిపేట, సిరిసిల్లలో కట్టిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయి. 1969 ఉద్యమకారులనూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాల ట్యాగ్‌లైన్‌కు గండికొట్టేశారు. ఇసుక దందాల కారణంగా నేరెళ్ల లాంటి దురాగతాలు జరిగాయని, అయినా అప్పట్లో చర్యలు తీసుకోలేదని తెలిపారు. తెలంగాణ వచ్చాక కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయకపోగా పెంచి పోషించారని తప్పుబట్టారు. ధర్నా చౌక్‌ను తీసేయాలని నిర్ణయించినప్పుడు తాను వ్యతిరేకించానని, తెలంగాణ వచ్చాక ధర్నా చౌక్ ఎందుకని.. అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని కేసీఆర్ చెప్పారని, కానీ, అవేవీ అమలు కాలేదని తప్పుబట్టారు. మొత్తంగా కవిత తను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉండాలి. తన వద్ద ఉన్న ఆధారాలను ప్రభుత్వానికి లేదా విచారణకు సమర్పించాలి. తెలంగాణకు జరిగిన అన్యాయాలపై గళమెత్తాలి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే బాధలు పోతాయన్న వాదనలు తప్పని తేలింది. ఆంధ్రావాళ్లను అన్యాయంగా నిందించిన తెలంగాణ ఉద్యమకారులు ఇప్పుడు కళ్లు తెరవాలి. అసలు ద్రోహులు తెలంగాణ వారే అని గుర్తించి మరో ఉద్యమానికి సిద్ధం కావాలి.

## వెనెజువెలా అధ్యక్ష భవనం వద్ద కాల్పులు



**మాకు సంబంధం లేదని ప్రకటించిన అమెరికా**

**కారకాస్,జనవరి6:** వెనెజువెలా రాజధాని కారకాస్‌లోని అధ్యక్ష భవనం వద్ద భారీ కాల్పులు, పేలుళ్ల కలకలం రేపాయి. అధ్యక్షుడు నికోలస్ మదురోను యూఎస్ భద్రతా సిబ్బంది అరెస్ట్ చేసి తీసుకెళ్లిన తరువాత వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్జ్ ప్రమాణం స్వీకారం చేశారు. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే అంటే సోమవారం రాత్రి సమయంలో కారకాస్‌లోని అధ్యక్ష భవనంపై గుర్తు తెలియని డ్రోన్ సంచరించింది. దీనిని గమనించిన భద్రతా దళాలు.. డ్రోన్‌పై అటాక్ చేశాయి. భారీగా కాల్పులు జరిపాయి. ప్రస్తుతం అక్కడ వాతావరణం ప్రశాంతంగా ఉన్నట్లు సమాచారం. కాగా, ఈ కాల్పులకు ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఇదిలాఉంటే.. ఈ కాల్పుల ఘటనకు అమెరికాకు సంబంధం లేదని వైట్‌హౌస్ నుంచి ఒక ప్రకటన వచ్చింది. డ్రోన్ విషయంలో అమెరికా ప్రమేయం ఏమాత్రం లేదని ప్రకటనలో పేర్కొంది వైట్‌హౌస్. ఇకపోతే అమెరికా డెల్టా ఫోర్స్ సైన్యం జనవరి 3వ తేదీన వెనెజువెలాపై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్య సిలియా ఎ÷-లోర్స్‌ను కస్టడీలోకి తీసుకుంది. తాజాగా నికోలస్ మదురోను, ఆయన భార్య సిలియాను అమెరికా అధికారులు న్యూయార్క్ కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టులో మదురో తన వాదనలు వినిపిస్తూ.. తాను ఏ తప్పూ చేయలేదని, తనను కిడ్నాప్ చేశారని జడ్జి ముందు స్టేట్‌మెంట్ ఇచ్చారు. మదురోపై ఉన్న నార్కో టెర్రరిజం ఆరోపణలను జడ్జి ఆల్విన్ హెల్లర్ స్టీన్ చదివి వినిపించగా.. అందుకు మదురో సమాధానం ఇస్తూ, తాను నిర్దోషినని, తనకు ఏమీ తెలియదని జవాబు ఇచ్చారు. అంతకు ముందు మదురోను కోర్టుకు తీసుకెళ్తున్న విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోలో మదురో కుంటుతున్నట్టు నడుస్తున్నారు. మదురో చేతికి సంకెళ్లు వేసి ఉన్నాయి. బూడిద రంగు ట్రాక్‌సూట్ ధరించి ఉన్న ఆయన సాయుధ ట్రక్కు నుంచి దిగి నెమ్మదిగా హెలికాప్టర్ వైపు నడుస్తున్నారు. ఆ వీడియో చూసిన వాళ్లు మదురోకు గాయాలు అయినట్టు అనుమానిస్తున్నారు. మదురో ఇప్పటికీ తనను తాను వెనెజువెలా అధ్యక్షుడిగా న్యాయమూర్తికి పరిచయం చేసుకున్నారు. తాను అక్కడ కిడ్నాప్‌నకు గురయ్యానని చెప్పారు. కాగా, మదురో భార్య సిలియా ఫ్లోర్స్ కూడా న్యాయమూర్తికి తన వాదన వినిపించారు. తాను ఏ తప్పు చేయలేదని, పూర్తిగా అమాయకురాలినని జవాబు ఇచ్చారు. కాగా, మదురోపై మోపిన అభియోగాలను క్షుణ్ణంగా పరిశీలించిన జడ్జి ఆల్విన్ హెల్లర్ స్టీన్.. తదుపరి విచారణను మార్చి 17కు వాయిదా వేశారు.

## పరకామణి కేసులో హైకోర్టు కీలక వ్యాఖ్యలు



**• ప్రమేయం ఉన్న పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదుకు ఆదేశం**

**అమరావతి,జనవరి6:** తిరుమలలో సంచలనం సృష్టించిన పరకామణి కేసులో ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రమేయం ఉన్న పోలీసు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. పరకామణి కేసుపై మంగళవారం హైకోర్టులో విచారణకు రాగా.. కేసు దర్యాప్తులో ముందుకు సాగాలని సీఐడీ, ఏసీబీని న్యాయస్థానం ఆదేశించింది. కౌంటింగ్ అంశంలో టేబుల్ ఏర్పాట్లపై సూచనలివ్వాలని హైకోర్టు స్పష్టం చేసింది. నిందితులతో కొందరు పోలీసులు చేతులు కలిపినట్లు సీఐడీ నివేదికలో స్పష్టంగా ఉందని.. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చోరీ కేసు మినహా సీఐడీ, ఏసీబీ దర్యాప్తులో తేలిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగించుకోవచ్చని తేల్చిచెప్పింది. తదుపరి విచారణను హైకోర్టు జనవరి 8 వాయిదా వేసింది. కాగా.. ఈ కేసులో అప్పటి సీఐ జగన్ మోహన్ రెడ్డి, టూటౌన్ సీఐ చంద్రశేఖర్‌తో పాటు నిందితుడు రవికుమార్ ఆస్తులను పరిశీలించిన ఎస్ఐ లక్ష్మీ రెడ్డికి కూడా ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఈ ముగ్గురు పోలీసు అధికారులను పోలీస్ శాఖ వీఆర్‌కు పంపించింది. అయితే ఈ కేసుతో ప్రమేయం ఉన్న పోలీసులపై చర్యలు తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాలతో ఈ ముగ్గురిపై ఏపీ సీఐడీ కేసు నమోదు చేసే అవకాశం ఉంది. అలాగే ఈ కేసుకు సంబంధించి కొన్ని పత్రాలను తారుమారు చేశారనే అభియోగాలు ఎదుర్కుంటున్న వన్‌టౌన్ సీఐ విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేస్తారా లేదా అన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# సోయా కొనుగోళ్లపై ఆందోళన

**బిఆర్ఎస్ పిలుపుతో జిల్లా బంద్**

**స్వచ్ఛందంగా వాణిజ్య సంస్థల మద్దతు**

**మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అరెస్ట్**

**ఆదిలాబాద్,జనవరి6:** ప్రభుత్వం వెంటనే సోయా కొనుగోళ్ల చేపట్టాలని మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బంద్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. దీంతో పట్టణంల వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. పట్టణంలో బిఆర్ఎస్ బైక్ ర్యాలీ నిర్వహించింది. ఈ క్రమంలో ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించడానికి మాజీ మంత్రి జోగు రామన్నతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జోగు రామన్న ఆధ్వర్యంలో ఈ బంద్ నిర్వహించారు. సోయా కొనుగోలులో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధరలు, సరైన రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈక్రమంలో ఆర్టీసీ డిపో వద్ద పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. జోగు రామన్నతో సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. జోగు రామన్న ఆధ్వర్యంలో ఆదిలాబాద్



జిల్లా కేంద్రంలో సోయా కొనుగోలుపై బంద్ నిర్వహించాలని పిలుపునిచ్చారు. గత కొంత కాలంగా సోయా రైతులు పడుతున్న ఇబ్బందులపై పోరాటం చేస్తున్నారు. ముఖ్యంగా సోయా కొనుగోలులో గిట్టుబాటు ధరలపై సరైన ఆధారిత విధానాలు లేకపోవడంపై పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే బంద్‌కి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో బస్సుల రాకపోకలను నేతలు అడ్డుకున్నారు. ఆర్టీసీ డిపో వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న జోగు రామన్నతో సహా పలువురు నేతలను అరెస్టు చేశారు. జోగురామన్న తమ పోరాటాన్ని విస్తృతం చేయడంలో భాగంగా ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు. అన్నదాతలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుత విధానాలకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. రైతన్నల సమస్యలను గుర్తించి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలపై తాము పోరాడుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రైతులు సరైన గిట్టుబాటు ధరలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతలకు న్యాయం చేసేవరకు తాము పోరాడు తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమం పెద్దఎత్తున జరుగుతున్న సమయంలో పోలీసులు భారీ బలగాలతో ఆర్టీసీ డిపో వద్దకు చేరుకున్నారు. ప్రజల మౌలిక హక్కులపై అడ్డగోలుగా ఇబ్బందులు కలిగించకుండా జాగ్రత్త తీసుకోవాలని వారిని హెచ్చరించారు. అయితే, ఆందోళన చేస్తున్న జోగు రామన్నతో సహా మరికొంతమంది నేతలను అరెస్టు చేశారు. ఈ ఘటనతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనల నేపథ్యంలో జోగు రామన్నతో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, గులాబీ శ్రేణులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు. తాము శాంతియుతంగా ధర్నా చేస్తుంటే పోలీసులు ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శుభవార్త చెప్పిన మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్:** తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుభవార్త చెప్పారు. ఎన్నాళ్ల నుంచో ఎదురు చూస్తోన్న హెల్త్ కార్డుల జారీపై కీలక ప్రకటన చేశారు. దీంతో పాటు నిమ్స్‌లో పోస్టుల భర్తీ, కొత్త వైద్య పరికరాల ఏర్పాటు గురించి కీలకాంశాలు వెల్లడించారు. రూ.192 కోట్లతో పలు ఆస్పత్రుల్లో ఎంఆర్ఐ యంత్రాలు, రూ.60 కోట్లతో సీటీ స్కాన్, రూ.32 కోట్లతో లైనాక్ యంత్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిమ్స్‌లో న్యూరో సర్జరీ విభాగం, అదనపు వెంటిలేటర్ బెడ్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలానే రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని వెంటిలేటర్లు, డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అసెంబ్లీలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి దామోదర రాజనర్సింహ బదులిచ్చారు. రాష్ట్రం ఇప్పటికే హెల్త్ కార్డుల కోసం టెండర్లు ఆహ్వానించిందని.. త్వరలోనే వాటిని జారీ చేస్తామని తెలిపారు. నిమ్స్‌లో 813 పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ఈ ఫైలు ఆర్థిక శాఖకు చేరిందని.. అక్కడ నుంచి అనుమతి రాగానే నియామకాలు చేపడతామని ఆయన వెల్లడించారు. నల్గొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సూర్యాపేట, సిద్దిపేట ప్రాంతాలతో పాటుగా నగరంలోని గాంధీ, నిలోఫర్, ఉస్మానియా ఆస్పత్రుల్లో రూ.192 కోట్లతో అదనంగా ఎంఆర్ఐ యంత్రాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. అలాగే, రూ.60 కోట్లతో సీటీ స్కాన్, రూ.32 కోట్లతో లైనాక్ యంత్రాలు పెట్టనున్నామని తెలిపారు. నిమ్స్‌లో రూ.18 కోట్లతో కొత్త న్యూరో సర్జరీ విభాగాన్ని ఏర్పాటు చేశామని, 15 కొత్త వెంటిలేటర్ బెడ్లు కూడా సిద్ధం చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రస్తుతం 1,770 వెంటిలేటర్లు పనిచేస్తున్నాయని, ఫిబ్రవరి నాటికి మరో 485 వెంటిలేటర్లు ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 103 డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయని, త్వరలో మరో 73 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. ఇదిలా ఉంటే ఆధార్ కార్డులు లేవనే కారణంతో ఇతర రాష్ట్రాల రోగులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్చుకోవడం లేదని, అవి లేకపోయినా వారిని చేర్చుకోవాలని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ ప్రభుత్వాన్ని కోరారు.

# సంక్రాంతికి శివార్ల నుంచి ఆర్టీసీ సర్వీసులు



**హైదరాబాద్:** సంక్రాంతి పండుగ(కు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఏపీ, తెలంగాణ జిల్లాలకు ఆర్టీసీ బస్సులు నడుపుతుందని రంగారెడ్డి రీజియన్ మేనేజర్ శ్రీలత() తెలిపారు. స్పెషల్ ఆపరేషన్స్‌పై మహాత్మాగాంధీ బస్టాండ్‌లో సోమవారం పోలీస్, ట్రాఫిక్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ రాయలసీమ వైపు వెళ్లే బస్సులు ఆరాంఘర్..ఉత్తర తెలంగాణకు జేబీఎస్.. విజయవాడ, నల్లగొండ, ఖమ్మం() ప్రాంతాలకు ఎల్‌బీనగర్ నగర్ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. సౌత్‌జోన్, సుల్తాన్ బజార్ రాజేంద్రనగర్ ఏసీపీలు_.లక్ష్మణ్, _.శ్రీనివాస్, డి.సుధీర్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు మహంకాళి, ఎన్.జానకిరాం, ట్రాఫిక్ సీఐలు వి.మదన్‌లాల్, జి.బాలకృష్ణ పలువురు అధికారులు పాల్గొన్నారు.

# జీడిమెట్లలో గంజాయి బ్యాచ్ వీరంగం



**మేడ్చల్, జనవరి 6:** జిల్లాలోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి బ్యాచ్ వీరంగం సృష్టించింది. ఆ ప్రాంతంలో గంజాయి బ్యాచ్ ఆగడాలు రోజు రోజుకు శృతిమించి పోతున్నాయి. కొంతమంది గంజాయిని సేవించి చుట్టుపక్కల వారి పట్ల అసభ్యరీతిలో ప్రవర్తించడం కలకలం రేపుతోంది. గంజాయి బ్యాచ్ హల్‌చల్‌తో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎన్ అబశ్రీశ్రీఎల్‌బీనగర్‌లో గత అర్ధరాత్రి గంజాయి బ్యాచ్ దారుణానికి పాల్పడింది. హనుమాన్ టెంపుల్ వద్ద గంజాయి తాగుతున్న పవన్ కళ్యాణ్ (20), సంఘీ(20) అనే యువకులను కాలనీకి చెందిన మహిళలు నిలదీశారు. దీంతో గంజాయి మత్తులో ఆ ఇద్దరు యువకులు రెచ్చిపోయారు. తమను నిలదీసిన ఇద్దరు మహిళలను విచక్షణారహితంగా చితకబాదారు. వీరి దాడిలో ఆ ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన కాలనీ వాసులు గాయపడ్డ మహిళలను స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే ఇద్దరు గంజాయి బ్యాచ్ యువకులను పట్టుకుని దేహశుద్ధి చేసి.. ఆపై పోలీసులకు అప్పగించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్న జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే తమ కాలనీలో గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగిపోతున్నాయని.. వారి బారి నుంచి తమను రక్షించాలని.. గంజాయిని అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఏం కోల్పోయామో అర్థమైతే కాంగ్రెస్‌ను ప్రజలు ఎప్పటికీ క్షమించరు



**రంగారెడ్డి :** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 10 శాతం పనులను పూర్తిచేస్తే నీళ్లను వాడుకోవచ్చని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు కొత్త ప్రాజెక్టు కడితే ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించారు. రూ.32 వేల కోట్ల పనులు బీఆర్ఎస్ పూర్తి చేసిందని తెలిపారు. రూ.27 వేల కోట్ల బిల్లులు చెల్లించామని పేర్కొన్నారు. కేసీఆర్ వచ్చాక తెలంగాణ నీటి లభ్యత గురించి తెలియజేశారని అన్నారు. ముందే అప్రమత్తమైతే తెలంగాణ నీటి వాటాను కోల్పోయేది కాదని అభిప్రాయ పడ్డారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వట్టెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. జూరాలకు సరాసరి 25 రోజులు వరద వస్తుందని అన్నారు. జూరాల ప్రాజెక్టు కడితే తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. 3 లక్షల పైచిలుకు జనం ముంపునకు గురవుతారని పేర్కొన్నారు. ఇంత చేసినా జూరాల వద్ద నీళ్లుండవని చెప్పారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయి అన్ని రిజర్వాయర్లను నింపితే 68 టీఎంసీల నీళ్లు వస్తాయని తెలిపారు. అవసరమైతే మళ్లీ నీళ్లను నింపుకోవచ్చని అన్నారు. దీనివల్ల ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. తెలంగాణ నీళ్లను వాడుకుంటే ఇబ్బందని జూరాల ప్రాజెక్టు తీసుకొచ్చారని మండిపడ్డారు. జూరాల ప్రాజెక్టును కాంగ్రెస్ నాయకులు 40 ఏళ్ల నుంచి ప్రజలకు చూపిస్తున్నారని నిరంజన్ రెడ్డి తెలిపారు. జూరాల నుంచి నీళ్లు తీసుకోవడం అంటే పాలమూరుకు నీళ్లు వద్దని చెప్పడమే అని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మంచిని తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఏం కోల్పోయామో అర్థమైతే ఎప్పటికీ మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు. చరిత్రలో కాంగ్రెస్‌కు స్థానమే ఉండదని.. ఎప్పటికైనా చరిత్రలో నిలిచేది కేసీఆరే అని స్పష్టం చేశారు. దొంగ మాటలు, మోసాలతో ప్రజలను ముంచాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి జీవో 24ను ఒకసారి చదువుకోవాలని సూచించారు. ఏపీ ట్రాప్‌లో కాంగ్రెస్ నేతలు పడిపోవద్దన్నారు.

# మృత్యుపాశాలుగా మాంజాలు



**హైదరాబాద్:** సంకాంత్రి పండుగ అంటే గుర్తు వచ్చేది ముత్యాల ముగ్గులు, హరిదాసుల పాటలు, పండుగ సెలవులు. వీటికి తోడు అతి ముఖ్యంగా చెప్పుకోదగింది పతంగులు. అయితే మన గాలిపటంతో ఇతరులు ఎగురవేసే గాలిపటాన్ని తెగ్గోస్తే అదో సరదా. ఆ సరదా తీరాలంటే దానికి మాంజా కావాలి. సాధారణంగా మాంజా తయారీలో సీసం పౌడర్‌ను వినియోగిస్తారు. దీనివల్ల మనుషులకే కాక పశుపక్ష్యదులకు కూడా ఎంతో ప్రమాదం. మాంజా ప్రమాదమని తెలిసినా సాధారణ మాంజానే కాక చైనా మాంజా(జష్ఘుఅఖు మీఖఅఓఖు)లను కూడా వాడుతుంటారు. గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలుఈ మంజాలపై నిషేధం ఉన్నప్పటికీ గుట్టు చప్పుడు కాకుండా వీటి విక్రయాలు జరుగుతున్నాయి. ఏవైనా ప్రమాదాలు సంభవించినప్పుడు కొద్ది రోజులు హల్‌చల్ చేసే అధికారులు అది కాస్తా సద్దుమణగగానే ఆ విషయాన్ని గాలికి వదిలేస్తారు. దీనితో యధేచ్ఛగా మాంజాల విక్రయాలు జరుగుతున్నాయి. ఒకరి సరదా మరొకరి ప్రాణాల మీదకు వస్తుంది. ఈమ?ధ్య కీసరలో మాంజా వల్ల ఓ యువకుడి గొంతు తెగిన ఘటన మరువక ముందే డిసెంబరు 29న నవాబ్‌సాబ్‌కుంటకు చెందిన జమీల్ బైక్‌పై వెళుతుండగా శంషీర్‌గంజ్ వద్ద చైనా మాంజా అడ్డుపడటంతో అతడి గొంతును కోసేసింది. మనల్ని మనం కాపాడుకోవాలిఇలాంటి మాంజాల వల్ల అనేకమంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతుంటారు. ద్విచక్ర వాహనాల ముందు చిన్నారులను కూర్చోబెడుతుంటారు. ఇది మరీ ప్రమాదం. సంక్రాంతి సమీపిస్తుండడంతో పిల్లలు, పెద్దలు పోటాపోటీగా గాలిపటాలను ఎగురవేస్తుంటారు. దీనితో తెగిపోయిన మాంజా భవనాల మధ్య వేలాడుతుంటుంది. దీనిని గమనించకుండా వాహనదారులు వెళుతుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అందువల్ల ద్విచక్రవాహనంపై వెళ్లేటప్పుడు మెడకు ఖర్చీఫ్ కట్టుకుని, తలపై హెల్మెట్ ధరించి ప్రయాణిస్తే ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

# కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అట్టర్ ఫ్లాప్ అవుతుంది



**మహబూబ్ నగర్ జిల్లా :** యాసంగిలో జూరాల ప్రాజెక్టు కింద ఆయకట్టుకు క్రాప్ హాలీ డే ఇచ్చారని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి గుర్తుచేశారు. క్రాప్ హాలీడే ఇచ్చిన ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తిపోస్తారా అని ప్రశ్నించారు. జూరాల నుంచి నీళ్లు ఎత్తిపోయడం అసాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు మళ్లీ తొండి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నేతలు అజ్ఞానంతో మాట్లాడటం దురదృష్టకర మని వ్యాఖ్యానించారు. బూత్‌పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని ఎలా ఎత్తిపోస్తారని ప్రశ్నించారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వట్టెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అట్టర్ ఫ్లాప్ అవుతుందని విమర్శించారు. కొడంగల్ లిఫ్ట్‌తో ప్రజాధనం కచ్చితంగా వృథ అవుతుందని అన్నారు. కేసీఆర్ గొప్పగా ప్రాజెక్టు డిజైన్ చేస్తే.. దాన్ని పడావు పెట్టారని మండిపడ్డారు. కాల్వలకు టెండర్లు పిలిచి పూర్తి చేస్తే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా లకు నీళ్లు వస్తాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అవగాహన లేకుంటే నిపుణులతో మాట్లాడి తెలుసుకో వాలని సూచించారు. మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చి కమీషన్లు దండుకున్న ఘనత కాంగ్రెస్ పాలకులదే అని లక్ష్మారెడ్డి విమర్శి ంచారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి ఉంటే ఆరు నెలల్లోనే పాలమూరు ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నోటికొచ్చిన అబద్ధాలు మాట్లాడుతున్నారని లక్ష్మారెడ్డి మండిపడ్డారు. చంద్రబాబుకు చెప్పి రాయలసీమ ప్రాజెక్టును ఆపించానని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి అంటే.. ఆ వ్యాఖ్యలను ఏపీ ప్రభుత్వం తీవ్రంగా ఖండించిందని తెలిపారు. జూరాల నుంచి పాలమూరు లిఫ్ట్ పెడితే ఒక్క చుక్క నీరు కూడా రాదని పేర్కొన్నారు. ఎన్ని రోజులు పంపింగ్ చేసినా లాభం ఉండదని అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాను ఎడారిగా మార్చే ఆలోచనలు చేస్తున్నారని అన్నారు. దీనిపై ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు ఆలోచన చేయా లని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎందుకు ఈ ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడలేదని ప్రశ్నించారు.

# ప్రజా పోరాటాలతోనే పార్టీ బలోపేతం



**రామగిరి,06 :** ప్రజా పోరాటాతోనే పార్టీ బలోపేతం అవుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. మంగళవారం నఅల్లగొండ పట్టణంలోని ఏం ఎస్ గార్డెన్‌లో సిపిఎం పార్టీ జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జాన్ వెస్లీ మాట్లాడు తూ.. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని, ముఖ్యంగా ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్పించాల న్నారు. పేద ప్రజల కోసం పనిచేసే ఏకైక పార్టీ ఎర్రజెండా అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాల న్నారు. ప్రపంచంపై పెత్తనం చెలాయించేందుకు అమెరికా ప్రయత్నిస్తుందఅబశ్రీశ్రీని, అందులో భాగంగానే వెనిజులా అధ్యక్షుడు మదురో దంపతులను అరెస్ట్ చేసిందని తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమలను తిప్పికొట్టాలన్నారుసిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో అప్పులు చేసి దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేందుకు బలమైన ప్రజా పోరాటాలు చేయాలన్నారు. భవిష్యత్ దేశానికి కమ్యూనిస్టులు అవసరమన్నారు. నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా అభిమానం గెలుచుకోవాలన్నారు. నల్లఅబశ్రీశ్రీగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం బలమైన ప్రజా ఉద్యమాలు చేసి జిల్లాను ముందు భాగాన ఉంచుతామని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. నల్లఅబశ్రీశ్రీగొండ జిల్లాలో సాగు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎల్‌బీసీకి నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. డిండి ప్రాజెక్టు పూర్తి చేయాలని, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధి, సంక్షమం కోసం నిధులు కేటాయించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మనారాయణ, వీరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కవిత కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యమేమీ లేదు



**హైదరాబాద్, జనవరి 6:** ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి స్వీట్ వార్నింగ్ కూడా ఇచ్చారు. మరి ఇంతకీ ఆయన ఎందుకు అలా అన్నారు.. సొంత పార్టీకే ఎందుకు వార్నింగ్ ఇచ్చారు.. పూర్తి వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం నాడు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న కవిత ఎపిసోడ్‌పై స్పందించారు. కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నారాయన. దానం నాగేందర్, కడియం శ్రీహరి తమ పార్టీలోకి వస్తారని ఊహించ లేదని.. చివరికి వారు వచ్చారు కదా అని ఉదహరించారు మల్‌రెడ్డిఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి కూడా చిన్నపాటి వార్నింగ్ ఇచ్చారు. మల్‌రెడ్డి రంగారెడ్డి ఎప్పటి నుంచో మంత్రి పదవి ఆశిస్తున్నారు. హైదరాబాద్ కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని పలుమార్లు బహిరంగంగానే అడుగుతూ వచ్చారు. ఇప్పుడు కూడా అదే అంశాన్ని ఆయన ప్రస్తావించారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే నష్టం కలుగుతుందని పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. పార్టీ పెద్దలు ఆలోచించాలని కోరారు. రెండు కోట్ల మంది ప్రజలు ఉన్న జిల్లాకు ఇంత వరకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. రంగారెడ్డి జిల్లా పేరు మార్పుపైనా ఆయన స్పందించారు. పేరు మార్పు తనకు ఇష్టం లేదన్నారు. రంగారెడ్డి జిల్లా పేరు మార్పు అనేది కేవలం ఊహాగానమే అని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఎన్ని మున్సిపాలిటీలు అయినా చేసుకోవచ్చుని.. జిల్లా స్వరూపం మాత్రం మారొద్దని ప్రభుత్వాన్ని మల్‌రెడ్డి కోరారు. ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో రియల్ భూమ్ పెరిగిందన్నారు. భూముల రేట్లు పెరుగుతున్నాయని భూములు ఎవరూ అమ్మడం లేదన్నారు. ఫార్మాసిటీపై పోరాటం చేసినందుకే గతంలో తనను కేసీఆర్ ఓడగొట్టారని మల్‌రెడ్డి చెప్పారు. నాటి ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం ఫార్మాసిటీ వచ్చి ఉంటే 50 కిలోమీటర్ల మేర పొల్యూ?షన్ అయ్యేదన్నారు.

# ఆ ప్రాజెక్ట్ పూర్తి చేయకపోతే కాంగ్రెస్ సర్కార్‌పై పోరాటం



**మహబూబ్‌నగర్, జనవరి 6 :** కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు ప్రజలు వలసలు పోయింది గత కాంగ్రెస్ పాలనలోనేనని ఆరోపణలు చేశారు. (మంగళవారం) మహబూబ్ నగర్‌లో శ్రీనివాస్‌గౌడ్ పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు శ్రీనివాస్‌గౌడ్. జూరాల ప్రాజెక్టు పూర్తి చేశారంటే.. అది బీఆర్ఎస్ పుణ్యమేనని చెప్పుకొచ్చారు. స్వల్ప నీటి లభ్యత ఉన్న జూరాల వద్దని 306 టీఎంసీల నీటి లభ్యత ఉన్న శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సోర్సుగా మార్చామని స్పష్టం చేశారు. పాలమూరు లిఫ్ట పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తాము ప్రయత్నించామని చెప్పుకొచ్చారు. ఈ విషయం కాంగ్రెస్ నేతలకు కనిపించటం లేదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. అన్ని రాజకీయ పార్టీ నేతలతో కలిసి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులను సందర్శిద్దామని పేర్కొన్నారు. తమ హయాంలో చేసింది తప్పని తేలితే రాజకీయాల నుంచి వైదొలగుతామని సవాల్ విసిరారు. వంద కిలోమీటర్ల దూరం బ్యాక్ వాటర్ ఉన్న సోర్సే ముఖ్యమని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి పేరు చిరస్థాయిగా ఉండాలంటే పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిపోయిన పదిశాతం పనులు పూర్తి చేయాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి భేషజాలానికి పోవద్దని కోరారు. కాంగ్రెస్ సర్కార్ పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే తాము పోరాటం చేస్తామని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఆ పథకం అట్టర్ ఫ్లాఫ్: లక్ష్మారెడ్డినారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం అట్టర్ ఫ్లాఫ్ అని..ప్రజాధనం వృథనేనని మాజీమంత్రి లక్ష్మారెడ్డి విమర్శలు చేశారు. 47 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదంతో పాటు తక్కువ నీటి లభ్యత కారణంగానే జూరాల నుంచి పాలమూరు లిఫ్టును శ్రీశైలానికి మార్చినట్లు తెలిపారు. ఉన్న ఆయకట్టుకు నీరు ఇవ్వలేని జూరాల నుంచి కొత్త ప్రాజెక్టుకు నీళ్లు ఎలా ఇస్తామని ప్రశ్నించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసత్యాలు మాట్లాడారని ధ్వజమెత్తారు. ఇలాంటి సీఎం, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ తెలంగాణ రాష్ట్రంలో ఉండటం ప్రజల దౌర్భాగ్యమని విమర్శలు చేశారు. హరీశ్‌రావు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తప్పని నిరూపిస్తే తాము కాంగ్రెస్‌కు మద్దతిస్తామని సవాల్ విసిరారు. తాము అధికారంలోకి వచ్చి ఉంటే ఆరునెలల్లో పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేసేవాళ్లమని చెప్పుకొచ్చారు. మొబిలైజేషన్ అడ్వాన్సులతో కాంగ్రెస్ నేతలు అక్రమాలకు పాల్పడుతున్నారని లక్ష్మారెడ్డి ఆరోపణలు చేశారు.

చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక
బుధవారం, జనవరి 07, 2026



# ఫామ్ కోసం కోహ్లీ గట్టిగా పోరాడాల్సింది

**• భారత మాజీ క్రికెటర్, కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్**



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి వైదొలగడంపై భారత మాజీ క్రికెటర్, కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ నిరాశ, విచారం వ్యక్తం చేశాడు. కింగ్ కోహ్లీ రెడ్ బాల్ కెరీర్కు ముందుగానే ముగింపు పలకడానికి బదులుగా, తన ఫామ్ను తిరిగి పొందడానికి మరింత గట్టిగా పోరాడాల్సిందని అభిప్రాయపడ్డాడు. ఫ్యాబ్ ఫోర్లోని జో రూట్, స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్ వంటి బ్యాటర్లు టెస్టుల్లో రాణిస్తున్న సమయంలో కోహ్లీ ఆ ఫార్మాట్కు దూరం కావడం బాధగా ఉందన్నాడు. ఈ మేరకు టెస్టు క్రికెట్కు విరాట్ కోహ్లీ గుడ్ బై చెప్పడం గురించి తన అభిప్రాయాలను తెలియజేస్తూ ఇన్స్టాలో సంజయ్ మంజ్రేకర్ ఓ వీడియోను షేర్ చేశారు. టెస్టు క్రికెట్లో ఇంగ్లాండ్ ప్లేయర్ జో రూట్ రోజురోజుకు సరికొత్త శిఖరాలు అందుకుంటున్నాడని సంజయ్ మంజ్రేకర్ తెలిపాడు. ఈ నేపథ్యంలో తన మనసు మాత్రం విరాట్ కోహ్లీ వెంటే పరుగులు తీస్తోందన్నాడు. విరాట్ చాలా ముందుగానే టెస్టులకు గుడ్ బై చెప్పాడని అన్నాడు. రిటైర్ అవ్వడానికి ఐదేళ్ల ముందు నుంచి అతడు సరైన ఫామ్ లేక ఇబ్బంది పడ్డాడని గుర్తు చేసుకున్నాడు. అయినా సరే పట్టువీడకుండా ఆడాడని, గత ఐదేళ్లలో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ యావరేజ్ 31గా ఉందని వెల్లడించాడు. అలాంటపుడు తన లోపాలు సరిచేసుకుని ముందుకు సాగాల్సిందిపోయి టెస్టు క్రికెట్ నుంచి రిటైర్ కావడం దురదృష్టకరమన్నాడు. జో రూట్, స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్ టెస్టు క్రికెట్లో మరింత గొప్పగా పేరు తెచ్చుకుంటూ ఉంటే కోహ్లీ మాత్రం ఇలా చేయడం విచారకరమని పేర్కొన్నాడు. టాప్ ఆర్డర్ బ్యాటర్కు ఎంతో సులువైన వన్డే ఫార్మాట్లో మాత్రం విరాట్ కొనసాగుతున్నాడని, ఆ నిర్ణయం తనను తీవ్రంగా నిరాశపర్చిందని సంజయ్ మంజ్రేకర్ తెలిపాడు. ‹విరాట్ కోహ్లీ అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటిస్తే బాగుండేది. కానీ అతడు టాప్ ఆర్డర్ బ్యాటర్కు ఎంతో సులువైన వన్డేలలో మాత్రం కొనసాగాలనే నిర్ణయించుకున్నాడు. ఈ నిర్ణయం నన్ను నిరాశకు గురిచేసింది. టెస్టు, టీ20 క్రికెట్ ఈ రెండు బ్యాటర్కు భిన్నమైన సవాళ్లను ఇస్తాయి. టెస్టు క్రికెట్ ఓ ఆటగాడిని ఎల్లప్పుడూ పరీక్షిస్తుంటుంది. కానీ కోహ్లీ దానినే వదిలేయడం గమనార్హం. బాగా ఫిట్గా ఉండి కూడా ఇంకొన్నాళ్లు పోరాడకుండా కోహ్లీ టెస్టు ఫార్మాట్ను వదిలిలేశాడు. ఒకవేళ కోహ్లీని ఒక సిరీస్ నుంచి తప్పిస్తే ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాల్సింది. ఆ తర్వాత మళ్లీ టెస్టుల్లోకి రీఎంట్రీ ఇవ్వడానికి ప్రయత్నించాల్సింది. అని సంజయ్ మంజ్రేకర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవలే టీమ్ఇండియా మాజీ ఆటగాడు నవ్జ్యోత్ సింగ్ సిద్ధూ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. దేవుడు తనకు వరం ప్రసాదించి ఏదైనా కోరుకోమంటే కోహ్లీ తన రిటైర్మెంట్ను వెనక్కి తీసుకోని టెస్టు క్రికెట్ ఆడేలా చేయమని అడుగుతానని చెప్పాడు. 1.5 బిలియన్ల జనాభా ఉన్న దేశానికి ఇంతకంటే ఆనందాన్ని ఏదీ ఇవ్వదన్నాడు. 20 ఏళ్ల యువకుడిలా విరాట్ ఫిట్ నెస్ ఉందని, అతడు 24 క్యారెట్ల గోల్డ్ అని కొనియాడాడు. ఈ మేరకు ఇన్స్టా పోస్టులో రాసుకొచ్చాడు.ప్రస్తుతం కింగ్ కోహ్లీ వన్డే ఫార్మాట్లో మాత్రమే కొనసాగుతున్నాడు. టీ20, టెస్టు ఫార్మాట్లకు గుడ్ బై చెప్పేశాడు. కోహ్లీ 123 టెస్టు మ్యాచ్లలో (210 ఇన్నింగ్స్ లు) 30 శతకాలు, 31 హాఫ్ సెంచరీలతో 9230 పరుగులు చేశాడు. 2019 చివరి నాటికి కోహ్లీ బ్యాటింగ్ యావరేజ్ 54.97 ఉండగా, రిటైర్మెంట్ అయిననాటికి 46.85కి పడిపోయింది.గత ఐదేళ్లుగా టెస్ట్ క్రికెట్లో కోహ్లీ పేలవ ఫామ్తో సతమతమయ్యాడు. 2021 నుంచి విరాట్ తాను ఆడిన 39 టెస్టు మ్యాచ్లలో (69 ఇన్నింగ్స్ లు) 30.72 సగటుతో 2028 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, తొమ్మిది అర్ధ సెంచరీలు ఉన్నాయి. బౌలర్లు ఆఫ్ స్టంప్కు వెలుపల బంతులు వేసి కోహ్లీ బలహీనతను ఉపయోగించుకుని ఎక్కువసార్లు ఔట్ చేశారు. గత ఐదేళ్లలో కోహ్లీని ఎక్కువ సార్లు (5) ఆసీస్ పేసర్ స్కాట్ బోలాండ్ ఔట్ చేశాడు. ఆస్ట్రేలియాతో జరిగిన తన చివరి సిరీస్లో కోహ్లీ తొమ్మిది ఇన్నింగ్స్లలో కేవలం 190 పరుగులు మాత్రమే చేశాడు.

# బీసీసీఐకి నష్టమా లేక ఐసీసీకి నష్టమా..?




టీ20 వరల్డ్ కప్ 2026లో తమ మ్యాచ్లను భారత్కు వెలుపల నిర్వహించాలని బంగ్లాదేశ్ కోరుకుంటోంది. భద్రతా కారణాలను చూపుతూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తమ జట్టును భారత్కు పంపడానికి నిరాకరించింది. పాకిస్థాన్ మ్యాచ్లు ఇప్పటికే శ్రీలంకలో జరగనున్నాయి. ఇప్పుడు బంగ్లాదేశ్ మ్యాచ్లు కూడా ఆతిథ్య దేశమైన భారత్లో జరగకపోతే, బీసీసీఐకి ఏదైనా నష్టం జరుగుతుందా ముందుగా, టీ20 వరల్డ్ కప్ 2026 అనేది ఒక ఐసీసీ ఈవెంట్ అని అర్థం చేసుకోవడం ముఖ్యం. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ నిర్వహించే ఈవెంట్లో టిక్కెట్లు, స్పాన్సర్షిప్, బ్రాడ్కాస్ట్ నుంచి వచ్చే ఆదాయం నేరుగా బీసీసీఐకి వెళ్లదు, అది వరల్డ్ కప్ ఆతిథ్య దేశమైనప్పటికీ. ఈవెంట్ నుంచి వచ్చే ఆదాయాన్ని ఐసీసీ బిజినెస్ కార్పొరేషన్ చూసుకుంటుంది. ఆతిథ్య బోర్డు, అంటే బీసీసీఐ పాత్ర టీ20 వరల్డ్ కప్ నిర్వహణ, కార్యకలాపాల వరకు మాత్రమే పరిమితం అవుతుంది. టీ20 వరల్డ్ కప్ 2026 ద్వారా బీసీసీఐ ఆదాయం మ్యాచ్ డే సర్వీస్, స్పాన్సర్షిప్ నుంచి వస్తుంది. అందువల్ల, బంగ్లాదేశ్ మ్యాచ్లను భారత్కు వెలుపల షిఫ్ట్ చేస్తే, బీసీసీఐ ఆదాయంపై పెద్దగా ప్రభావం ఉండదు. బీసీసీఐకి నష్టం జరిగినా, అది మ్యాచ్ డే-ఎకనామిక్స్కు మాత్రమే పరిమితం అవుతుంది. టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ ఇప్పటికే విడుదలైనందున, ఆటగాళ్లు, కోచింగ్, ఇతర సహాయక సిబ్బందితో సహా ఇతర అధికారుల బస, విమాన బుకింగ్లు ముందే జరుగుతాయి. ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్ మ్యాచ్లు కోల్కతా, ముంబైలో జరగాల్సి ఉంది. ఇప్పుడు బంగ్లాదేశ్ మ్యాచ్లు షిఫ్ట్ అయితే, అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఆటగాళ్లు, ఇతర సిబ్బందికి హోటల్ బుకింగ్, విమాన ప్రయాణం వంటి ఖర్చులను ఐసీసీ భరిస్తుంది. అందువల్ల, బంగ్లాదేశ్ మ్యాచ్లు భారత్కు వెలుపల షిఫ్ట్ అయితే, వారితో ఆడే జట్ల ఆటగాళ్లు కూడా వేరే వేదికలకు ప్రయాణించాల్సి ఉంటుంది. దీనివల్ల కొంతవరకు ఐసీసీ ఖర్చు పెరగవచ్చు, కానీ బీసీసీఐ లేదా ఆ దేశ క్రికెట్ బోర్డుకు కాదు. టీ20 వరల్డ్ కప్ 2026 ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం, బంగ్లాదేశ్ గ్రూప్ జలో ఇంగ్లాండ్, ఇటలీ, నేపాల్, వెస్టిండీస్తో ఉంది. బంగ్లాదేశ్ తన మొదటి మ్యాచ్ను ఫిబ్రవరి 7న వెస్టిండీస్తో ఆడనుంది.

# 13 సిక్సర్లు 12 ఫోర్లతో అమన్ రావు విశ్వరూపం



హైదరాబాద్ ఓపెనర్ అమన్ రావ్ విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్పై డబుల్ సెంచరీ సాధించాడు. ఇన్నింగ్స్ చివరి బంతికి సిక్సర్ కొట్టి తన 200 పరుగులు పూర్తి చేసుకున్నాడు. అమెరికాలో జన్మించిన అమన్ ఇప్పుడు భారత దేశవాళీ క్రికెట్లో దుమ్ము రేపుతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీ ప్రస్తుత ఎడిషన్లో గ్రూప్ స్టేజ్ ఆరో రౌండ్లో హైదరాబాద్ బెంగాల్తో తలపడింది. సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్లో బెంగాల్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. అమన్ రావ్, రాహుల్ సింగ్ హైదరాబాద్కు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ మొదటి వికెట్కు శతక (104) భాగస్వామ్యం నెలకొల్పారు. రాహుల్ 65 పరుగులు చేసి ఔటయ్యాడు. అమన్ కెప్టెన్ తిలక్ వర్మతో కలిసి రెండో వికెట్కు 87 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. 38వ ఓవర్లో ఒక పరుగు తీసి 108 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఇది అమన్కు లిస్ట్ ఏ క్రికెట్లో మొదటి సెంచరీ. దీనిని పూర్తి చేసిన తర్వాత అతను దూకుడుగా బ్యాటింగ్ చేయడం ప్రారంభించాడు. తదుపరి 100 పరుగులు కేవలం 46 బంతుల్లోనే సాధించాడు. చివరి ఓవర్ నడుస్తున్నప్పుడు, అమన్ తన డబుల్ సెంచరీని పూర్తి చేయలేడేమో అనిపించింది. ఆకాష్దీప్ వేసిన చివరి ఓవర్లో, చివరి బంతికి ముందు అతను 194 పరుగులతో ఉన్నాడు. అప్పుడు సిక్సర్ కొట్టి తన డబుల్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అమన్ 154 బంతుల్లో 200 పరుగులు చేశాడు, ఇందులో 13 సిక్సర్లు, 12 ఫోర్లు ఉన్నాయి. అమన్ రావ్ జూన్ 2, 2004న మాడిసన్లో జన్మించాడు. మేడిసన్ అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రంలో ఒక నగరం. అమన్ ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ జట్టులో కనిపించనున్నాడు. ఫ్రాంచైజీ అతన్ని ఆక్షన్లో అతని బేస్ ప్రైస్ 30 లక్షల రూపాయలకు కొనుగోలు చేసింది.అమన్ రావ్ క్రికెట్ కెరీర్ విషయానికొస్తే, అతను లిస్ట్ ఏలో 3 మ్యాచ్లలో 252 పరుగులు చేశాడు. 11 టీ20 మ్యాచ్లలో 2 అర్ధశతకాలతో సహా 301 పరుగులు చేశాడు.

# మెంటార్గా మిథలీ రాజ్



ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో, ముఖ్యంగా క్రికెట్లో సంచలన మార్పులు దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రపంచ స్థాయి ప్రమాణాలను అందుకునేలా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అడుగులు వేస్తోంది. విజయవాడ వేదికగా ఏసీఏ నూతన అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ప్రారంభోత్సవం జరిగింది. ఈ వేడుకే మార్పునకు సంకేతాలు ఇచ్చింది. ఏసీఏ అధ్యక్షుడు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, సెక్రటరీ సానా సతీష్ నేతృత్వంలో ఆంధ్ర క్రికెట్ను సమూలంగా ప్రక్షళన చేస్తూ అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులను తీసుకెళ్లేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ గతేడాది కాలంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టిందని కేశినేని చిన్ని తెలియజేశారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో మార్పులు కనిపిస్తున్నాయని చెప్పుకొచ్చారు. విశాఖ స్టేడియం పునరుద్ధరణ: ఆంధ్ర గడ్డపై అంతర్జాతీయ క్రికెట్కు చిరునామా అయిన విశాఖ స్టేడియాన్ని సరికొత్తగా తీర్చి దిద్దుతున్నారు. స్టేడియంలోని ఛైర్స్ను మార్చడంతోపాటు ప్రధాన మైదానం తరహాలోనే బి గ్రౌండ్ను కూడా అత్యాధునిక రెస్ట్ రూమ్స్, వసతులు కల్పించబోతున్నారు. మంగళగిరి స్పోర్ట్స్ సెంటర్: మంగళగిరి స్టేడియాన్ని కేవలం క్రికెట్ మైదానంగానే కాకుండా ఒక పూర్తి స్థాయి స్పోర్ట్స్ సెంటర్గా మార్చాలని ఏసీఏ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భవిష్యత్లో రాష్ట్ర క్రీడాకారులకు కేంద్ర బిందువుగా మారనుంది. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ ఏ స్థాయిలో శిక్షణ అందిస్తోందో, అదే తరహాలో మూలాడును అభివృద్ధి చేయబోతున్నట్టు చిన్ని వెల్లడించారు. రాయలసీమ అభివృద్ధి: కడప స్టేడియంలో గతంలో మౌలిక వసతుల కొరత ఉండేదని గుర్తించిన ఏసీఏ అక్కడ క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా గదులు నిర్మాణం చేపడుతోంది. ఆంధ్ర క్రికెట్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచే నిర్ణయం తీసుకుంది ఏసీఏ, మహిళా క్రికెట్ దిగ్గజం మిథలీరాజ్ను ఆంధ్ర మహిళా క్రికెట్ జట్టుకు మెంటార్గా నియమించబోతున్నట్టు ఏసీఏ ప్రకటించింది. ఇది రాష్ట్రంలోని మహిళా క్రీడాకారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందనడంలో సందేహం లేదని అంటున్నారు. అంతే కాకుండా ఆంధ్ర రంజీ, సీనియర్ జట్లకు అంతర్జాతీయ కోచింగ్ అనుభవాన్ని అందించేందుకు న్యూజిలాండ్ మాజీ ఆటగాడు ప్రముఖ కోచ్ గ్యారీ స్టీడ్ను రంగంలోకి దించుతున్నారు. ఒక విదేశీ కోచ్ నేతృత్వంలో ఆంధ్ర క్రీడాకారులు శిక్షణ పొందడం వల్ల వారి టెక్నిక్ అంతర్జాతీయ స్థాయికి చేరుతుందని భావిస్తున్నారు. ఏసీఏ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గడిచిన ఏడాది కాలంలో అత్యధిక సంఖ్యలో అంతర్జాతీయ మ్యాల్లు నిర్వహించామన్నారు. ఉమెన్ వరల్డ్ కప్ మ్యాచ్ల నిర్వహణ ఏసీఏ సమర్థతకు నిదర్శనంగా చెప్పుకొచ్చారు. మహిళా క్రీడాకారులను గౌరవించే క్రమంలో స్టేడియం రెండు ప్రధాన ద్వారాలకు మహిళా క్రికెటర్ల పేర్లు పెట్టినట్టు గుర్తు చేశారు. త్వరలోనే రాష్ట్రంలో ఒక ప్రత్యేకమైన మహిళా క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. క్రికెట్ కేవలం నగరాలకే పరిమితం కాకుండా పల్లెటూళ్లకు కూడా విస్తరించాలని ఏసీఏ మరో ప్రోగ్రామ్ చేపట్టనుంది. రూరల్ టాలెంట్ సెర్చ్ పేరుతో కార్యక్రమం చేపట్టనుంది. వారికి ప్రత్యేక కోచింగ్ క్యాంపులు నిర్వహించనున్నారు.

# గిల్, సూర్య, యశస్వి జైస్వాల్ అట్టర్ ఫ్లాప్!

ప్రతిష్టాత్మక విజయ్ హాజరే ట్రోఫీ 2025 టోర్నీఅబశ్రీశ్రీలో బరిలోకి దిగిన భారత వన్డే కెప్టెన్ శుభ్మన్ గిల్, టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్, ఓపెనర్ యశస్వి జైస్వాల్ తీవ్రంగా నిరాశపర్చారు. మంగళవారం జరిగిన ఐదో రౌండ్ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్ల్లో పంజాబ్ తరఫున బరిలోకి దిగిన శుభ్మన్ గిల్.. 12 బంతుల్లో 11 పరుగులే చేసి వెనుదిరిగాడు. గోవాతో జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్లో పంజాబ్ తరఫున బరిలోకి దిగిన శుభ్మన్ గిల్.. తీవ్రంగా నిరాశపరిచాడు. న్యూజిలాండ్తో వన్డే సిరీస్కు ముందు అతని వైఫల్యం ఆందోళన కలిగిస్తోంది. వెస్టిండీస్తో టెస్ట్ సిరీస్ అనంతరం శుభ్మన్ గిల్ ఒక్క చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్లో మెడనొప్పికి గురైన అతను.., టీ20తో పాటు వన్డే సిరీస్కు దూరమయ్యాడు. విజయ్ హజారేతోనే రీఎంట్రీ ఇచ్చిన గిల్ తీవ్రంగా నిరాశపర్చాడు.హిమాచల్ ప్రదేశ్తో జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్లో ముంబై తరఫున బరిలోకి దిగిన యశస్వి జైస్వాల్(15), సూర్యకుమార్ యాదవ్(24) విఫలమయ్యారు. గాయం తర్వాత బరిలోకి దిగిన శ్రేయస్ అయ్యర్(82) మాత్రం టీ20 తరహా బ్యాటింగ్తో చెలరేగాడు. ఈ మ్యాచ్లో ముంబైకి సారథ్యం వహించిన అయ్యర్.. నాలుగో స్థానంలో బ్యాటింగ్ వచ్చి టీ20 తరహాలో ఆడాడు. 53 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్లతో 82 పరుగులతో రాణించాడు. క్యాచ్ ఔట్గా వెనుదిరిగి తృటిలో సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. వర్షం అంతరాయ కలిగించిన ఈ మ్యాచ్ను అంపైర్లు 33 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 33 ఓవర్లలో 9 వికెట్లకు 299 పరుగుల భారీ లక్ష్యాన్ని నమోదు చేసింది.



అయ్యర్తో పాటు ముషీర్ ఖాన్(51 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్లతో 73) హాఫ్ సెంచరీతో రాణించాడు. హైదరాబాద్ తరఫున బరిలోకి దిగిన మహమ్మద్ సిరాజ్(4/58) నాలుగు వికెట్లతో సత్తా చాటాడు. బెంగాల్తో జరిగిన మ్యాచ్లో నిప్పులు చెరిగాడు. ఈ మ్యాచ్లోనే మహమ్మద్ షమీ(3/70) మూడు వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, గిల్, శ్రేయస్, జైస్వాల్.. బుధవారం బరోడాకు వెళ్లనున్నారు. న్యూజిలాండ్అబశ్రీశ్రీతో వన్డే సిరీస్ నేపథ్యంలో అక్కడ జట్టుతో చేరనున్నారు. న్యూజిలాండ్తో తొలి వన్డే జనవరి 11న వడోదర, రెండో వన్డే జనవరి 14న రాజ్కోట్ వేదికగా, మూడో వన్డే జనవరి 18న ఇండోర్లో జరగనుంది.




## రొమాంటిక్ కామెడీ జానర్‌లో నటించాలని ఉంది

**● నటి దీపికా పదుకొనె వెల్లడి**

తనకు రొమాంటిక్ కామెడీ చిత్రాల్లో నటించాలనుందని నటి దీపికా పదుకొణె చెప్పారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా కొంతమంది అభిమానులతో ముచ్చటించారు. రొమాంటిక్ కామెడీ చిత్రాల్లో నటించాలని ఉందని, కచ్చితంగా చేస్తాను. నాకు చాలా ఇష్టమైన జానర్‌లలో అదీ ఒకటి. ప్రేక్షకులు కూడా అలాంటి సినిమాలను ఇష్టపడతారు. నేను, నా టీమ్ కొన్నిరోజులుగా ఇలాంటి కథల కోసం వెతుకుతున్నాం. కానీ, ప్రస్తుతం ఈ రకమైన చిత్రాలకు మద్దతు ఇచ్చే నిర్మాతలు చాలా తక్కువ మంది ఉన్నారు. ఇవి రాసే రైటర్స్ కూడా తగ్గిపోయారని దీపిక అన్నారు. ఒకవేళ ఆ సినిమా చేస్తే.. అందులో హీరోగా ధురంధర్ (రణ్‌వీర్‌సింగ్) అయితే ఓకే అని సరదాగా బదులిచ్చారు.'ఓటీటీ వేదికగా అలాంటి చిత్రాల్లో నేను నటిస్తే మీరు బాధపడరు కదా' అని దీపికా అభిమానులను అడిగారు. దీంతో త్వరలోనే ఈ స్టార్ హీరోయిన్ ఓటీటీ ఎంట్రీ ఇవ్వనున్నారా.. అంటూ వార్తలు మొదలయ్యాయి. చివరిగా దీపిక 'కల్కి 2898ఏడీ'లో సుమతిగా కనిపించి ఆకట్టుకున్నారు. ప్రస్తుతం షారుక్ సరసన 'కింగ్'లో నటిస్తున్నారు. అలాగే అల్లు అర్జున్ హీరోగా అట్లీ తెరకెక్కిస్తున్న ప్రాజెక్ట్‌లోనూ లీడ్ రోల్‌లో సందడి చేయనున్నారు.



## నేనిప్పుడే పెళ్లి చేసుకోవడం లేదు

**● రూమర్స్‌కు చెక్ పెట్టిన మీనాక్షి చౌదరి**

'అనగనగా ఒక రాజు'తో ఈ సంక్రాంతికి అలరించడానికి సిద్ధమయ్యారు నటి మీనాక్షి చౌదరి . నవీన్ పొలిశెట్టితో కలిసి ఆమె నటించిన ఈ చిత్రం జనవరి 14న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మీనాక్షి తన పెళ్లంటూ వస్తోన్న రూమర్స్‌పై స్పందించారు. 'లక్కీ భాస్కర్' తర్వాత తల్లి పాత్రలు చేయడానికి మీకు ఆసక్తి లేదని చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి.. నిజమేనా' అనే ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. అసలు రూమర్స్ ఎలా సృష్టిస్తారో నాకు అర్థం కావట్లేదు. నేను అలాంటి కామెంట్స్ ఎక్కడా చేయలేదు. కథ, పాత్రకు ప్రాధాన్యమిస్తాను. కథ బాగుంటే ఎలాంటి పాత్రలోనైనా చేస్తాను. నేను పెళ్లి చేసుకోనున్నట్లు కూడా ఇటీవల ఎన్నో వార్తలు వచ్చాయి. అలాంటి రూమర్స్ విని నేను అలసిపోయాను. వాటిలో నిజం లేదు. నేను ఇప్పుడే పెళ్లి చేసుకోవడం లేదు' అని మీనాక్షి స్పష్టతనిచ్చారు. టాలీవుడ్ యంగ్ హీరోతో మీనాక్షి ప్రేమలో ఉన్నట్లు ఇటీవల జోరుగా ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారని త్వరలోనే పెళ్లి చేసుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల ఆమె టీమ్ ఈ రూమర్స్‌ను ఖండించినప్పటికీ ఇవి ఆగలేదు. ఇప్పుడు ఏకంగా మీనాక్షినే దీనిపై స్పష్టతనిచ్చి చెక్ పెట్టారు.




## టాక్సిక్‌లో రుక్మిణీ వసంత్

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్‌దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో రుక్మిణి వసంత్ ఉన్నట్లు టీమ్ ప్రకటించింది. ఇందులో ఆమె మెలిసా అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మోడ్రన్ డ్రెస్‌లో పబ్‌లో నడుస్తూ రుక్మిణి కనిపిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్‌ల లుక్‌ను విడుదల చేశారు. ఇప్పుడు రుక్మిణి కూడా అందులో ఉన్నట్లు అధికారికమైంది. దీంతో ఇందులో నలుగురు హీరోయిన్స్ అయ్యారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్‌గా, నయనతార గంగ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది.

## ఉర్రూతలూగించేలా ప్రభాస్ నాచే.నాచే సాంగ్




రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ది రాజా సాబ్‌పై ప్రేక్షకుల్లో అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దర్శకుడు మారుతి హారర్ ఫాంటసీ జానర్‌లో తెరకెక్కిస్తున్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండటంతో ప్రచార కార్యక్రమాలు వేగం పెంచాయి. ఇప్పటికే విడుదలైన 'రెబల్ సాబ్', 'సహనా సహనా' పాటలు, 'రాజే యువరాజే' మ్యూజిక్ బిట్ సినిమాపై ఆసక్తిని పెంచగా, తాజాగా విడుదలైన మరో స్పెషల్ సాంగ్ చర్చనీయాంశంగా మారింది.సోమవారం ముంబైలో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో 'నాచే నాచే' ఫుల్ వీడియో సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ పాట 1982లో మిథున్ చక్రవర్తి నటించిన డిస్కో డ్యాన్సర్ సినిమాలోని సూపర్ హిట్ నంబర్ కోయి యహాన్ నాచే'కు ఆధునిక రీమిక్స్‌గా రూపొందింది. అప్పట్లో బప్పీ లహరి అందించిన ఒరిజినల్ ట్యూన్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత అదే పాటను నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా కొత్త రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. తమన్ ఈ పాటకు ఎనర్జిటిక్ బీట్ ఇచ్చారు. నకాష్ అజీజ్, బృందా కలిసి ఈ పాటను ఆలపించారు. 'నాచే నాచే' పాటలో ప్రభాస్ తన స్టైలిష్ స్వాగ్‌తో పాటు డ్యాన్స్‌లోనూ కొత్త కోణాన్ని చూపించారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ ముగ్గురూ గ్లామర్‌తో పాటు స్టెప్పుల విషయంలోనూ పోటీపడుతూ కనిపించారు. ప్రభాస్‌కు జోడీగా ముగ్గురు హీరోయిన్లు కనిపించడం ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గ్రీస్‌లోని అందమైన లొకేషన్లలో భారీ స్థాయిలో షూట్ చేయడంతో పాట విజువల్స్ గ్రాండ్‌గా కనిపిస్తున్నాయి. కొత్త తరహా కాస్ట్యూమ్స్, స్టైలింగ్ కూడా అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.ఈ పాటను హిందీ, తమిళ్ భాషల్లో విడుదల చేయగా, తెలుగు వెర్షన్‌ను ప్రత్యేకంగా రిలీజ్ చేయడం లేదని చిత్ర బృందం స్పష్టం చేసింది. తెలుగు ప్రేక్షకులు కూడా థియేటర్లలో హిందీ వెర్షన్‌లోనే ఈ పాటను చూడనున్నారు. ఈ నిర్ణయం సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. సంక్రాంతి రేసులో ప్రభాస్ ఈసారి ఎలాంటి మ్యాజిక్ చూపిస్తాడో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## తెలుగు తెరపై సంక్రాంతి సందడి

**● ఏకంగా ఐదు తెలుగు, రెండు డబ్బింగ్ సినిమాల విడుదల**

**● 7న మూవీ ట్రైలర్ల విడుదలకు సన్నాహాలు**




సంక్రాంతి సీజన్ వచ్చిందంటే టాలీవుడ్‌లో పోటీ మామూలుగా ఉండదు. ఈసారి ఆ పోటీ మరింత హాట్‌గా మారింది. మార్కెట్ ఉన్న స్టార్ హీరోలతో పాటు పరభాషా హీరోలు కూడా రంగంలోకి దిగుతుండటంతో థియేటర్లు సందడితో నిండబోతున్నాయి. జనవరి 9 నుంచి 14 మధ్య ఐదు భారీ సినిమాలు విడుదలకు సిద్ధమవుతుండగా, వాటి ప్రమోషన్లు కూడా అదే స్థాయిలో జోరుగా సాగుతున్నాయి. విజయ్, శివకార్తికేయన్ వంటి స్టార్ హీరోల సినిమాలు పక్క భాషల్లో విడుదలవుతుండగా, తెలుగులో 'ది రాజా సాబ్', 'మన శంకర వరప్రసాద్ గారు', 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', 'అనగనగా ఒక రాజు', 'నారీ నారీ నడుమ మురారి' వంటి చిత్రాలు సంక్రాంతి బరిలో నిలిచాయి. ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించేందుకు ట్రైలర్లు, సాంగ్స్, గ్రాండ్ ఈవెంట్స్‌తో మేకర్స్ గట్టి ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలో జనవరి 7వ తేదీ టాలీవుడ్ క్యాలెండర్‌లో ప్రత్యేక రోజుగా మారింది. ఒకే రోజున నాలుగు పెద్ద ఈవెంట్లు జరగనున్నాయి. ఇది ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రమోషన్లలో భాగంగా రెండు ట్రైలర్ లాంచ్ ఈవెంట్స్, ఒక భారీ ప్రీ రిలీజ్ ఈవెంట్, మరో ప్రమోషనల్ ఈవెంట్ ఒకే రోజున ఎ÷-లాన్ చేయడం ఆసక్తికరంగా మారింది. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రానికి జనవరి 7న హైదరాబాద్‌లో ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. దీనికి 'మెగా విక్టరీ ప్రీ రిలీజ్ ఈవెంట్' అనే టైటిల్ పెట్టారు. వేదిక వివరాలు ఇంకా వెల్లడించకపోయినా, ఈ కార్యక్రమంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే రోజు సాయంత్రం 4.05 గంటలకు రవితేజ హీరోగా నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. అలాగే జనవరి 7 సాయంత్రం 6.04 గంటలకు నవీన్ పోలిశెట్టి నటించిన 'అనగనగా ఒక రాజు' ట్రైలర్ విడుదల కార్యక్రమం ప్లాన్ చేశారు. అంతేకాదు, ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్' సినిమా నుంచి కూడా అదే రోజు మరో ప్రమోషనల్ ఈవెంట్ ఉండొచ్చన్న ప్రచారం వినిపిస్తోంది. ఇలా ఒకే రోజున, అది కూడా కేవలం రెండు గంటల వ్యవధిలో రెండు ట్రైలర్ లాంచ్‌లు జరగడం, దానికి తోడు మెగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఉండటం ఇండస్ట్రీలో చర్చకు దారి తీస్తోంది. సంక్రాంతి బాక్సాఫీస్ పోటీలో ఎవరి వ్యూహం ఫలిస్తుందో, ఏ సినిమా జనాలను ఎక్కువగా ఆకట్టుకుంటుందో చూడాలి. జనవరి 7 తర్వాత టాలీవుడ్ హీట్ మరింత పెరగడం ఖాయమనే మాట వినిపిస్తోంది.